# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 12 | సెప్టెంబరు 2026 | వెల : రూ.15

## జీడీపీ కొలతలు : దాచిన రహస్యాలు

## బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!

## వయోజనులు 103 కోట్లైతే, ఓటర్లు 88 కోట్లా?

## ప్రజాస్వామ్యానికి శక్తులు ఉడిగాయా? ఉన్నాయా?

## మృత్యుముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

## భయం పట్టు వదిలిస్తున్న జెన్ జీ నిరసనలు

## మానవ మస్తిష్కానికి దేవుడి స్థానంలో విచక్షణ కావాలి

## భగవత్ సుభాషితాలు - ఆచరణలో విరుద్ధతలు!

## మనువాదులు, చరిత్రలో అశోకుడి కూడా చోటివ్వలేదు!

## చివరి శ్వాస వరకు ప్రజల కోసమే...

## దోపిడీపై పోరాడ్డానికి గొప్ప ఆయుధం ‘విలువ - అదనపు విలువ’ పుస్తకం




2026 సెప్టెంబరు 23 - విజయవాడలో ఈ పుస్తకం
ఆవిష్కరణ సభ సందర్భంగా కొన్ని ప్రత్యేక వ్యాసాలు

## మహా భారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి?

## భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడు ఆచార్య కె.వి.

## మానవీయ మూర్తి కె.వి.

## ఎందరికో స్ఫూర్తి ప్రదాత కె.వి. మాస్టారు

సెప్టెంబరు - 2026 పేజీలు : 42

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 12

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. జీడీపీ కొలతలు : దాచిన రహస్యాలు: సంపాదకీయం 3
2. బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం! - ఎ.కృష్ణారావు 4
3. వయోజనులు 103 కోట్లైతే, ఓటర్లు 88 కోట్లా? -యోగేంద్ర యాదవ్ 6
4. ప్రజాస్వామ్యానికి శక్తులు ఉడిగాయా? ఉన్నాయా? -రాహుల్‌కుమార్ 8
5. మృత్యుముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ - ప్రభాత్ పట్నాయక్ 10
6. భయం పట్టు వదిలిస్తున్న జెన్ జీ నిరసనలు - అశోక్ కుంబము 12
7. మానవ మస్తిష్కానికి దేవుడి స్థానంలో విచక్షణ కావాలి 17
8. భగవత్ సుభాషితాలు - ఆచరణలో విరుద్ధతలు! - ఎం.కోటేశ్వరరావు 19
9. మనువాదులు, చరిత్రలో అశోకుడి క్కూడా చోటివ్వలేదు! - ప్రొ. దేవరాజు మహారాజు 21
10. చివరి శ్వాస వరకు ప్రజల కోసమే... - జి. రాములు 23
11. దోపిడీపై పోరాడ్డానికి గొప్ప ఆయుధం 'విలువ - అదనపు విలువ' పుస్తకం 25
12. మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి? - ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు 28
13. భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడు ఆచార్య కె.వి. - టి.రవిచంద్ 34
14. మానవీయ మూర్తి కె.వి. - ఆర్వీ రామారావు 38
15. ఎందరికో స్ఫూర్తిప్రదాత కె.వి. మాస్టారు - ఎస్.మనోరమ 39
16. కార్టూన్స్ 41
17. కొత్త పుస్తకాల శ్రీకారం 42




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



# జీడీపీ కొలతలు : దాచిన రహస్యాలు

జీడీపీ అంటే స్థూల జాతీయ ఉత్పత్తి. ఇందులో సరుకుల, సేవల ఉత్పత్తులు కలిసి వుంటాయి. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి దీని గణాంకాలను విడుదల చేస్తుంది. ఇదే దేశ ఆర్థికాభివృద్ధి సూచికగా ప్రకటిస్తుంది. సంపద ఎలా పెరిగిపోతున్నదీ, దేశం అభివృద్ధిలో ఎలా దూసుకుపోతున్నదీ వివరించడానికి దీనిని సాధనంగా చేసుకుంటుంది. ఈ సంవత్సరం తొలి అంకంలో (మూడు నెలలలో) జీడీపీ 7.8 శాతంగా వుందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాని మోదీ ఇది తన ప్రభుత్వ ఘనతగా చాటుకున్నారు. అయితే కొందరు ఆర్థికవేత్తలు ఈ లెక్కలపై విమర్శలు కురిపించారు. ఇది జీడీపీ ప్రారంభ సంవత్సరాన్ని మార్చి సాధించినదే తప్ప నిజమైనది కాదంటున్నారు. మరికొందరు ఇందులో కాకుల లెక్కలు ఉన్నాయని అంటున్నారు. జాతీయ స్థూల ఉత్పత్తిలో కార్పొరేట్ రంగం అసంఘటిత రంగాలు రెండు ప్రాధాన్యత వహిస్తాయి. అసంఘటిత రంగంపై ఇప్పటి వరకు ఉత్పత్తికి సంబంధించిన సమగ్రమైన లెక్కలు లేవని అన్ని అంచనాలు, సాంపిల్ సర్వేలు మాత్రమేనని, ఇలాంటి కాకుల లెక్కలతో జీడీపీని లెక్కించకూడదని విమర్శిస్తున్నారు. పైగా కార్పొరేట్ రంగం వృద్ధి రేటునే అసంఘటిత రంగానికి వర్తింపజేసి, చూపిస్తున్నారని ఇలాంటి లెక్కలతో జీడీపీని ప్రకటించడం తగదని హెచ్చరిస్తున్నారు. అసంఘటిత రంగం అనే ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నదని చిన్నచితకా పరిశ్రమలు మూత పడుతున్నాయని, కార్మికులకు వేత రక్షణ లేదని అక్కడ అభివృద్ధి రేటు మందగించిన నేపథ్యంలో వాటిని పరిగణనలోకి తీసుకోకుండా జీడీపీని లెక్కించడం సరికాదని అంటున్నారు. పైగా దేశంలో తయారీ రంగం చతికిలపడి ఎదుగుబొదుగు లేని స్థితి కనిపిస్తుందని ఈ జీడీపీ దానిని ప్రతిబింబించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

జీడీపీ, తలసరి ఆదాయం లెక్కలు అభివృద్ధి సూచికలుగా పరిగణించకూడదు. అవి నిజమైన అభివృద్ధిని తారుమారు చేసి చూపిస్తాయి. నిజంగా జీడీపీలో 7.8 శాతం పెరుగుదల చూపిస్తున్నా అది ప్రజల నిత్య జీవితంలో ఎందుకు ప్రతిఫలించడం లేదు అన్నది కీలమైన అంశం. జీవన ప్రమాణాలు పెరగాలి. నిరుద్యోగం తగ్గాలి. ధరలు అదుపులోకి వుండాలి. కాని, ఇవేమీ దేశంలో మనకు కనిపించడం లేదు. జీడీపీ పెరుగుదల, తలసరి ఆదాయం పెరుగుదల అనేవి చాలా కీలకమైన అంశాలను దాచి పెడతాయి. పెరిగిన జీడీపీలో సింహభాగం కొద్ది మంది దక్కించుకుంటున్నారు.

దేశంలో ఒక శాతం దగ్గర 46 శాతం సంపద పోగు పడిన దానిని జీడీపీ పెరుగుదల దాచి పెడుతుంది. ఈ సంపద కేంద్రీకరణ, ఆదాయాల అంతరాలను జీడీపీ, తలసరి ఆదాయాలు పైకి కనిపించకుండా చేస్తాయి. అందుచేత జీడీపీ పెరుగుదల, తలసరి ఆదాయాల పెరుగుదల ఎవరికి స్వంతం అవుతున్నదో మనకు వివరించదు. మన దేశంలో మానవాభివృద్ధి సూచికలో కింద వుంది. ఆకలి సూచీలో పైన వుంది. ప్రజల కొనుగోలు శక్తి హీనంగా వుంది. ఇంకా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇచ్చే స్థితి వుంది. జీడీపీ పెరుగుదల, తలసరి ఆదాయం పెరుగుదల అంకెలు చూసి సంబరపడకూడదు. ఈ సంపద పెరుగుదల ఎలా పంపిణీ అవుతుంది అన్నదే గీటురాయి కావాలి. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!



- ఎ.కృష్ణారావు

‘లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు’ అని మహా భారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. ‘పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది’ అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. ‘బలవంతుడి శక్తికంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది’ అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతి జ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహా భారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.




తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏకపక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్‌లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది.

భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్–టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్–షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్––చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరుపుకోవాలని ఎన్డీఏ పార్టీలను నిర్దేశిస్తున్న మోదీ వైఖరిలో బ్రిక్స్ అనుభవం తర్వాతనైనా మార్పు వస్తుందా? చెప్పలేం. ❑ **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# వయోజనులు 103 కోట్లైతే, ఓటర్లు 88 కోట్లా?



- యోగేంద్ర యాదవ్

అవునా? – ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ దేశ వ్యాప్తంగా అమలైనప్పుడు చట్టబద్ధమైన ఓటర్ల సంఖ్యకు సంభవించే మొత్తం నష్టానికి సంబంధించి మా తొలి అంచనాలపై చాలామంది ప్రతిస్పందన అది. ఒక సత్యాన్ని తెలుసుకున్నామన్న ఆశ్చర్యకరమైన భావన కొంతమంది స్పందనలో ధ్వనించగా మరి కొంతమంది ఆ ఏక పద ప్రశ్న రూప స్పందనలో మా అంచనాల పట్ల వ్యంగ్యాన్ని ధ్వనింప జేశారు. ఇదలా ఉంచి అసలు విషయానికి వద్దాం. బిహార్‌లో ఓటర్ జాబితాల నుంచి 65 లక్షల పేర్ల తొలగింపునకు సర్ దారి తీసింది. ఆ ప్రకారం చూస్తే, దేశవ్యాప్తంగా దాదాపు పది కోట్ల మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకు సర్ దారితీస్తుందని మేము అంచనా వేశాం. అయితే ఎవరూ మా మాటను విశ్వసించలేదు. అప్పటికీ మేము చేసిన హెచ్చరికల వల్లే బిహార్‌లో అంతిమ తొలగింపుల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో తగ్గింది. సర్ అమలులో అసంగతాలపై మేము దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నాము. ఇప్పుడు తుది గణాంకాలు వచ్చేశాయి. మొత్తం తొలగింపులు మేము ఊహించిన దానికంటే అత్యధికంగా ఉన్నాయి. దీనిపై మనం సత్వరమే మేల్కొనకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.




ప్రధాన రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా సర్ ఓటర్ జాబితాల విడుదలను భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) గత వారం పూర్తి చేసింది. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల ముసాయిదా ఓటర్ జాబితాలను ఇంకా విడుదల చేయవలసి ఉన్నది. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అమలు ఇంకా ప్రారంభం కాలేదు. అయినప్పటికీ దేశవ్యాప్త సర్ ఫలితాల ధోరణి స్పష్టంగా ఉంది. ముసాయిదా స్థాయిలో జరిగిన తొలగింపుల సంఖ్య 13 కోట్ల 37 లక్షలుగా ఉన్నది. ముసాయిదా జాబితాల విడుదల తరువాత మరికొంత మందిని జాబితాలలో చేర్చడం లేదా తొలగించడం సహజం కనుక సర్ అంతిమ జాబితాలలో తొలగింపుల సంఖ్య కొంచెం తక్కువగా ఉండవచ్చు. అదనపు చేర్పులు, సర్ ఇంకా ప్రారంభం కాని రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకున్నప్పుడు భారత్ ఓటర్ జాబితాల నుంచి అంతిమ తొలగింపులు పన్నెండు కోట్లకు పైగా ఉండవచ్చునేది మా అంచనా.

ఈ విషయాన్ని మరింత లోతుగా, విశాలంగా చూద్దాం. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతదేశ ఓటర్ల సంఖ్య 98 కోట్లుగా ఉన్నది. అదే కాలంలో వయోజనుల సంఖ్య (99 కోట్లు)కు ఓటర్ల సంఖ్య ఇంచుమించు సమానంగా ఉన్నది. సర్ లాంఛనంగా ముగిసే నాటికి భారతదేశ వయోజన జనాభా అంచనా 103 కోట్లుగా ఉంటుంది, అంతిమ జాబితాలలోని ఓటర్ల సంఖ్య 88 కోట్లకు తగ్గిపోతుంది. వయోజన జనాభాకు, ఓటర్ల సంఖ్యకు మధ్య ఇంత పెద్ద వ్యత్యాసానికి కారణమేమిటో నిశితంగా చూడవలసిన అవసరమున్నది. ఆ భారీ వ్యత్యాసం రెండు అవకాశాలను సూచిస్తుంది : ఒకటి – బహుశా జనాభా అంచనా భారీగా వేసి ఉండాలి. అంటే అధికారిక అంచనాలలో ఉన్నట్లుగా 145 కోట్లకు పైగా కాకుండా భారత జనాభా 125 కోట్ల లోపే ఉండి ఉండాలి. రెండు – ఓటు వేసే వయసుగల 15 కోట్ల మంది యువత ఓటర్ జాబితాల నుంచి గల్లంతవడం. వీటిలో ఏది నిజం? ఏది నిజమైనప్పటికీ ఆ 'వాస్తవం' అక్షరాలా ఒక లజ్జాకర విషయమని చెప్పక తప్పదు. సర్ ప్రక్రియలో తొలగింపులు అన్నీ తప్పుడువేనని భావించనవసరం లేదు. ప్రస్తుత ఓటర్ జాబితాలలో లొసుగులు, నకిలీ పేర్లు చాలా ఉన్నాయి. కనుక తొలగింపులలో అత్యధిక భాగం న్యాయబద్ధమైనవేనని అంగీకరించాలి. అయినప్పటికీ మూడోవంతు తొలగింపులు సక్రమమైనవి కాకపోయినా ఓటర్ జాబితాలు తారుమారు కావడమనేది ఎంతమాత్రం

ఆమోదయోగ్యం కాని స్థాయిలో జరిగిందనే వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఓటు హక్కు ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేనివారు, అసలు ఓటు హక్కు అందుబాటులోకి రాని వారిని పరిగణనలోకి తీసుకోవల్సి వుంది. సర్‌కు పూర్వపు జాబితాలలో లేని అర్హులైన ఓటర్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో చాలామంది పేర్లను సర్ ప్రారంభం కాకముందే జాబితాల నుంచి తొలగించారు. ఈ అవకతవకలన్నిటినీ సర్ సరిదిద్దలేదు. దీన్నిబట్టి వయోజన జనాభా సంఖ్యకు, ఓటర్ల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు ఉన్నదో అర్థమవుతుంది.

మరి ఆ వ్యత్యాసం సర్ తదుపరి దశలలో క్రమేణా తగ్గిందా? లేదు. లేకపోగా ప్రతి దశలోనూ ఓటర్ తొలగింపుల విస్తృతి, స్వభావం మరింత ప్రతికూల మార్పులకు లోనయ్యాయి. 'సర్'ను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచారు. అది తొలి మార్గదర్శక దశ. బిహార్‌కే పరిమితమైన ఆ దశలో ఓటర్ జాబితాల నుంచి తొలుత 65 లక్షల పేర్లను తొలగించారు. అయితే న్యాయవ్యవస్థ జోక్యంతో ఆ తొలగింపులు అంతిమంగా 45 లక్షలకు తగ్గిపోయాయి. బిహార్ తరువాత 13 రాష్ట్రాలలో సర్ రెండో దశ ప్రారంభమయ్యే నాటికే ఆ ప్రక్రియ పట్ల ప్రజలు ఉదాసీనత వహించారు. రాజకీయ పక్షాలు ఉపేక్షాభావం చూపాయి. అప్పటికే బిహార్ ఎన్నికలు జరిగిపోయినందున ప్రజలు 'సర్'కు అలవాటుపడ్డారు. ఓటర్ల సంఖ్యలో దాదాపు 13శాతం తగ్గుదలను చాలావరకు ఎవరూ ప్రశ్నించలేదు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఓటర్ల తొలగింపు మీద మాత్రం జాతీయ స్థాయిలో పౌరసమాజం దృష్టి పెట్టింది. సర్ అమలు తీరుతెన్నులపై సంపూర్ణ నిర్ణయాధికారం ఎన్నికల సంఘానిదేనని సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను తాను నిర్ణయించుకున్న రీతిలో అమలుపరిచింది. మూడో దశ ముసాయిదా సర్ జాబితాలలో ఓటర్ల తొలగింపులు 17శాతానికి పైగా పెరిగాయి!

సర్ మూడో దశ అమలైన హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణతోపాటు ఢిల్లీలో ఓటర్ల తొలగింపులు అసాధారణంగా అత్యధిక సంఖ్యలో చోటుచేసుకున్నాయి. మూడు దశలలోను 'మృతుల' కేటగిరీలోని ఓటర్ల నిష్పత్తి స్థిరంగా ఉన్నది. మొత్తం తొలగింపులలో 'మృతుల' తొలగింపులు ఇంచుమించు 3 శాతంగా ఉన్నాయి. ఇవి కాకుండా 'అందుబాటులో లేకపోవడం' (ఆబ్సెంట్), 'వలస వెళ్లడం' (షిఫ్టెడ్) కారణాలతో కూడా పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించారు. గమనార్హమైన విషయమేమిటం టే ఆబ్సెంట్, షిఫ్టెడ్ కేటగిరీలను ఇప్పటివరకు స్పష్టంగా నిర్వచించలేదు. దీంతో స్థానిక ఎన్నికల అధికారులు తమకు తోచిన విధంగా ఆ కేటగిరీలను ఉపయోగించారు. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనవారే కాకుండా అదనంగా మరో అయిదోవంతు మంది ఓటర్లు 'అన్ మ్యాప్డ్' (జాబితాలో చేర్చని) లేదా 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (తార్కిక వ్యత్యాసం) కారణాల వల్ల మరింత పరిశీలనను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒడిషా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'తార్కిక వ్యత్యాసం' నిష్పత్తి అసాధారణంగా హెచ్చుస్థాయిలో ఉన్నది. కారణమేమిటి? కంప్యూటర్ అల్గారిథమ్ కంటే మరేదో పెద్ద కారణం ఉందని చెప్పక తప్పదు. అటువంటి వ్యత్యాసాలను ఎలా పరిష్కరించాలనే దానికి సంబంధించి ఎలాంటి ప్రామాణిక కార్యాచరణ విధానం కూడా లేదు. నిష్కర్షగా చెప్పాలంటే 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అనేది ఒక పద్ధతి కాదనేది స్పష్టం. ఉద్దేశపూర్వకంగా రూపొందించిన, అనుసరిస్తున్న ఒక ఏకపక్ష వైఖరి.

సర్ మూడో దశలో ఒక కొత్త దురాచారం ఆరంభమయింది: చాలా రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కాకముందే ఓటర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగాయి. వీరు మళ్లీ ఓటర్‌గా నమోదయ్యేందుకు వీలుగా కనీసం ఒక ఎన్యూమరేషన్ ఫామ్‌ను సైతం అందుకోలేదు. వారి తొలగింపులు చాలా అనామకంగా జరిగిపోయాయి. 'ఇవి సర్ తొలగింపుల కిందకు రావు' అనేది గమనార్హమైన వాస్తవం. సర్ మూడో దశకు షెడ్యూలు ప్రకటించిన మే 12, సర్ అధికారికంగా ప్రారంభమైన రోజుకు మధ్య 14 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. వీటిలో అత్యధిక భాగం 8 లక్షలు మహారాష్ట్రలో జరిగాయి. 2025 ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం, 2026లో సర్ ప్రక్రియ అమలు ఆరంభం మధ్య కాలంలో ఢిల్లీలో ఓటర్ల సంఖ్య 11 లక్షలకు పైగా తగ్గిపోయింది. ఇదీ కారణం అని చెప్పేందుకు వీలుకాని పరిణామమిది. గత ఏడాది 1.56 కోట్లుగా ఉన్న ఢిల్లీ ఓటర్ల సంఖ్య సర్ ముసాయిదా ఓటర్ జాబితాల విడుదల నాటికి 98 లక్షలకు తగ్గిపోయింది.

ఇవన్నీ స్పష్టం చేస్తున్నదేమిటి? సర్ డేటా అవకతవకలమయంగానూ, అసంబద్ధంగానూ ఉన్నది. డేటా క్రమరాహిత్యం, అసంగతాన్ని మాత్రమే మనం ఎదుర్కొనడం లేదు. సర్ రూపేణా ఎన్నికల ప్రజాస్వామ్య పునాదులనే పునర్నిర్మించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. 'సర్' రూపకల్పన, అమలు, ఫలితాలతో సహా మొత్తం ప్రక్రియపై పూర్తి స్థాయి బహిరంగ తనిఖీ (పబ్లిక్ ఆడిట్) జరిగి తీరాలి. ఇది ఓఅత్యవసరం. ఇందుకు భారత ఎన్నికల సంఘంతో సంబంధం లేని ఒక స్వతంత్ర సంస్థ మనకు కావాలి. ఈ ప్రజా తనిఖీ సత్వరమే జరగడం శ్రేయస్కరం. సర్ సత్యాసత్యాలను తెలుసుకోవాలని సమస్త భారతీయులూ కోరుకుంటున్నారు. ❑

# ప్రజాస్వామ్యానికి శక్తులు ఉడిగాయా? ఉన్నాయా?

- రాహుల్‌కుమార్



క్రమబద్ధంగా జరిగే ఎన్నికలూ, అధిక సంఖ్యలో పాల్గొనే ఓటర్లూ, శాంతియుతంగా ప్రభుత్వాలు మారటాలూ.. ప్రజాస్వామ్యమంటే ఇదే అనుకుంటాం. ఇలా చూస్తే మన ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే ఘనమైందిగా కనిపిస్తుంది. ఏ దేశమూ మనకు సాటిరానిదిగానే అనిపిస్తుంది. దీన్నే అసలుసిసలైన ప్రజాస్వామ్యంగా భావిస్తే అందరికంటే ర్యాంకుల్లో మనమే ముందుంటాం. కానీ వీ-డెమ్ (వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ) ఇనిస్టిట్యూట్ తాజాగా మన ప్రజాస్వామ్యానికి ఇచ్చిన ర్యాంకు చాలా దయనీయంగా ఉది. 179 దేశాల్లో భారత్‌కు 106వ స్థానం లభించింది. కిందటి ఏడాది 100వ ర్యాంకు ఉంటే అది ఈ ఏడాది 106కు పడిపోయింది. అన్నిరకాల ప్రాథమిక హక్కులను హరించివేసిన 1975 నాటి ఎమర్జన్సీ కాలం తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఇంతటి దుస్థితికి దిగజారటం ఇప్పుడేనని వీ-డెమ్ నివేదిక పేర్కొంది.



ఎన్నికల ద్వారా అధికారాన్ని కైవసం చేసుకునే పార్టీలూ, నేతలూ నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తూ, అసమ్మతిని నయానాభయానా అణచి, వ్యవస్థలన్నిటి నీ నిర్వీర్యం చేసి.. తమకు ఎదురులేని రీతిలో వ్యవహారాలను నడపటాన్ని 'ఎల క్టోరల్ అటోక్రసీ'గా వర్ణించటం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. భారత్‌ను ఆ కోవలోకి చేర్చటమే కాదు.. తాజా నివేదికలో మన దేశాన్ని పాకిస్థాన్, కజకిస్థాన్ సరసన వీడెమ్ నివేదిక నిల బెట్టింది. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం లోపించటం, ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తితో వ్యవహరించలేకపోవటం, ప్రభుత్వ యంత్రాంగంలో నిష్పాక్షికత గణనీయంగా క్షీణించటం అనేవి ఒక ప్రజాస్వామ్య దేశంగా భారత్ ర్యాంకు పడిపోవటానికి కారణాలుగా వీ-డెమ్ వ్యాఖ్యానించింది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు అడ్డంకులూ, పౌరసమాజానికి తన గళం వినిపించటంలో వివిధ రూపాల్లో ఎదురయ్యే ఇబ్బందులూ భారత ప్రజాస్వామ్య నాణ్యతను బాగా దెబ్బతీశా యని విమర్శించింది. ఎలక్టోరల్ అటోక్రసీ మీదే గాక, 'డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్' అనే పేరు మీద కూడా ఇటీవల కాలంలో చాలా రచనలు వచ్చాయి. ఎలక్టోరల్ అటోక్రసీ అన్నా, డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్ అన్నా అర్థంలో పెద్దగా తేడాలేదు. ప్రజాస్వామ్యం అన్ని విధాలుగా దిగజారి ఆలోచనల్లో ఆచరణలో నియంతృత్వ ధోరణులు పెరుగుతున్నాయని చెప్పటానికే ఆ రెండు పదబంధాలను వాడుతున్నారు. ప్రజాస్వామ్య క్షీణతా, నియంతృత్వ ధోరణుల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ప్రబలం అవుతుంటే, వాటి తాలూకూ విపరిణామాల వల్ల నష్టపోయేది సాధారణ ప్రజలే. ముఖ్యంగా పెద్దగా ఆస్తిపాస్తులూ లేకుండా వేతనాల మీద ఆధారపడేవారే అందులో ప్రధానంగా ఉంటారు. సంపదలో, ఆదాయంలో వాటా తక్కువగా ఉన్నవాళ్లే గొంతెత్తాల్సి వస్తుంది. అలా ఎత్తే అవకాశాలను తగ్గించటం ప్రజాస్వామ్య దేశాల్లో కూడా ఎక్కువవుతోంది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో మత, జాతి విద్వేషాల చుట్టూ ప్రజలను ఊపేసే నాయకులు రంగం మీదకు వస్తారు. వీళ్లందరూ ఎన్నికల్లో మెజారిటీ జనాభిమానం పొందుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వా మ్యాన్ని లోపల నుంచీ బలహీనపరుస్తారు. 2000 సంవత్సరం తర్వాత అన్ని దేశాల్లో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగాయి. వీటితోపాటే అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తామనే జనాకర్షక నేతల ప్రాబల్యమూ పెరిగింది. భారత్ లాంటి దేశాల్లోనే కాదు.. అమెరికాలో సైతం ప్రజాస్వామ్య క్షీణతపై ఆలోచనా పరుల్లో భయం పట్టుకుంది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను బహిరంగంగా తూలనాడటం, ఫలానా విధంగా తీర్పులు ఇవ్వాలని న్యాయస్థానాలను హెచ్చరించటం, చట్టసభలను ఖాతరు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం లాంటివి ప్రపంచ దేశాలన్నిటి మీదా ప్రభావం చూపుతున్నాయి. అన్నింటా అమెరికా వైపు చూసే వివిధ దేశాల్లోని పాలకులకు తాము ఆ దారిలో ఇంకా ఎక్కువ వేగంగా అడుగులు వేసేలా అవి ప్రేరణను ఇస్తున్నాయి.

ప్రజాస్వామ్యానికి అన్ని వైపుల నుంచి ఇలా సమస్యలు చుట్టుముడుతున్న నేపథ్యంలో దాని మనుగడపైనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఆర్థికశాస్త్రంలో రెండేళ్ల క్రితం నోబుల్ బహుమతి పొందిన డరాన్ అసెమోగ్లూ ఈ సమస్యలన్నిటినీ విశ్లేషిస్తూ 'ఉదారవాద ప్రజాస్వామ్యానికి ఏమైంది?' అంటూ తాజాగా ఒక సమగ్ర పుస్తకాన్ని ప్రచురించారు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే ఏం చేయాలన్నదే ఆయనకు ప్రధానం కాబట్టి ఆ కోణంలోనే కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆధునిక రాజకీయాల్లో ప్రజాస్వామ్యాన్ని అత్యుత్తమ వ్యవస్థగా, జీవన విధానంగా భావించే వారికి ఆయన ప్రతిపాదనలు ఆలోచనాత్మకంగా ఉంటాయి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే దాన్ని మళ్లీ సాధారణ ప్రజల జీవితాలను మెరుగుపరచేలా చేయగలగాలి. దాన్నే ఆయన ‘వర్కింగ్ క్లాస్ లిబరలిజం’గా వర్ణించారు. అమెరికా, పశ్చిమ యూరపు దేశాల్లో రెండో ప్రపంచయుద్ధం ముగిసిన నాటి నుంచి దాదాపు 30 ఏళ్లు ప్రజల జీవనప్రమాణాలు విశేషంగా మెరుగు పడ్డాయి. ఆర్థికరంగాన్నీ, ప్రజల, కార్మికుల బాగోగులనూ మార్కెట్ శక్తులకే వదలివేయకుండా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ప్రజల సామాజిక, ఆర్థిక సంక్షేమాన్ని పాలనకు ముఖ్య కర్తవ్యంగా భావించాయి. ఈ కారణంగానే ప్రజలు ఉదార ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని పెంచుకున్నారు. ప్రజా స్వామ్య రాజకీయ వ్యవస్థ తమకు అండగా ఉంటుందని భావించారు. 1950ల తర్వాత పరిశ్రమలు పెరిగాయి. ఉద్యోగా లు పెరిగాయి. కార్మికుల జీతాలు పెరిగాయి. మధ్యతరగతి విస్తరించింది. ప్రభుత్వసేవలు మెరుగయ్యాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో పురోగతి సాధ్యమైంది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు అన్నివర్గాల ప్రజలకూ చేరటం వల్ల ‘ఈ వ్యవస్థలో నాకూ స్థానం ఉంది’ అన్న భావన ప్రజల్లో బలపడింది.

ఒకప్పుడు స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ విజయవంతమైన నమూనాగా లిబరల్ డెమొక్రసీ కనపడింది. ఇప్పుడు దానికి గండిపడింది. ప్రజలతో ఆర్థిక, రాజకీయ సంబంధాన్ని క్రమంగా డెమొక్రసీ కోల్పోయింది. ఇది ఒక్కసారి గా జరగలేదు. 1980ల తర్వాత మొదలై 2000ల తర్వాత తీవ్రమైంది. ‘మా ఉద్యోగాలు భద్రంగా లేవు. మా ఆదాయం పెద్దగా పెరగటం లేదు. మా పిల్లల భవిష్యత్తు మాకంటే మెరుగ్గా ఉంటుందన్న నమ్మకం కలగటం లేదు. రాజకీయ నాయకులు మా వినతులను వినటం లేదు. దేశం అభివృద్ధి అవుతోంది. కానీ ఆ ప్రయోజనం మాకు తగినంతగా దక్కటం లేదు’ అన్న మాట లు సగటు మనుషుల నుంచి వినిపించటం ఇప్పుడు సాధారణ మైంది. ‘ప్రతి వ్యక్తికీ తనకు నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉంది’.. లిబరలిజం అంటే అంతకు మించి ఏముంటుంది? అని అనుకుంటే సంక్షోభం అర్థంకాదు. నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉండటం వల్ల జీవన ప్రమాణాలు వాటంతట అవే పెరగవు. స్వేచ్ఛను ఉపయోగించుకుని మెరుగైన జీవితాన్ని ఏర్పరచుకునే పరిస్థితులనూ, అవకాశాలనూ ప్రభుత్వాలు సృష్టించాలి. ఒకప్పు డు లక్షలాది కార్మికుల అవసరం ఉండేది. కార్మికులు కూడా సంఘటితంగా ఉండి డిమాండ్లు సాధించుకునేవారు. ఎక్కువ జీతాల కోసం పోరాడగలిగేవారు. వారికి రాజకీయ ప్రాధాన్యత ఉండేది. ఇప్పుడన్నీ పోయాయి. ఆటోమేషన్ పెరిగింది. ఫ్యాక్టరీ లు కనుమరుగయ్యాయి. కార్మిక సంఘాలు బలహీనపడిపోయా యి. 1990ల తర్వాత (పోస్ట్ ఇండస్ట్రియల్) బాగా ఉన్నత చదువులు చదివిన వారికీ, టెక్నాలజీ నిపుణులకూ ప్రాధాన్యం పెరిగింది. ఉద్యోగాలన్నీ ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ రంగాలకు తరలిపోయాయి. సాధారణ చదువులు చదివినవారు వెనుకబడిపోయారు. వేతనాల్లోనూ విపరీత వ్యత్యాసాలు పెరిగా యి. సంప్రదాయ పరిశ్రమలు, రంగాలపై ఆధారపడిన వాళ్లు స్థిరత్వాన్ని కోల్పోయారు. అందుకే కొద్ది ఉద్యోగాలను మాత్రమే కల్పించే విధానాలకు పెద్దపీట వేసిన నిపుణుల పట్ల వ్యతిరేకత ప్రబలింది. రాజకీయాల్లోనూ ఉన్నతవర్గాల ప్రాబల్యం పెరిగింది. వీరందరిపై మధ్య, కింది వర్గాల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఉపయోగించుకుని ట్రంప్ లాంటి నేతలు అధికారంలోకి వచ్చారు. ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్న విధానాలపైనా, వాటి సృష్టికర్తపైనా పోరాడుతున్నామంటూ ఉద్రేక ప్రసంగాలు చేసి ఎన్నికల్లో గెలిచారు.

ఐటీ విప్లవం, ఆటోమేషన్ కలిగించిన సామాజిక, ఆర్థిక, రాజ కీయ పరిణామాల నుంచి కృత్రిమమేధ (ఏఐ) కూడా ప్రజలను గట్టెక్కించలేదు. ఏఐని ఎవరికి ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తు న్నారో పరిశీలిస్తే కానీ దాని ప్రభావం అర్థంకాదు. కార్మికులను తొలగించటం, నిరుద్యోగ భయాన్ని మరింత పెంచటం, వీటితో పాటు అసమానతలు మరింత హెచ్చేలా చేయటం.. ఏఐ వల్ల జరిగితే సంక్షోభం యథాతథంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నమ్మకం మరింతగా సడలిపోతుంది. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ తమకు ఏమీ చేయటం లేదన్న భావనను మరింత ఎక్కువ చేస్తుంది. లిబరల్ డెమొక్రసీని కాపాడుకోవాలంటే అది మళ్లీ సాధారణ ప్రజల జీవితాల మెరుగుదలకు తోడ్పడాలి. గౌరవంగా జీవించగల ఉద్యోగాలను కల్పించాలి. ఏమీ చేయలేని అశక్తులుగా ఉద్యోగులను మార్చకూడదు. అభివృద్ధి ఫలాలు(షేర్డ్ ప్రాస్పరిటీ) విస్తృతంగా ప్రజలకు చేరాలి. విధాన నిర్ణయాల్లో కేంద్రీకరణకు స్వస్తిపలకాలి. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ప్రజలకు సామాజిక, ఆర్థిక, ఉద్యోగ భద్రతనూ, నిజమైన రాజకీయ భాగస్వామ్యాన్నీ అందిస్తేనే లిబరల్ డెమొక్రసీ భవిత పదిలంగా ఉంటుంది. అది చేయలేనప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు చూస్తారు. లిబరల్ డెమొక్రసీకి అప్పుడు అసలైన ప్రమాదం ముంచుకొస్తుంది. ప్రధాన స్రవంతికి చెందిన అసెమొగ్లూ లాంటి ఆర్థికవేత్తలు కూడా విపరీత సంపద, ఆదాయ కేంద్రీకరణలతో వచ్చే సమస్యలు సమాజాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ఛిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించటం చాలా మందిని ఆలోచింప చేస్తోంది. టెక్నాల జీని... అది ఏఐ అయినా... మరొకటైనా దాని మానాన దాన్ని వదిలేస్తే మొదటికే మోసం తెస్తుంది. హఠాత్తుగా ఎందరి జీవితా లనో తారుమారు చేస్తుంది. హద్దుల్లేని లాభార్జన, అడ్డూఅదుపూ లేకుండా సంపదలు కొందరి చేతుల్లో పోగుపడటం సమాజాన్ని నిరాశమయంగా మార్చుతుంది. నిరాశ ఆవహించిన మనుషు లూ, సమాజాలూ ఎప్పటికైనా ప్రమాదకరమే! ఆ ప్రమాదం ముదిరితే లిబరల్ డెమొక్రసీకీ కష్టకాలమే! ❑

# మృత్యుముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ



- ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీన పడుతూ క్షీణిస్తున్న లక్షణాలు మనకి బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇటువంటి లక్షణాలు వ్యక్తం కావడం అనేది మాత్రం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు ఇటువంటి లక్షణాలే 1914-1945 మధ్య కాలంలో కూడా కనిపించాయి. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ జబ్బుపడ్డ వ్యవస్థ అని లెనిన్ చేసిన రోగ నిర్ధారణ సరైనదే అని అప్పుడే రుజువైంది. అప్పటికి, ఇప్పటికి తేడా అంతా వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిన ప్పుడు అది స్పందించిన తీరులోనే ఉంది. అప్పుడు ఈ వ్యవస్థ ఒక పథకం ప్రకారం కాని, లేక అనివార్యం అయినందువలన కాని తనను తాను "సంస్కరించు కోవడానికి" సిద్ధపడింది. కనీసం మూడు ప్రత్యేక విధాలుగా ఈ సంస్కరణ జరిగింది. మొదటిది- రాజకీయంగా వలస విధానానికి తెర దించడం. విన్‌స్టన్ చర్చిల్ వంటి బూర్జువా నాయకులు అప్పుడు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. వలసల మీద పెత్తనాన్ని వదులుకున్నా, మూడవ ప్రపంచ దేశాల వనరుల మీద పెత్తనాన్ని వేరే పద్ధతుల ద్వారా చెలాయించడానికి పూనుకున్నారు. రెండవది-ప్రపంచంలోని ప్రధాన పెట్టుబడి దారీ దేశాలలో ఎన్నికల ప్రజా స్వామ్యాన్ని ఒక వ్యక్తి-ఒక ఓటు సూత్రం ప్రాతిపదికన అమలు చేయడం, మూడవది- నిరుద్యోగాన్ని తగ్గించి తద్వారా స్థూల డిమాండ్‌ను పెంచడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకోవడం. యూరప్‌లో ఈ చర్యల వలన భారీగా సంక్షేమ ఖర్చు పెరిగింది. అదే అమెరికాలోనైతే భారీ సైనిక వ్యయం ద్వారా రాజ్యం జోక్యం చేసుకుంది. మొదటి రెండు చర్యల వలన పెట్టుబడిదారీ వ్యవస్థ కు ఎటువంటి సవాలైనా ఎదురైతే దానిని తట్టుకుని నిలబడడానికి మూడవ చర్య తోడ్పడింది. ఆ విధంగా ఇది ముఖ్యమైనది.

పెట్టుబడిదారీ వ్యవస్థ "మానవీయ"మైనదని, "ప్రజాస్వామ్య యుత"మైనదని, దాదాపు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పన చేయగలుగుతుందని ఆ విధంగా అది సోషలిజం కన్నా ఉన్నత మైనదని చెప్పుకుని తన ఉనికికి ఎదురైన సవాలుని తట్టుకుని సంక్షోభాన్ని అధిగమించగలిగింది. తన కొత్త రూపాన్ని చూపి ప్రపంచాన్ని చాలా బలంగా నమ్మించగలిగింది కూడా. మరోవైపు మూడవ ప్రపంచ దేశాలలోని వివిధ అధినేతలను హత్యలు గావించడం, మరికొన్ని దేశాల్లో కుట్రల ద్వారా ప్రభుత్వాలను కూలదోసి తన తొత్తులను గద్దెనెక్కించడం వంటివి కొనసాగిస్తూనేవచ్చింది. మొస్సాదెహ్ నుంచి ఆర్బెంజ్ వరకు,




లుముంబా నుండి అలెండీ వరకు జరిగినవి మాత్రమే కాదు, కొరియాలో, వియత్నాంలో అది సాగించిన దురాగతాల గురించి వేరే చెప్పనక్కర్లేదు.

తన ఉనికికి సంక్షోభం నుంచి ఎదురైన సవాలును తట్టుకోడానికి అది ప్రారంభించిన పెట్టుబడిదారీ దశను "పెట్టుబడి దారీ విధానపు స్వర్ణయుగం" అని పిలుస్తారు. అంతకు మునుపటి పరిస్థితితో పోల్చితే ఇది సాపేక్షంగా కొత్తది, విభిన్న మైనది. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమంటే అప్పటి మాదిరిగా మార్కెట్లో డిమాండ్ ను పెంచడం కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఇప్పుడు ఇంకెంత మాత్రమూ సాధ్యం కాదు. ఇప్పుడు డిమాండ్‌ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచాలంటే అందుకు ద్రవ్యలోటును పెంచడం కాని, లేదా ధనవంతుల మీద పన్నులను పెంచడం కాని చేయాలి. కార్మికవర్గం మీద పన్నులు పెంచడం వలన డిమాండ్ పెరుగుదల ఉండదు. వారి ఆదాయాలను కార్మికులు ఎటుతిరిగీ ఖర్చు చేసేస్తారు. పన్నులను వారిమీద అదనంగా వేస్తే అప్పుడు ఆ ఖర్చు తగ్గిపోయి డిమాండ్ తగ్గిపోతుంది. అప్పుడు ప్రభుత్వానికి వచ్చిన పన్ను రాబడిని ఖర్చు చేసినా మొత్తంగా చూసినప్పుడు డిమాండ్ పెరుగుదల ఏమీ ఉండదు. దానిని పక్కన పెడితే మిగిలినవి రెండు- ద్రవ్యలోటును పెంచడం లేదా ధనవంతుల మీద పన్ను పెంచడం. ఈ రెండు చర్యలనీ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు (ఎందుకంటే అత్యంత సంపన్నుల దగ్గరే ద్రవ్య పెట్టుబడి ఎక్కువగా పోగుబడి వుంటుంది). పైగా ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. కానీ, రాజ్యాలు ఇంకా జాతి రాజ్యాలుగానే కొనసాగుతున్నాయి. పెట్టుబడి దేశం నుండి పలాయనం చిత్తగించకుండా ఉండాలంటే అప్పుడు అంతర్జాతీయ ద్రవ్య

పెట్టుబడే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది.

అందుచేత ఇప్పుడు నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక మాంద్యం రూపంలో ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి ఉపశమనం పొందే దారి ఏదీ లేదు. ఆదాయాల్లో విపరీతంగా పెరిగిపోయిన అసమానతలే ఈ మాంద్యానికి దారి తీశాయి. దాంతో నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు దారి మూసుకుపోయింది. వ్యవస్థ ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయిన ప్పటికీ, దానిని అధిగమించడానికి అది ఏమీ చేయలేని స్థితిలో ఉంది. ఇన్నాళ్లూ పెట్టుబడిదారీ వ్యవస్థ తనను గురించి తాను చిత్రించిన రూపానికి పూర్తి విరుద్ధమైన లక్షణాలను మనం ఇప్పుడు చూస్తున్నాం.

అన్నింటికన్నా ముందు ప్రజాస్వామ్యం మీద వాస్తవమైన దాడి జరుగుతోంది. పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా ఇప్పుడు పచ్చి నయా ఫాసిస్టు ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి, లేదా ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి. అన్ని చోట్లా ప్రభుత్వ విధానాల మీద ప్రజాగ్రహం పెరుగుతోంది. దానిని వ్యక్తం చేసినవారిమీద మెకార్థీయిస్టు పద్ధతుల్లో వేధింపులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు ప్రపంచంలో అత్యధిక పెట్టుబడిదారీ దేశాల్లో పాలస్తీనా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హననం పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొంది. కాని ఆ దేశాల ప్రభుత్వాలు మాత్రం ఇజ్రాయిల్ కి మద్దతుగా వ్యవహరిస్తున్నాయి (ఒక్క స్పెయిన్ మాత్రమే మినహాయింపు). అంతేగాక, పాలస్తీనా మద్దతు దారులకు అనుకూలంగా ప్రజలు చేపట్టిన కార్యక్రమాలను తీవ్రంగా అణచి వేస్తున్నాయి. తన దేశం ఎటువంటి అసమ్మతినైనా అనుమతిస్తుందని గర్వంగా చెప్పుకునే బ్రిటన్ ఇప్పుడు పాలస్తీనాకు అనుకూలంగా ప్రసంగించిన విద్యార్థులను "ఉగ్రవాదులు" అంటూ వారిపై కేసులు పెట్టి విచారిస్తోంది. అలా కేసులను ఎదుర్కొంటున్న వారిలో మెజారిటీ మీద ఇంతవరకూ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. ఇటువంటి పరిస్థితే తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఉంది. జర్మనీ వంటి దేశాల్లో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు చేయడాన్ని నిషేధించారు. జాతి హననాన్ని సైతం బలపరచడమే కాకుండా, రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ముందెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ హక్కులను పరిరక్షిస్తుందని చెప్పుకుంటూ వచ్చినదంతా బూటకం అని తేలిపోయింది.

నయా ఉదారవాద శకంలో పెరిగిన ఈ నిరంకుశ అణచివేత విధానాలకు తోడు ఇప్పుడు అమెరికా మూడవ ప్రపంచ దేశాలను తిరిగి తన వలసలుగా మార్చుకోడానికి పూనుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్ ఈ ఎజెండాను తన ప్రసంగాల్లో వ్యక్తీకరించడమే కాక, వెనిజులా లోకి చొరబడడం, ఇరాన్ మీద సైనిక దాడులను కొనసాగించడం, గ్రీన్‌లాండ్ మీద, తక్కిన దేశాల మీద దాడులకు పథకాలను రచించడం ద్వారా ఆచరణలోకి సైతం దిగిపోయాడు. ఈ ప్రయత్నంలో అమెరికా తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాల మద్దతును కోరుతోంది. ఆ విధంగా తాను స్వేచ్ఛకు మద్దతునిచ్చే వ్యవస్థనని యుద్ధానంతర కాలంలో చెప్పుకున్నదానికి పూర్తి విరుద్ధంగా ఇప్పుడు సామ్రాజ్యవాదం వ్యవహరిస్తోంది.

వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ముందుకు తెచ్చిన వాదనల ప్రభావం ఇంకా యూరప్‌లోని పెట్టుబడిదారీ దేశాల్లో ఏమైనా మిగిలి వుందేమోననే అనుమానం అమెరికాకు ఉంది. అందుచేత ఇటీవల మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రసంగిస్తూ ఐదు వందల సంవత్సరాల వలస విధానం గురించి చాలా గొప్పగా ప్రశంసించాడు. మళ్ళీ ఆనాటి పరిస్థితులకు మళ్ళాలని పిలుపునిచ్చాడు. ఎటువంటి జంకు గాని, సిగ్గూఎగ్గూ గాని లేకుండా అతడు మాట్లాడినదానిని బట్టి పరిశీలకులు అది మళ్ళీ వలస విధానాన్ని అమలు చేయడానికి ఇచ్చిన పిలుపు అని నిర్ధారిస్తున్నారు. వలస పాలకులుగా ఉండిన యూరోపియన్ దేశాలు తమ గతాన్ని గురించి సిగ్గుపడవలసినది ఏమీ లేదని రూబియో మాట్లాడినప్పుడు ఆ సమావేశంలో ఉన్న యూరోపియన్ ప్రభుత్వాల అధినేతలందరూ నిస్సిగ్గుగా కరతాళ ధ్వనులతో స్వాగతించారు.

ఫాసిజానికి, వలస విధానానికి చాలా దగ్గర సంబంధమే ఉంది. ఫాసిజం తలెత్తే నేపథ్యాలు వేరువేరుగా ఉండవచ్చు కాని సంక్షోభ సమయంలో గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజల దృష్టిని పక్కదోవ పట్టించే ప్రత్యామ్నాయ చర్చలను లేవనెత్తగలిగేది ఫాసిజమే. ఫాసిజం అమలు చేసే హింసాత్మక పద్ధతులన్నీ మొదట వలస దేశాల్లోనే ప్రయోగించి చూశారు. యూరప్‌లో ఫాసిజాన్ని అమలు చేయడానికి ముందు...నమీబియాలో నామా, హెరెరో తెగల ప్రజల మీద...జర్మనీ అమానవీయంగా క్రూరత్వాన్ని ప్రయోగించింది. బెల్జియం రాజు లియోపాల్డ్ కాంగోలో పది లక్షల మంది ప్రజానీకాన్ని ఊచకోత కోశాడు. మొత్తం ప్రజానీకంలో వాళ్లు మూడవ వంతు. ఈ నమూనాలే తర్వాత యూరప్‌లో ఫాసిజాన్ని ఆచరించడానికి ఉపయోగపడ్డాయి.

ప్రస్తుతం నయా ఫాసిజం విస్తరిస్తోంది. గత కాలపు వలసాధిపత్యాన్ని అది నెమరువేసుకుంటోంది. మళ్ళీ వలస పాలనకు పూనుకోవాలనే దాని ప్రయత్నాలు కానవస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ తన కోరలను బహిర్గతపరచడాన్ని మనం మళ్ళీ చూస్తున్నాం. యుద్ధానంతర కాలంలో వాటిని చాలావరకు దాచిపెట్టగలిగింది. కాని ఇప్పుడు అవి బహిర్గతమయ్యాయి. "సంక్షేమ రాజ్యం" అని, **(మిగతా 24వ పేజీలో)**

# భయం పట్టు వదిలిస్తున్న జెన్ జీ నిరసనలు



అనువాదం N.Venugopal

- అశోక్ కుంబము

**(న్యూ యార్క్ నుంచి వెలువడే ప్రపంచ ప్రసిద్ధ, ప్రామాణిక సోషలిస్టు త్రైమాసిక పత్రిక జాకోబిన్ వెబ్ సైట్ మీద జంతర్ మంతర్ యువతరం నిరసన ప్రదర్శన గురించి మిత్రుడు అశోక్ కుంబము రాసిన వ్యాసం చదవగానే అది తెలుగు పాఠకులకు అందాలని అనిపించి తెలుగు చేశాను. వీక్షణం అక్టోబర్ సంచికలో ప్రచురిస్తున్నాం గాని ఇంకా ఇరవై రోజులు మీ నుంచి ఆ వ్యాసాన్ని దూరం ఉంచలేక ఇక్కడ పంచుకుంటున్నాను. చూడండి.)**

నరేంద్ర మోడీ హిందుత్వ ప్రభుత్వానికి రక్షణగా ఉండిన భయ సంస్కృతిని భారత యువతరపు నిరసన ఉద్యమం సవాల్ చేసింది. మోడీ లేని, మోడీ అమలు చేసిన నిరంకుశ విచ్ఛిన్నకర కార్యక్రమం లేని ఒక భవిష్యత్తుకు తగిన అవకాశాలను వారు రూపొందిస్తున్నారు. "అమ్మయ్య, ఇప్పుడిక నేను ప్రశాంతంగా చనిపోవచ్చు. నేను చిరునవ్వుతో చనిపోగలను." సుప్రసిద్ధ రచయిత, సామాజిక కార్యకర్త అరుంధతి రాయ్ నోటివెంట వచ్చిన ఈ మాటలు ఈ స్థితిని తెలియజేస్తాయి. మూడు దశాబ్దాలకుపైగా అరుంధతిరాయ్ విధ్వంసకర అభివృద్ధి పథకాలకూ, రాజ్య నిర్బంధానికీ, జాతీయ అభివృద్ధి పేరుతో అమలైన విధానాలకూ వ్యతిరేకంగా తమ భూమినీ, ఇళ్లనూ, హక్కులనూ పరిరక్షించుకోవడం కోసం పోరాడుతున్న ప్రజల పక్షాన నిలిచారు. ఎన్నో ఉద్యమాలు ఎగసి పడడమూ, విజయాలు సాధించడమూ ఆమె చూశారు. అలాగే ఆమె ఈ ప్రతిఘటనా పోరాటాలు నేరాలుగా ముద్ర పడడమూ చూశారు. వాగ్దానాలు భంగం కావడం చూశారు. స్వప్నాలు అణగదొక్క బడడం చూశారు. ఆశలు నీరుగారిపోవడం చూశారు. అయినా, భారత జెన్ జీ యువతరం వీథుల్లోకి వచ్చినప్పుడు ఆమె దాదాపుగా ఆశించడం మరిచిపోయినదేదో కళ్ల ఎదుట కనబడినట్టయింది: అది ఆశ.

## అధికారానికి సవాల్

వైద్య విద్యను అభ్యసించడానికి ప్రవేశపరీక్ష అయిన జాతీయ అర్హతా ప్రవేశ పరీక్ష (నీట్) పత్రాలు ముందే బైటపడడం అనేదే ఈ నిరసనల అగ్గి ముట్టించినట్టు కనబడుతుంది. కాని యువత ఆగ్రహం అంతకు మించినది. పరీక్ష పత్రాలు బైటపడినప్పుడు, ఈ వ్యవస్థకు ఒక సక్రమమైన పరీక్ష నిర్వహించగల సామర్థ్యం ఉందా అనే విషయంలో మాత్రమే కాదు, చదువుకుంటే, కష్టపడితే తగిన ఫలితం వస్తుందని ఇంతకాలమూ అందుతున్న వాగ్దానం మీదనే విద్యార్థులకు విశ్వాసం పోయింది. అదే సమయంలో మరొక వివాదం ఈ ఆగ్రహానికి ఒక కొత్త రాజకీయ వ్యక్తీకరణను ఇచ్చింది. 2026 మే 15న సుప్రీం కోర్టులో ఒక విచారణ సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఒక లోతైన దురభిప్రాయాన్ని ప్రకటించారు: నిరుద్యోగ భారతీయ యువతను "సోమరులు"గా, "బొద్దింకలు" గా అభివర్ణించారు. యువత ఆ అవమానాన్ని అవకాశంగా మార్చుకోవడం ప్రారంభించింది. మొదట వెటకారం చేశారు. తర్వాత సగర్వంగా స్వీకరించారు. వారు తమను తాము "బొద్దింకలు"గా పిలుచుకుంటూ ఇన్స్టాగ్రామ్ మీద కాక్రోచ్ జనతా పార్టీని తయారు చేశారు. అలా ఆన్‌లైన్‌లో ప్రారంభమైనది అక్కడే ఆగిపోలేదు. ఆ ఆగ్రహం వెటకారపు మీమ్‌ల నుంచీ, ఇన్స్టాగ్రామ్ పోస్టుల నుంచీ ఢిల్లీ వీథుల్లో నిరసన ప్రదర్శనల దాకా సాగి వచ్చింది. ఉద్యమం పరీక్ష పత్రాల లీక్ దగ్గర మాత్రమే ఆగిపోలేదు. అది నిరుద్యోగం, అవినీతి, అసమానత, వ్యవస్థాగతమైన పీడన వంటి మరెన్నో ప్రధాన అంశాలను తెరమీదికి తెచ్చింది. వీటిలో ఏ ఒక్క సమస్యా కొత్తది కాదు. మరి ఉద్యమానికి భిన్న స్వభావం ఎక్కడి నుంచి వచ్చింది? దశాబ్దాలపాటు ఉద్యమాల ఉత్థానపతనాలను చూసిన అరుంధతి రాయ్‌కి ఈ తరంలో ఆశ కల్పించేది ఏమి కనబడింది?

ఇంకా నరేంద్ర మోడీయే ప్రధానమంత్రిగా ఉన్నాడు. భారతీయ జనతా పార్టీ ఇంకా దేశంలో ఆధిపత్య రాజకీయ శక్తిగా ఉంది. భారతీయ జనతా పార్టీకి భావజాల మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, దాని విస్తారమైన సంస్థల పరివారపు సాలెగూడు ఇంకా కనుమరుగు కాలేదు. హిందుత్వ శక్తుల చేత గొంతు నులమబడిన సంస్థలు, నిర్మాణాలు ఇంకా ఊపిరి పీల్చడం ప్రారంభించలేదు. అత్యధిక సామాజిక సంబంధాలలో ఇప్పటికీ కులం లోతుగా వేళ్లూనుకునే ఉంది. అసమానత కళ్లు చెదిరేంత అపారంగా ఉంది. అయినా ఎక్కడో ఏదో మారినట్టు కనబడుతోంది. అది ప్రత్యేకంగా అధికార వ్యవస్థలో మార్పే కానక్కర లేదు. ఆ అధికారాన్ని మనుషులు చూసే, దాన్ని ఎదుర్కొనే పద్ధతిలో మార్పు వచ్చింది.

మోడీ పాలన కిందనే పెరిగిన యువ భారతీయులు ఒక అసాధారణమైన మామూలు విషయాన్ని ఆచరణలోకి తెచ్చారు:

వాళ్లు అధికారాన్ని పవిత్రమైనదిగా చూడడానికి నిరాకరించారు. వాళ్లు దాన్ని ప్రశ్నించడం మాత్రమే కాదు, వెటకారం చేస్తున్నారు. అలా ప్రశ్నించడంలో, వెటకరించడంలో వాళ్లు ఎన్నో సంవత్సరాలుగా హిందుత్వ శక్తులు వ్యూహాత్మకంగా నిర్మించుకుంటూ వచ్చిన అజేయత్వపు బుడగను పగులగొట్టారు. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందువల్లనంటే, భయ సంస్కృతిలో, లొంగి ఉండే సంస్కృతిలో, ప్రజలు తమ మీద తామే నిఘా వేసుకుంటారు. తమ మీద తామే పోలీసులవు తారు. జర్నలిస్టులు తాము ఏమి రాస్తున్నారో మళ్లీ ఒకసారి జాగ్రత్తగా చూసుకుంటారు. విద్యార్థులు మాట్లాడడానికీ, నిరసనలో పాల్గొనడానికీ సంకోచిస్తారు. ఏ నినాదం, ఏ ఫొటో, ఏ సామాజిక మాధ్యమాల పోస్ట్ తమ మీదికి ముంచుకొస్తుందో అని కార్యకర్తలు ఆచితూచి మాట్లాడతారు. ఇలా సవాళ్లు లేకుండా అధికారం కొంతకాలం సాగినతర్వాత, భయమే సాధారణం అయిపోతుంది. సాధారణం అయినదేదైనా దానికి లొంగిపోయేట్టు చేస్తుంది. ఈ పద్ధతిలో అధికారం తన దారి నుంచి పక్కకు తొలగిపోయే మనుషులను నిర్మించి పెడుతుంది.

## భయం నేర్చుకోవడం

ఇటువంటి భయం గురించి నాకు చాలా కాలంగా తెలుసు. తెలంగాణలో ఒక మారుమూల గ్రామంలో 1980లలో జీవిస్తూ, అధికారానికి ఉండే ముఖం గురించి నేను తెలుసుకున్నాను. ఆ అధికారాన్ని మేం దొర అని పిలిచేవాళ్లం. మా గ్రామాన్ని పాలించడం తన జన్మహక్కులా భావించి పాలించిన ఆధిపత్య కుల భూస్వామి ఆయన. ఆ అధికారాన్ని ఏ రాజ్యాంగమూ ఇవ్వలేదు. ఏ ప్రభుత్వమూ ఆయనను నియమించలేదు. ఆ ప్రాంతంలో ఆధిపత్య కులాల్లో ఒకటైన భూస్వామ్య రెడ్డి కుటుంబంలో జన్మించినందువల్ల ఆయనకు అధికారం వారసత్వంగా అందింది. అయినా ఆయన ఆ భూమి ఎలా సంపాదించాడో, ఆ అధికారం ఎలా చేపట్టాడో, ఆ ఆస్తీ, అధికారమూ ఆయన దగ్గర ఎందుకుండాలో ఏ ఒక్కరూ ఎప్పుడూ ప్రశ్నించలేదు. ఆయన అధికారం ఎంత సుదీర్ఘ కాలం పునరుత్పత్తి అవుతూ పోయిందంటే అసలు అది అధికారమని కనిపించకుండానే పోయింది. అది సహజమైన విషయం అనిపించింది. అదే పనిచేసే పద్ధతి అనిపించింది.

చిన్న పిల్లలుగా ఉన్నమాకు ఆయనను చూసి భయపడాలని ఎవరూ చెప్పలేదు. మా చుట్టూ ఉన్నవాళ్లను చూసి మేమది నేర్చుకున్నాం. ఆయన వీధుల్లో నడిచేటప్పుడు పెద్దవాళ్లందరూ లేచి నిలబడేవారు. మాకంటే పెద్ద పిల్లలు ఆడుతున్న ఆటలను మధ్యలో ఆపేసేవారు. మాట్లాడుతున్నవారు మాటలు ఆపేసేవారు. గొంతులు మూగబోయేవి. జనం పక్కకు తొలగిపోయేవారు. ఆయనను ప్రశ్నించడం అలా ఉంచండి, ఆయన నుంచి దూరంగా ఉండాలని కూడా మాకు ఎవరూ చెప్పనవసరం లేకపోయింది.

ఆయనను నేను చూసేటప్పటికి ఆయన డెబ్బయో పడిలో ప్రవేశించాడు. ఒక్క వాక్యం మాట్లాడడానికి చాలా ఇబ్బంది పడేవాడు. ఎవరితోనైనా సంభాషించడం చాలా అరుదు. అసలు ఆయన ఇతరులతో మాట్లాడేవాడు కాదు, ఆదేశాలు ఇచ్చేవాడు. అంతే. ఇప్పుడు వెనక్కి తిరిగి ఆలోచిస్తుంటే నాకు కొట్టవచ్చినట్టు అనిపించేదేమంటే ఆ అధికారానికి ఆయన వ్యక్తిగా ఎటువంటి వాడో అనేదానితో ఏ సంబంధమూ లేదు. ఆయన భౌతిక రూపం ఇతరులందరినీ లొంగదీసేంత దృఢమైనదేమీ కాదు. మేధాపరంగా ఆయన సాధించిన విశేషాలేమీ లేవు. ఆయన దొర ఎందుకయ్యాడంటే ఆయన చారిత్రకంగా దొరలను తయారుచేసిన కులంలో, వర్గంలో, కుటుంబంలో పుట్టాడు గనుక మాత్రమే. ఆయన తన అధికారాన్ని సంపాదించుకోలేదు, రుజువు చేసుకోనక్కరలేదు. ఆయనకు అది వారసత్వంగా వచ్చింది. గ్రామీణ జీవితపు దైనందిన మామూలు వ్యవహారాల ద్వారా ప్రజలు ఆ అధికారాన్ని గుర్తించారు, బలోపేతం చేశారు. కాలక్రమంలో, అసలు గ్రామం ఎప్పుడైనా మరొక రకంగా సంఘటితమై ఉండిందా అని ఊహించడం కూడా అసాధ్యమైపోయింది.

## లోకజ్ఞానం

అప్పుడు నేను చూసిన విషయాలను అర్థం చేసుకునే భాష నాకు ఎన్నో సంవత్సరాల తర్వాత ఆంటోనియో గ్రాంసీని చదువుతున్నప్పుడు తెలిసింది. ఆధిపత్యం అనేది సాధారణ లోకజ్ఞానంలో భాగంగా మారిపోయినప్పుడు అతి ఎక్కువగా మనుగడలో ఉంటుంది. చరిత్ర సృష్టించిన అంతరాలు సహజమైనవిగా, అనివార్యమైనవిగా, బహుశా అవసరమైనవిగా కనబడడం మొదలవుతుంది. అధికారంలో ఉన్నవారి చేతిలో నిర్బంధ సాధనాలు కూడా ఉంటాయి. కాని తమ ప్రవర్తన ఏ పరిమితుల లోపల ఉండాలో ప్రజలు తమంత తామే నేర్చుకున్నప్పుడు, అధికారంలో ఉన్నవారికి నిర్బంధ సాధనాలను తరచుగా వాడవలసిన అవసరం కూడా రాదు.

భారతీయ సందర్భంలో వారసత్వంగా వచ్చిన సామాజిక అంతరాలు, ప్రత్యేకంగా కులానికీ వర్గానికీ చెందిన అంతరాలు, అధికారానికి వనరుగా ఉంటాయని బిఆర్ అంబేద్కర్ గుర్తించారు. భారత సమాజంలో, ప్రజాస్వామ్యంలో ఈ అంతరాలు ఎంత లోతైన వైరుధ్యాలను సృష్టించాయో ఆయన చూపారు. ప్రజల దైనందిన జీవితం ఈ సామాజిక అంతరాలలో లోతుగా కూరుకుపోయి ఉన్నప్పుడు రాజకీయ ప్రజాస్వామ్యానికీ, రాజ్యాంగ నైతికతకూ అర్థం ఉండదని ఆయన భావించారు. అయినా, రాజ్యాంగం అమలులోకి వచ్చి దశాబ్దాలు గడిచిపోయిన తర్వాత, మా గ్రామపు సామాజిక

సంబంధాలలోకి రాజ్యాంగ నైతికత ప్రవేశించనే లేదు. తనదైన సొంత భూస్వామ్య రాజ్యాంగం మీద దొర గద్దెనెక్కి కూచున్నాడు. గ్రామం మొత్తం లొంగుబాటుతనంలో, తనంతట తానే పాలితురాలిగా కొనసాగింది. ఆ గ్రామానికి తనదైన ప్రచ్ఛన్న పాఠ్యాంశం ఉండింది. అది భూస్వామ్య, బ్రాహ్మణ ఆధిపత్యం పునాదిగా పని చేసేది. అది తరం తర్వాత తరం ప్రతి మనిషికీ అంతరాల నిచ్చెనమెట్ల వ్యవస్థ సహజమైనదని నేర్పుతుంది. రోజువారీ ఆచారాల ద్వారా, వ్యవహారాల ద్వారా, చిహ్నాల ద్వారా, సామాజిక కార్యక్రమాల ద్వారా అంతరాలను బలోపేతం చేస్తుంది. దాని బోధనాంశాలు చాలా సులభమైనవి. ఎవరికి భయపడాలో నేర్చుకో, ఎవరికి విధేయంగా ఉండాలో నేర్చుకో. ఎవరిని ఎప్పటికీ ప్రశ్నించగూడదో నేర్చుకో. అదిగో ఆ ప్రపంచంలోకి, మా గ్రామంలోకి నక్సలైట్లు ప్రవేశించారు. వారు కమ్యూనిస్టు విప్లవకారులు. తెలంగాణలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ వారిని అన్నలు అనేవారు. ఆ పదం పితృస్వామిక, ఔదార్యపూరిత వాసనలతో ఉన్నదని వారే ఆ తర్వాత ఆ పదాన్ని వదులుకు న్నారు. అధికారానికి మూలం ఏమిటో వారు చాలా త్వరగా గ్రహించారు. ఆ అధికారాన్ని మూర్తీభవించుకున్న వ్యక్తిని తొలగించడం ఆ అధికారాన్ని పోషించిన సామాజిక సంబంధాలను తప్పనిసరిగా మార్చాలని ఏమీ లేదని కూడా వాళ్లు గ్రహించారు. మొట్టమొదట ఎక్కుపెట్టవలసిన అంశం మరేదో ఉందని వాళ్లు తెలుసుకున్నారు. అది దొర అంటే ఉండే భయం.

## భయానంతరం

ఒకరోజు ఉదయం అన్నలు గ్రామంలోని దళితవాడ నుంచి ఒక చిన్న గుంపును పోగేశారు. అందరూ కలిసి దొర ఇంటికి వెళ్లారు. కాస్త బలప్రయోగం చేసి దొరను బైటికి తీసుకొచ్చారు. మెడ చుట్టూ తువాలు చుట్టి, దాన్ని పట్టుకుని వీధుల్లో నడిపించుకు వచ్చారు. అలా వాళ్లు ముందుకు కదులుతుంటే ఒక్కొక్క ఇంటి నుంచీ జనం బైటికి వచ్చి, ఆ ఊరేగింపులో కలిశారు. అలా గుమిగూడిన జనాన్ని ఉద్దేశించి అన్నలు ఉపన్యాసం ఇచ్చారు. సమస్య వ్యక్తిగా దొర ఒక్కడిది కాదనీ, దొర ప్రతినిధిగా ఉన్న మొత్తం భూస్వామ్య వ్యవస్థే అసలు సమస్య అని వాళ్లు చెప్పారు. తర్వాత, దొరను ఉద్దేశించి ఆయన కావాలంటే ఊళ్లో ఉండవచ్చునని, కాని దొరగా అధికారం చలాయిస్తానంటే మాత్రం కుదరదని చెప్పారు. మా ఊళ్లో ఆఖరి దొర కూలిపోవడం మేం అలా చూశాం. కాని వాస్తవం ఏమంటే ఆ రోజున భౌతికంగా ఏమీ మారలేదు. భూమి ఇంకా అసమానంగానే పంపిణీ అయి ఉంది. కులం అదృశ్యం కాలేదు. వెట్టి చాకిరీ కొనసాగింది. దొరను నిలిపి ఉంచిన అధికార వ్యవస్థ ఇంకా అట్లాగే ఉంది. కాని మొత్తానికి ఏదో మారింది.

దొరను ఇంట్లోంచి బైటికి లాక్కురావడం జనం చూశారు. ఏ వీధుల్లోనైతే దొరను చూసి తాము పక్కకు తొలగిపోయేవారో అదే వీధుల్లో దొరను మరొకరు మెడలో తాడుతో నడిపించడం వాళ్లు చూశారు. నిన్నటివరకూ సహజమైనదిగా కనిపించిన ఆధిపత్యం ఇప్పుడు బహిరంగంగా సవాల్ చేయబడింది. ఆ తర్వాత, భయం పాత పద్ధతిలో పునరుత్పత్తి కావడం ఇంకెంతమాత్రమూ జరగలేదు.

ఆ క్షణాన్ని నేను భయానంతర సందర్భం అంటాను. భయానంతరం అంటే భయం అదృశ్యమైపోతుందని కాదు. నిర్బంధ శక్తి కుప్పకూలిపోయిందని కాదు. ఆ మాట ఒక రాజకీయ పరిస్థితిని సూచిస్తుంది. ఆ స్థితిలో భయం మిగిలే ఉన్నప్పటికీ దైనందిన జీవిత ప్రవర్తనను నిర్దేశించే శక్తిని కోల్పోవడం ప్రారంభమవుతుంది. ఏ దైనందిన జీవిత ప్రవర్తన అయితే మౌనాన్ని, స్వీయ పోలీసుతత్వాన్ని, విధేయతను, ఆరాధనను ఉత్పత్తి చేస్తుందో ఆ దైనందిన జీవిత ప్రవర్తన నిర్దేశ సూత్రాలు మారిపోవడం ప్రారంభమవుతుంది. ప్రజలలో ఇంకా భయం ఉండవచ్చు, కాని భయం ఉండగా కూడా వాళ్లు కార్యాచరణకు దిగగలుగుతారు. అందువల్ల భయానంతరం అనేది విముక్తి ఏమీ కాదు, విప్లవమేమీ కాదు. అది ఒక సంధి దశ. ఒక అనిశ్చిత రాజకీయ స్థితి. కాని అది ఒక విషయాన్ని మాత్రం సుసాధ్యం చేస్తుంది. అదేమంటే రేపు ఇక ఎంతమాత్రమూ నిన్నటి లాగా ఉండబోదు.

## అబద్ధ కథనం

మా గ్రామంలో దొర అధికారం కూలిపోవడం ప్రారంభమైన ఆ క్షణం నలభై ఏళ్ల తర్వాత ఇప్పుడు నా ఆలోచనల్లోకి వస్తోంది. ఒక దశాబ్దానికి పైగా తనను తాను శక్తిమంతమైనదాన్ననీ, అజేయురాలిననీ ఒక చిత్రం తయారు చేసుకున్న ప్రభుత్వాన్ని ఇప్పుడు యువ భారతీయులు ప్రశ్నిస్తున్నారు, వెటకారం చేస్తున్నారు. ప్రతిఘటిస్తున్నారు. ఏ అంశాలనైతే సవాల్ చేయడం అసాధ్యం అని ఒకప్పుడు అనిపించిందో ఆ అంశాలను ఇప్పుడు సవాల్ చేస్తున్నారు. ఏ రాజకీయ అవకాశాలు ముగిసిపోయాయని ఒకప్పుడు అనిపించిందో అవి ఇప్పుడు తెరుచుకుంటున్నాయి. భారతదేశం ఒక భయానంతర దశలో ప్రవేశిస్తున్నదని అనిపిస్తున్నది. అయితే భయానంతర స్థితి అనేది ప్రజలు అధికారాన్ని ఎదిరించడానికి అంతకంతకూ ఎక్కువగా ఎందుకు ముందుకొస్తున్నారో మాత్రమే వివరిస్తుంది. వారు వీధుల్లోకి రావడానికి కారణమైన ఆగ్రహం ఏమిటో వివరించజాలదు. భారతీయ జనతా పార్టీ అవినీతిని అంతమొందిస్తాననీ, సంక్షేమాన్ని విస్తరిస్తాననీ, ఇతోధిక ఉద్యోగాలు కల్పిస్తాననీ, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తాననీ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం మరింత ప్రకాశమానంగా వెలుగులీనేలా చేస్తాననీ వాగ్దానాలతో అధికారానికి వచ్చింది. అయితే, చిట్టచివరికి ఆ వృద్ధి, సౌభాగ్యాల కథనానికి ఒక చిన్న పరీక్ష ఎదురైంది: ఆ కథనాన్ని సాధారణ ప్రజానీకం తమ సొంత

జీవితాల్లో అనుభవించగలుగుతున్నారా?

భారతదేశం పైపైకి ఎగుస్తున్నదని వాళ్లు వింటుంటారు. కాని వాళ్లకు సురక్షితమైన ఉద్యోగం సంపాదించడం చాలా కష్టంగా ఉంటుంది. వేగవంతమైన అభివృద్ధి సాగుతున్నదనీ, అది అపారమైన సంపద సృష్టిస్తున్నదనీ వాళ్లు వింటారు. కాని అదంతా ఎవరి సొంతమవుతున్నదో వాళ్లకు అర్థం కాదు. కష్టపడి చదవమనీ, ప్రతిభ ఆధారంగా పోటీ పడమనీ సలహాలు వింటుంటారు. కాని వాళ్లకు తరచుగా పరీక్ష పత్రాలు బైటపడడమూ, నియామకాల్లో వైఫల్యాలూ ఎదురవుతుంటాయి. పాలకవర్గాలూ, మీడియాలో అత్యధిక భాగమూ భారతదేశపు ఆర్థిక విజయాల పండుగ చేసుకుంటూ ఉండగా, 80 కోట్ల మంది భారత ప్రజలు ఇంకా ప్రభుత్వం దగ్గరినుంచి ఉచిత ఆహార ధాన్యాలు పొందవలసి ఉంటుంది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ - ఇన్స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రూపొందించిన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం, భారతదేశంలో 2022లో నిరుద్యోగ జనాభాలో దాదాపు 83 శాతం 15-29 సంవత్సరాల వయసున్న యువకులే. నిరుద్యోగ యువతలో మాధ్యమిక, లేదా ఉన్నత పాఠశాల విద్య పూర్తి చేసిన వారి సంఖ్య 2000లో 54.2 శాతం ఉండగా 2022లో 65.7 శాతానికి పెరిగింది. ఉత్పత్తి, సేవా రంగాలలో ప్రభుత్వ రంగం కుంచించుకు పోవడంతో, ప్రైవేటు రంగం విస్తరించడంతో ఈ వ్యవస్థాత్మక సంక్షోభం ఇంకా పెరుగుతున్నది. మొత్తం మీద విద్యావంతులైన యువతకు ఉద్యోగావకాశాలు క్రమంగా దిగజారుతున్నాయి. భారతదేశపు సమస్య ఇప్పుడు చదువులేని అనేక మంది నిరుద్యోగ యువతరం కాదు, అర్హతలున్న అనేక మంది యువతరం సముచిత ఉద్యోగాలను సంపాదించలేకపోవడం.

భారతదేశం ఏడాదికేడాదికీ సంపన్నమవుతున్నదని ప్రభుత్వ గణాంకాలు చెపుతాయి. కాని ఆ గణాంకాలు మొత్తం కథను చెప్పవు. ఈ సంపదలో అత్యధిక భాగం పేదరికంలోకి జారిపోతున్నవారి వల్ల జరుగుతున్నది. ఆ సంపద చాలా ఎక్కువగా అసమానమైన పద్ధతిలో పంపిణీ అవుతున్నది.

వరల్డ్ ఇనీక్వాలిటీ లాబ్ ప్రకారం 2022-23లో దేశంలోని అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మంది మొత్తం జాతీయాదాయంలో 23.3 శాతం పొందుతున్నారు, మొత్తం జాతీయ సంపదలో 40.1 శాతం వారి అదుపులోనే ఉంది. అందుకు భిన్నంగా, అత్యంత పేదలుగా, కింద ఉన్న 50 శాతానికి జాతీయాదాయంలో 15 శాతం మాత్రమే దక్కుతున్నది. వారి దగ్గర 6.4 శాతం జాతీయ సంపద మాత్రమే ఉన్నది. ఇలా సంపద పైన పోగు పడడాన్ని పరిశోధకులు బిలియనీర్ రాజ్ - కోటీశ్వరుల రాజ్యం - అంటున్నారు.

## బలహీనుల ఆయుధాలు

ఈ వైరుధ్యాలు ఒకదానికొకటి సంబంధం లేనివని అనుకోవడం యువతరానికి కష్టంగా ఉంది. సమస్య ఇంకెంతమాత్రమూ భారతదేశం అభివృద్ధి చెందుతున్నదా లేదా అని కాదు, దానితోపాటు ఎవరు పెరుగుతున్నారు, ఎవరు తరుగుతున్నారు అని. ప్రస్తుత ఉద్యమం ఒక సామాజిక రాజకీయ శూన్యం నుంచి పుట్టుకురాలేదు. సంఘటిత ఉద్యమాల పట్ల, తమ భావజాల ఆధిపత్యానికి సవాళ్ల పట్ల రాజ్యం ఎట్లా ప్రతిస్పదిస్తున్నదో చూస్తూనే, చాలా సందర్భాల్లో అనుభవిస్తూనే ఈ తరం పెరిగింది. విద్యార్థులనూ, రైతులనూ ఎలా కొట్టారో, ఎలా అరెస్ట్ చేశారో వాళ్లు చూశారు. జాతీయాభివృద్ధి పేరు మీద అడవులు, గనుల తవ్వకం, నిర్వాసితత్వం ఎలా పెరిగాయో, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు ఎలా సాగాయో వాళ్లు చూశారు. ఆదివాసీ ప్రాంతాలలో విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు, ఇటీవలి కాలంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరిగిన నిర్బంధకాండ తీవ్రతరం కావడం కూడా వాళ్లు చూశారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ ఆపరేషన్ కగార్ ను ఒక ప్రకటిత లక్ష్యంతో, ఒక కాలావధితో సాగించింది. ఆ లక్ష్యం మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడం. ఆ కాలావధి 2026 మార్చ్ 31. కార్యకర్తల మీద, రచయితల మీద, కవుల మీద, విద్యావేత్తల మీద, కళాకారుల మీద ఎటువంటి నిఘా, అరెస్టులు, కుట్ర ఆరోపణలతో, లేదా నిషిద్ధ సంస్థలతో సంబంధాల ఆరోపణలతో క్రిమినల్ కేసు విచారణలు ఎట్లా సాగాయోవాళ్లు చూశారు. ఈ ఉద్యమం పుట్టుకొచ్చిన రాజకీయ ప్రపంచంలో పోరాటాల, నిర్బంధాల చరిత్ర మిళితమై ఉంది. ముఖ్యంగా ఈ యువత హాస్యం, వెటకారం, మీమ్‌లు, వీడియోలతో పాటు ఇతర దైనందిన ధిక్కార రూపాలను వాడుకున్నారు. రహస్య భాషణలు, బలహీనుల ఆయుధాలు అని ఆగ్నేయాసియాలో రైతాంగ ప్రతిఘటనను అధ్యయనం చేసి జేమ్స్ సి స్కాట్ అభివృద్ధి చేసిన భావనలు, ఇక్కడ సరిగ్గా ఉపయోగపడతాయి. బలహీనులు మౌనంగా ఉన్నారంటే దాన్ని సమ్మతి అని పొరపాటు పడవద్దని స్కాట్ అన్నాడు. అధికారం ముందు జనం లొంగిపోయినట్టు, విధేయంగా ఉన్నట్టు కనిపించవచ్చు, కాని ఆ అధికారం పక్కకు తప్పుకోగానే ఆగ్రహాన్ని, విమర్శను, అసంతృప్తిని వ్యక్తీకరిస్తారు. దీన్ని స్కాట్ రహస్య భాషణ అని పిలిచాడు. అటువంటి స్థితిలో, అధికారంలో ఉన్నవారిని ఎదిరించడానికి సిద్ధంగా లేనప్పుడు, శక్తి చాలనప్పుడు కూడా ప్రజలు పరిశీలిస్తారు, గుర్తు పెట్టుకుంటారు, తమలో తాము మాట్లాడుకుంటారు, పరిహాసాలు ఆడుకుంటారు. అధికారంలో ఉన్నవారిని వెటకారం చేస్తారు.

## దిమాగీ నక్సల్స్

స్కాట్ చూసిన రైతులకు, ఇవాళ్టి భారతీయ యువతకూ ఒక ముఖ్యమైన తేడా ఉంది. యువ భారతీయుల విషయంలో

రహస్య భాషణ ఇంకెంతమాత్రమూ పూర్తిగా రహస్యం కాదు. పరిహాసాలు, మీమ్‌లు, వెటకారాలు, వ్యంగ్యం వంటి "బలహీనుల ఆయుధాలు" ఇప్పుడు సామాజిక మాధ్యమాల మీద బహిరంగంగా తిరుగుతున్నాయి. అంతేకాదు, నిరసనలు స్కాట్ చెప్పిన "బలహీనుల ఆయుధాల"కు మాత్రమే పరిమితం కాలేదు. జంతర్ మంతర్ దగ్గర యువత రాజ్యంతో ప్రత్యక్షంగా తలపడడంలో గణనీయమైన పట్టుదలను, సామూహిక ప్రతిఘటనను, సమరశీలతను ప్రదర్శించారు. వారి పోరాటం చిట్టచివరికి విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ చేత రాజీనామా చేయించింది. 2026 ఆగస్ట్ 15న ఎర్ర కోట మీది నుంచి ప్రసంగిస్తూ ప్రధాని మోడీ తన ప్రభుత్వం సాయుధ నక్సలైట్లను నిర్మూలించడంలో విజయం సాధించిందని, కాని దేశం ముందర మరొక ప్రమాదం దిమాగి నక్సల్స్ రూపంలో ఉన్నదని అన్నాడు. మెదడుతో పని చేసే నక్సల్స్ అని అర్థం ఇచ్చే ఈ మాటను ఆయన అసంతృప్తిని భావజాలపరంగా సమర్థించే, లేదా ప్రోత్సహించే వారందరినీ ఉద్దేశించి అన్నాడు. వారిని "గుర్తించి, ఒంటరులను చేయాలని" ఆయన అన్నాడు.

ఈ కొత్త మాట ఇంతకు ముందరి ఇటువంటి నిందాపూర్వక మాటలకు జత కలుస్తుంది. అవి అర్బన్ నక్సల్, దేశద్రోహి వంటి మాటలు. కార్యకర్తలను, మేధావులను, న్యాయవాదులను, విద్యావేత్తలను, ప్రభుత్వం పట్ల విమర్శనాత్మకంగా ఉండే వారందరినీ బెదిరించడానికి మోడీ, ఆయన అనుచరులు ఈ మాటలు వాడుతారు. అయినా, భయానంతర స్థితి అని నేను నిర్వచిస్తున్న స్థితిలో, జనం ఇరవై నాలుగు గంటల్లోనే ఈ మాటను వెటకారం చేస్తూ స్పందించారు. అదే వెటకారంతో ఇన్స్టాగ్రామ్ మీద దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. ఈ ప్రతిస్పందనే భయానంతర స్థితిలో ప్రజల ఆలోచనలు, ఆచరణలు ఎలా పని చేస్తాయో చూపుతున్నది. తమను బెదిరించడానికి ఉద్దేశించిన ముద్రలను ప్రజలు స్వాధీనం చేసుకుంటారు, వాటిని ఒక ప్రతిఘటనా సంవాద రూపంగా మార్చేస్తారు. ఇక్కడ విస్మరించగూడని చారిత్రక వైచిత్రి ఒకటి ఉంది. మాజీ కేంద్ర హోమ్ మంత్రి పి.చిదంబరం వెంటనే ప్రతిస్పందిస్తూ, తాను "ఒక దిమాగి నక్సల్ అని చెప్పుకోవడానికి గర్విస్తున్నాను" అన్నాడు. 2008 నుంచి 2012 దాకా కేంద్ర హోమ్ మంత్రిగా చిదంబరం రాజ్యం సాగించిన ప్రధాన మావోయిస్టు వ్యతిరేక దాడికి నాయకుడుగా ఉన్నాడు. ఆ దాడి ఆపరేషన్ గ్రీన్ హంట్ అనే పేరుతో ప్రపంచ ప్రసిద్ధి పొందింది.

### అసంఘటిత ఐక్యత

ఇలా వెల్లువెత్తిన ఉద్యమం ప్రామాణిక మార్క్సిస్టు వర్గ పోరాట రూపాలలోకీ, లేదా రాజకీయ నిర్మాణాల సాంప్రదాయిక రూపాలలోకీ కచ్చితంగా ఇమడదు. ఇక్కడ భాగస్వామ్యం వహించిన ప్రజానీకం అందరూ ఒకే భావజాలాన్ని, ఒకే పార్టీని, ఒకే నాయకత్వాన్ని, ఒకే కార్యక్రమాన్ని అంగీకరించిన వారేమీ కాదు. వారు భిన్న వర్గాల నుంచి, కులాల నుంచి, లింగాల నుంచి, ప్రాంతాల నుంచి, రాజకీయ సంప్రదాయాల నుంచి వచ్చారు. ఈ అవకాశాన్ని నేను అసంఘటిత ఐక్య సంఘటన అని వర్ణించదలచుకున్నాను. ఈ పరస్పర విరుద్ధపదాల గుచ్ఛాన్ని నేను ఉద్దేశపూర్వకంగానే వాడుతున్నాను. ఎందుకంటే వారు పోరాటాలలో ఐక్యమయ్యారు. కాని వారు ఇంకా సంఘటితం కాలేదు. ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాల చరిత్ర మనకు చెప్పేదేమంటే ఇటువంటి రాజకీయ నిర్మాణం చాలా సున్నితమైనది, ఊరికే విరిగిపోతుంది. అందరిలోనూ ఉండే ఆగ్రహం దానికదే ఒక సమ్మిళిత, సుస్థిర రాజకీయ ఉద్యమంగా మారజాలదు. భయానంతర స్థితి రాజకీయ అవకాశాల తలుపులు తెరుస్తుంది. కాని ఆ తర్వాత ఏమి జరుగుతుందో అది నిర్ణయించజాలదు. ఆ అవకాశాలకు ఒక రాజకీయ దిశానిర్దేశం చేయాలంటే, ఆ ఉద్యమం అంతిమంగా ఇంకా కష్టమైన ప్రశ్నలను ఎదుర్కోవలసి వస్తుంది. ఆ ప్రశ్నలకు ప్రతిఘటన మాత్రమే జవాబు చెప్పజాలదు.

ఆ ఉద్యమం ఎందుకోసం పోరాడుతున్నది? ఆ ఉద్యమం ఎవరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది? ఎటువంటి సమాజాన్ని ఆ ఉద్యమం నిర్మించదలచింది? ఈ జెన్ జీ ఉద్యమం హిందుత్వ రాజకీయాలకు లక్ష్యాలుగా ఉన్న వామపక్ష, అంబేద్కరైట్ రాజకీయ పార్టీలకూ, సంస్థలకూ ఒక సవాల్ విసురుతున్నది. జెన్ జీ ఒక రాజకీయ స్థలాన్ని తెరిచిపెట్టింది. ఎన్నో ఏళ్లుగా ప్రతిఘటన చూపుతున్నప్పటికీ, త్యాగాలు చేస్తున్నప్పటికీ సంఘటిత వామపక్షాలు, గత పన్నెండు సంవత్సరాలలో నిర్మించలేకపోయిన స్థలం అది. ఇప్పుడు ప్రశ్న ఏమంటే ఈ రాజకీయధారలు తమ వాదవివాదాల, భావజాల విభజనలను అధిగమించి, ముందుకు సాగి ఈ వెల్లువెత్తుతున్న ఉద్యమంతో కలిసిపోగలరా? ఈ యువతరాలు సృష్టించిన స్వేచ్ఛా స్థలాన్ని విద్యావేత్తలు, ఇతర ప్రజా మేధావులు కూడా వినియోగించుకో వచ్చు, ఇంకా విశాలమైన స్వేచ్ఛలను సమర్థించడానికి దాన్ని ఉపయోగించుకోవచ్చు. బహుశా ఇక్కడే అరుంధతీ రాయ్‌కి ఈ ఉద్యమంలో ఆశ కనిపించి ఉండవచ్చు. ఆమె ఆశకు, ఈ ఉద్యమం ఇప్పటికే అది సవాల్ చేస్తున్న శక్తులను ఓడించిందనే నమ్మకం ఉండనక్కరలేదు. ఈ ఉద్యమానికి ఎక్కడికి పోవాలో తెలుసుననే నమ్మకం ఉండనక్కరలేదు. బహుశా ఆమె ఆశ చాలా పరిమితమైన, కాని పర్యవసానాలు ఉండగల స్థలం మీద ఆధారపడిందన్నమాట. అది అధికారాన్ని నేరుగా కళ్లలోకి సూటిగా చూసి, "చేసింది చాలు. ఇక తప్పుకో" అని అనగల ఒక తరం మీద ఆశ. ❑

# మానవ మస్తిష్కానికి దేవుడి స్థానంలో విచక్షణ కావాలి

- టి.లక్ష్మీనారాయణ

మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రమాదం ప్రకృతి సృష్టించినది కాదు. మానవుడు తన మస్తిష్కంతో సృష్టించిన మూఢ నమ్మకాలు, మత విద్వేషాలు, ఆధిపత్య భావజాలాలే నేడు మానవ సమాజాన్ని అస్థిరపరుస్తున్నాయి. మనిషి పరిణామ క్రమంలో సాధించిన అద్భుతమైన సంపద అతని మస్తిష్కం. ప్రకృతిని అర్థం చేసుకోవడానికి, ప్రశ్నించడానికి, పరిశోధించ డానికి, తప్పుల నుంచి నేర్చుకోవడానికి, కొత్త జ్ఞానాన్ని సృష్టించడానికి మనిషికి లభించిన గొప్ప సాధనం బుద్ధి. అయితే అదే మానవ మస్తిష్కాన్ని ప్రశ్నించకుండా ఏదో ఒక అతీత శక్తికి అప్పగించినప్పుడు సమస్య ప్రారంభమవుతుంది. దేవుడిపై వ్యక్తిగత విశ్వాసం ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయం కావచ్చు. ఆ స్వేచ్ఛను గౌరవించాలి. కానీ దేవుని పేరుతో సమాజాన్ని పాలించడం, మానవుల మధ్య శ్రేష్ఠ-హీన భావాలను సృష్టించడం, ఒక మతాన్ని మరొక మతంపై నిలబెట్టడం, హింసకు న్యాయం చెప్పడం మాత్రం మానవ నాగరికతకు ప్రమాదకరం.

**ప్రశ్నించే హక్కు కోల్పోతే ప్రగతి ఆగిపోతుంది:** మానవ ప్రగతి మొత్తం ఒక ప్రశ్నతోనే ప్రారంభమైంది. ఇది ఎందుకు జరుగుతోంది? మెరుపు ఎందుకు వస్తుంది? వ్యాధి ఎందుకు వస్తుంది? భూమి ఎలా ఏర్పడింది? మనిషి ఎలా పరిణామం చెందాడు? విశ్వం ఎంత విశాలమైనది? ఒకప్పుడు దేవతల కోపంగా భావించిన ప్రకృతి పరిణామాలకు శాస్త్రం కారణాలను అన్వేషించింది. వ్యాధులను పాపఫలితాలుగా భావించిన సమాజం వాటి వెనుక ఉన్న సూక్ష్మజీవులను కనుగొంది. ఆకాశాన్ని దేవతల లోకంగా చూసిన మనిషి అంతరిక్షంలోకి ప్రయాణించాడు. అంటే మానవ ప్రగతి భయంతో కాదు- ప్రశ్నతో; విశ్వాసంతో మాత్రమే కాదు-పరిశీలనతో; అంధ విధేయతతో కాదు-విచక్షణతో ముందుకు సాగింది. అందుకే ఆధునిక సమాజానికి అత్యవసరమైనది మరింత మూఢ విశ్వాసం కాదు. మరింత జ్ఞానం.

**దేవుని పేరుతో మానవుడే మానవుడికి శత్రువవుతున్నాడు:** ప్రపంచచరిత్రను పరిశీలిస్తే మతం మానవ జీవితానికి ఆధ్యాత్మికతను, నైతిక విలువలను అందించిన సందర్భాలు అనేకం కనిపిస్తాయి. అదే సమయంలో మతపరమైన ఆధిపత్యం రాజకీయ అధికారంతో కలిసినప్పుడు యుద్ధాలు, హింస, హత్యలు, వివక్ష, సామాజిక విభజనలు కూడా చోటు



చేసుకున్నాయి. నేటికీ ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో మనిషి మనిషిని అతని మతం, పూజా విధానం, దేవునిపై ఉన్న విశ్వాసం లేదా అవిశ్వాసం ఆధారంగా అంచనా వేస్తున్నాడు. ఒక మనిషి ఏ దేవుడిని నమ్ముతున్నాడో, నమ్మడం లేదో అతని మానవత్వానికి ప్రమాణం ఎలా అవుతుంది? మనిషి విలువను నిర్ణయించేది అతని మతం కాదు; అతని మానవత్వం. ఆకలితో ఉన్న మనిషికి ఆహారం పెట్టే చేయి ఏ మతానికి చెందినదో తెలుసుకోవాల్సిన అవసరం లేదు. ప్రమాదంలో ఉన్న మనిషిని రక్షించే వైద్యుడిని అతని మతం ఆధారంగా ఎన్నుకోము. రక్తం ఎక్కించేటప్పుడు రక్తానికి మతం ఉండదు. శాస్త్రానికి మతం ఉండదు. ప్రకృతికి మతం ఉండదు. అయితే మనిషికి మాత్రమే ఎందుకు మతపరమైన గోడలు?

**దేవుడి స్థానంలో మానవతను నిలబెట్టాలి:** ఇక్కడ "దేవుడిని తొలగించాలి" అనే ప్రశ్నకంటే ఒక ముఖ్యమైన ప్రశ్న ఉంది; మానవ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను ఎవరు తీసుకోవాలి? దేవుని పేరుతో మాట్లాడుతున్న వ్యక్తులా? మత గ్రంథాలను తమకు అనుకూలంగా వ్యాఖ్యానించే వ్యాఖ్యాతలా? లేక సాక్ష్యాలను పరిశీలించే, ప్రశ్నించే, తప్పును సరిదిద్దుకునే మానవ మస్తిష్కమా? ప్రజాస్వామ్యంలో చట్టాలు మత విశ్వాసాల ఆధారంగా కాకుండా సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, మానవ

హక్కులు, రాజ్యాంగ విలువలు ఆధారంగా ఉండాలి. విద్యా వ్యవస్థలో ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. పిల్లలకు "ఇది నిజం--ఎందుకంటే పెద్దలు చెప్పారు లేదా మత గ్రంథాల్లో చెప్పారు" అని కాకుండా, "దీనికి ఆధారం ఏమిటి?" అని అడగడం నేర్పాలి. అదే నిజమైన జ్ఞాన సమాజానికి పునాది.

**మానవ మస్తిష్కమే గొప్ప శక్తి:** మనిషి చంద్రుడిపై అడుగుపెట్టాడు. అణువును విభజించాడు. జన్యు రహస్యాలను ఛేదిస్తున్నాడు. కృత్రిమ మేధస్సును సృష్టించాడు. సముద్రాల లోతుల్లోకి, అంతరిక్షం అంచుల వరకు తన అన్వేషణను విస్తరించాడు. ఇంతటి అద్భుతాలను సృష్టించిన మానవ మస్తిష్కం తన స్వంత నిర్ణయాల విషయంలో మాత్రం ఇంకా భయం, మూఢనమ్మకం, మత విద్వేషం, కుల వివక్షలకు ఎందుకు బందీగా ఉండాలి? ఇది మానవ నాగరికత ముందున్న గొప్ప వైరుధ్యం. ప్రకృతిని అర్థం చేసుకోవడానికి, మార్చడానికి శాస్త్రాన్ని ఉపయోగిస్తున్న మనిషి, తనలోని అజ్ఞానం, పక్షపాతం, మూఢనమ్మకాలపై విజయం సాధించేందుకు కూడా అదే శాస్త్రీయ దృక్పథాన్ని ఉపయోగించాలి.

**భవిష్యత్తు సమాజం ఎలా ఉండాలి?:** మత విశ్వాసాలను వ్యక్తిగత పరిధిలో గౌరవిస్తూ, ప్రజా జీవితంలో మానవ సమానత్వాన్ని ప్రధానంగా నిలబెట్టే సమాజం కావాలి. అక్కడ; మతం వ్యక్తిగత విశ్వాసం మాత్రమే - రాజకీయ ఆధిపత్యానికి ఆయుధం కాకూడదు. విద్య ప్రశ్నించడాన్ని నేర్పాలి - అంధ విధేయతను కాదు. చట్టం ప్రతి మనిషిని సమానంగా చూడాలి. శాస్త్రీయ ఆలోచనకు సామాజిక గౌరవం పెరగాలి. మతం, కులం, భాష, జాతి పేరుతో ద్వేషాన్ని రెచ్చగొట్టే రాజకీయాలను తిరస్కరించాలి. మానవ ప్రాణం ఏ సిద్ధాంతం, మతం లేదా రాజకీయ ప్రయోజనం కంటే విలువైనదిగా పరిగణించాలి. ఇది దేవుడిని నమ్మేవారికి వ్యతిరేకంగా చేసే పోరాటం కాదు. మానవుడిని మానవుడికి శత్రువుగా మార్చే ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా చేసే పోరాటం.

**మానవాళి తన భవిష్యత్తును తానే నిర్ణయించుకోవాలి:** మనిషి తన భవిష్యత్తును ఏదో అదృశ్య శక్తి చేతుల్లో వదిలేయకుండా, తన జ్ఞానం, తన అనుభవం, తన శాస్త్ర విజ్ఞానం, తన నైతిక విచక్షణ ఆధారంగా నిర్మించుకోవాలి. మతాల పేరుతో యుద్ధాలు చేసి, దేవుని పేరుతో మనుషులను చంపి, చివరకు మానవ నాగరికతను మానవుడే నాశనం చేసుకుంటే-అది దేవుని విజయం కాదు; మానవ వివేకం ఓటమి. మనిషి తన మస్తిష్కాన్ని విముక్తి చేసుకున్నప్పుడే నిజమైన స్వేచ్ఛ ప్రారంభమవుతుంది. మానవుడి చేతిలోని గొప్ప ఆయుధం కత్తి కాదు-జ్ఞానం. అతని గొప్ప రక్షణ గోడ మతం కాదు-విచక్షణ. అతని గొప్ప ఆశ్రయం దేవాలయం కాదు-మానవత. అతని భవిష్యత్తును నిర్ణయించేది అదృశ్య శక్తి కాదు-మానవ మస్తిష్కం.

రాజ్యాంగం చూపిన మార్గం - శాస్త్రీయ దృక్పథం, మానవత, ప్రశ్నించే స్వభావం: ఇది కేవలం ఒక తాత్విక ప్రశ్న కాదు. భారత రాజ్యాంగం కూడా మన సమాజం ఏ దిశగా పయనించాలో స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని ఇచ్చింది. భారత రాజ్యాంగ పీఠిక భారతదేశాన్ని "సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రం"గా ప్రకటించింది. అంటే మతం ఆధారంగా పౌరుల మధ్య వివక్షకు తావులేని, సమానత్వం మరియు సామాజిక న్యాయం ఆధారంగా ప్రజాస్వామ్య జీవనాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనపై ఉంది. అంతేకాదు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ (హెచ్) ప్రతి భారత పౌరుడి ప్రాథమిక కర్తవ్యంగా "శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, ప్రశ్నించే మరియు సంస్కరించే భావాన్ని పెంపొందించడం"ను నిర్దేశించింది. ఈ మాటలు కేవలం రాజ్యాంగ పుస్తకంలోని అక్షరాలు కావు. అవి భారత సమాజ భవిష్యత్తుకు చూపిన దిశ.

ప్రశ్నించాలి-ఎందుకు? ఆలోచించాలి - ఆధారం ఏమిటి? శోధించాలి - నిజం ఏమిటి? తప్పు అయితే సంస్కరించాలి - ఇదే శాస్త్రీయ దృక్పథం. మత విశ్వాసం వ్యక్తిగత స్వేచ్ఛ. దానిని గౌరవించాలి. అదే సమయంలో ఏ మత విశ్వాసమైనా మానవ సమానత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనను, ప్రజాస్వామ్య విలువలను, మానవ హక్కులను అధిగమించి సమాజంపై అధికారాన్ని చెలాయించే స్థితికి చేరకూడదు. అందువల్ల దేవుడిని నమ్మేవాడైనా, నమ్మనివాడైనా - మానవ జీవితానికి సంబంధించిన సామాజిక, రాజకీయ, శాస్త్రీయ నిర్ణయాలకు ప్రాతిపదిక మానవ జ్ఞానం, ఆధారం, విచక్షణ, మానవత కావాలి. మతాల పేరుతో మనుషులు పరస్పరం ద్వేషించుకుంటూ, హింసించుకుంటూ, యుద్ధాలు చేసుకుంటూ ఉంటే, శాస్త్ర విజ్ఞానంతో సాధించిన మానవ ప్రగతి మొత్తం అర్థరహితమవుతుంది. అణ్వాయుధాలను సృష్టించిన మానవుడు వాటిని ఉపయోగించి తననే తాను నాశనం చేసుకునే ప్రమాదం ఉన్నట్లే, మత విద్వేషాలను పెంచుకున్న మానవ సమాజం కూడా తన నాగరికతను తానే ధ్వంసం చేసుకునే ప్రమాదంలో ఉంది. అందుకే మన ముందున్న అసలు పోరాటం దేవుడిపై కాదు - అజ్ఞానంపై; మతంపై కాదు - మత విద్వేషంపై; విశ్వాసంపై కాదు - విశ్వాసం పేరుతో జరిగే హింసపై.

మానవుడు తన భవిష్యత్తును తానే నిర్మించుకోవాలి. ఆ నిర్మాణానికి పునాదులు జ్ఞానం, శాస్త్రీయ దృక్పథం, మానవత, ప్రశ్నించే స్వభావం, సంస్కరణా చైతన్యం కావాలి. అదే మన భారత రాజ్యాంగ స్ఫూర్తి. అదే మానవ నాగరికత భవిష్యత్తుకు అవసరమైన మార్గం. మానవ మస్తిష్కాన్ని విముక్తి చేసి, మానవతను కేంద్రంగా చేసుకుని, శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని నిర్మించినప్పుడే మానవాళి సురక్షితంగా ఉంటుంది; నిజమైన ప్రగతిని సాధిస్తుంది. ❑

# భగవత్ సుభాషితాలు - ఆచరణలో విరుద్ధతలు!

- ఎం.కోటేశ్వరరావు



"హిందువులు నిద్రలేస్తే ప్రపంచం మేల్కొన్నట్లే" ఇదీ అమెరికా, కెనడా, బ్రిటన్ పర్యటనలో భాగంగా కెనడాలోని టొరంటో నగరంలో జరిగిన సభలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చెప్పిన సుభాషితం. ఎంతో చక్కగా చెప్పారు, ఇంతకూ హిందువులు ఎప్పుడు నిద్రలేస్తారో చెప్పకుండా అది జరిగితే, ఇదైతే అని చెప్పటం వల్ల ఉపయోగమేమిటి? నిద్ర లేవకుండా ఎవరు అడ్డుకున్నారు? భగవత్ మూడు దేశాల పర్యటన అన్ని చోట్లా తీవ్ర వివాదాన్ని రేపింది. అవి నోరున్న దేశాలు గనుక వార్తలు ప్రపంచవ్యాపితంగా వెళ్లాయి. మనదేశ మీడియాలో కూడా చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నది బీజేపీ, తెరవెనుక ఉండి దాన్ని ఆడిస్తున్నది మాతృసంస్థ ఆరెస్సెస్ అన్నది జగమెరిగిన సత్యం. అలాంటి సంస్థ అధినేత పర్యటన అంటే ఒక రాజ్యాంగేతర శక్తి చేస్తున్నట్లే భావించాలి. తనను ఒక సాంస్కృతిక సంస్థగా కాషాయదళం చెప్పుకుంటుంది. కానీ, ప్రపంచానికి అది మేకతోలు కప్పుకున్న పులి, ఒక మతోన్మాద సంస్థగా అనేక మంది భావిస్తున్నారు. ఆ మచ్చను తుడిచి వేసుకొనేందుకు వంద సంవత్సరాల క్రితం అది పుట్టినప్పటి నుంచీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు.

భారత్ విశ్వగురువుగా మారింది తప్ప విశ్వశక్తి కాదని టొరొంటో సభలో ఆరెస్సెస్ అధినేత చెప్పారు. ప్రపంచ మిలిటరీ, జీడీపీలో అగ్రభాగాన ఉన్నందున అమెరికా ప్రపంచశక్తి అని భావిస్తే అదొకతీరు. మనం ఏ రంగంలో ముందున్నట్లు, గురువుగా ప్రపంచానికి నేర్పిందేమిటి? "హిందూ విశ్వ బంధు–స్నేహ బంధంతో ప్రపంచ ఆలింగనం" అనే ఇతివృత్తంతో కెనడియన్ హిందూస్ ఫర్ అవుట్‌రీచ్, రిలేషన్స్ అండ్ డైలాగ్(కోర్డ్) సంస్థ ఏర్పాటు చేసిన సభలో భగవత్ మాట్లాడుతూ భారత్ సూపర్ పవర్ కాదని, తన స్వంత వ్యక్తిత్వంతో ప్రపంచానికి సేవలు అందించిందని, భారత్ ఎదుగుదలను ఆధిపత్యంతో కాక సేవతో కొలవాలని అన్నారు. సేవ భారత జన్యుమూలాల్లోనే ఉందని, హిందువులు మేలుకొంటే ప్రపంచమే నిద్రలేచినట్లని చెప్పారు. ముస్లింలు, పార్సీలు, యూదులు, క్రైస్తవులు ఎక్కడైనా వేధింపు లకు గురైతే భారత్‌లో ఆశ్రయం దొరికిందని, భారత పూర్వీకులు దేశాలను ఆక్రమించేందుకు కాక జ్ఞానాన్ని పంచేందుకు విదేశాలకు వెళ్లారని పేర్కొన్నారు. ఇక్కడ సమస్య యావత్ ప్రపంచానికి మన పూర్వీకులు జ్ఞానం ప్రసాదిస్తే, అది మన వేదాలు, పురాణాల్లో నిక్షిప్తమై ఉంటే దాన్ని మనం




వినియోగించుకోకుండా "మ్లేచ్ఛులకు" అందించి వారు విమానాలు, క్షిపణులను తయారు చేసేందుకు ఎందుకు సహకరించినట్లు? పారిశ్రామిక విప్లవాన్ని, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా ఉండి, సమాజాన్ని నిచ్చెనమెట్ల వివక్షాపూరితంగా ఎందుకు తయారు చేసుకున్నాం. సముద్రాలు దాటి ప్రయాణించిన వారు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని ఎందుకు నిబంధనలు విధించినట్లు?

మన పూర్వీకులు ప్రపంచాన్ని చుట్టి జ్ఞానాన్ని అందించారని చెబుతున్న వారు ప్రయాణాలను నిషేధించిన బౌధాయన ధర్మశాస్త్రం, మనుస్మృతి గురించి ఏం చెబుతారు. సముద్రాలు దాటితే కుల భ్రష్టులౌతారు, ఆచారాలు మంటకలుస్తాయని చెప్పిన ఆంక్షల నేపథ్యంలో భగవత్ చెప్పిన పూర్వీకులు విదేశాలకు వెళ్లారంటే వారు తిరుగుబాటుదారులై ఉండాలి. అలాంటి వారిని పొగుడుతున్న కాషాయ దళాలు మరోవైపు మనుస్మృతిని విమర్శించే వారిని హిందూ వ్యతిరేకులు అని ఎందుకు నిందిస్తున్నట్లు? సనాతనాన్ని కాపాడాలి లేదా పునరుద్ధరించాలని చెబుతున్నవారు సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలనుకుంటున్నట్లా, వెనక్కు నడపాలని చూస్తున్నారా? జనాలు ఊరూ పేరులేని వాట్సాప్‌లకు మాత్రమే పరిమితం కాకుండా స్వంత మెదళ్లకు పని పెట్టాలి. హిందూ అంటే మతం కాదు, జీవన విధానం అని చెబుతారు. "నేను హిందూ అని చెప్పినపుడు ఆ పదాన్ని ఒక నిర్దిష్ట భాష, ప్రత్యేక ఆరాధన రూపం, లేదా ఏ జీవన శైలితోనూ నిర్వచించకూడదు. హిందువులు అందరినీ గౌరవించాలి, అందరినీ ఆమోదించాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడాలి," అని భగవత్ చెప్పారు. ఆచరణలో కాషాయ దళాలు అలాగే ఉన్నాయా? ఒకవైపు వసుధైక కుటుంబం అని చెబుతారు. మరోవైపు దేశంలో జనాభాను పెంచుతూ ముస్లింలు మెజారిటీగా మారేందుకు చూస్తున్నారని ఆరోపిస్తూ, హిందు

వులు పిల్లలను ఎక్కువగా కనాలని ప్రబోధించటం తెలీదా? దక్షిణ భారత్‌లో ఉన్న హిందువులు కుటుంబ నియంత్రణ ఎందుకు పాటిస్తున్నారు, ఉత్తర భారతంలోని వారు ఎందుకు ముందుకు రావటం లేదు? జనాభా నియంత్రణ అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రపంచ సగటు జననాల రేటు 2.23 కాగా, అంతకంటే తక్కువగా ఉన్న ముస్లిం దేశ సమాజా లు ఉన్నాయి. యావత్ ప్రపంచాన్ని మతపరంగా ముస్లింలతో నింపాలనే కుట్ర ఉంటే మాల్దీవులు, మలేషియా, బహరెయిన్, ఇరాన్, టర్కీ వంటి చోట్ల మనకంటే తక్కువగా జననాల రేటు ఎందుకు ఉన్నట్లు? ఏ దేశానికైనా జనాభా వృద్ధి రేటు 2.1గా ఉండాలన్నది ఆ రంగ నిపుణుల సిఫార్సు. మనదేశంలో సగటు రెండుగా ఉంది. ఇక మతాల వారీ చూస్తే ముస్లింలు 2.36, హిందువులు 1.94 ఉన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 1992లో ముస్లింలలో 4.41గా ఉన్న పిల్లలు 2019-21 నాటికి 2.36కు తగ్గారు. ఇదే కాలంలో రెండు మతాల వారి మధ్య ఉన్న తేడా 1.11 నుంచి 0.42కు తగ్గింది. కుట్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేసేవారు, నమ్మేవారు దీనికి ఏ సమాధా నం చెబుతారు? యావత్ ప్రపంచం ఒకే కుటుంబం అని మోహన్ భగవత్ సెలవిస్తారు. వారి రాజకీయ ప్రతినిధి బీజేపీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అని చెబుతుంది. చట్టసభల ఎన్నికల్లో మాత్రం దేశంలో 15శాతంగా ఉన్న ముస్లిం సామాజిక తరగతిలో ఒక్కరంటే ఒక్కరిని కూడా తమ అభ్యర్థులుగా నిలప దు. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో అన్ని కులాలవారికీ ప్రాతి నిధ్యం కల్పిస్తున్నామని చెప్పే పార్టీ మత వివక్షతో అసలు అవకా శం కల్పించకపోవటాన్ని మతోన్మాదం లేదా మతవిభజనగాక ఏ పేరుతో పిలవాలి? మోహన్ భగవత్ పర్యటనకు మూడు దేశాల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. ఇక్కడ సమస్య వ్యక్తిగతం కాదు. భావజాలం, విద్వేష పూరిత వ్యాఖ్యలు, ఆచరణకు సంబంధిం చిన అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.

ఆరెస్సెస్ సభతో కెనడాలో సామాజిక అశాంతి తలెత్తుతుం దని, మైనారిటీలుగా ఉన్న ముస్లింలు, సిక్కులు, దళితులకు ముప్పు తలెత్తుతుందని ఎన్‌డిపి పక్ష ఎంపీలు ప్రభుత్వానికి బహిరంగలేఖ రాశారు. అక్కడి పౌర సమాజంలోని 267 సంస్థలు, బృందాలు కూడా భగవత్ ప్రవేశానికి అనుమతి ఇవ్వకూడదని, ఆరెస్సెస్‌ను నిషేధించాలని కోరాయి. దీనికి పోటీగా వందకుపైగా ఇండో-కెనడియన్ హిందూ సంస్థలు రాసిన లేఖలో ఆధారం లేకుండా నిషేధం విధించటం అన్యాయమైన రాజకీయ వత్తిడి అని, భగవత్ పర్యటనను అడ్డుకోవటమంటే కెనడా హిందూ సమాజం పట్ల వివక్ష చూపటమేనని పేర్కొన్నాయి. కెనడా మాజీ రక్షణ మంత్రితో సహా మరికొందరు ఆరెస్సెస్‌కు మద్దతు పలికారు. బ్రిటన్‌లో దక్షిణాసియా సంతతికి చెందినవారు, మానవహక్కుల బృందాలు పర్యటనను వ్యతిరేకించాయి. వసుధైక కుటుంబ ఉత్సవాల ముసుగులో అమెరికాలో ఏర్పాటుచేసిన మోహన్ భగవత్ పర్యటనపట్ల కూడా వ్యతిరేకత వెల్లడైంది. సభ జరిగిన మాడిసన్ స్క్వేర్ న్యూయార్క్ నగరంలో ఉంది. ఆ నగర మేయర్ జోహ్రాన్ మందానీ ఆరెస్సెస్ నేత పర్యటనకు తాను వ్యతిరేకమని, అయితే ఒక మేయర్‌గా భగవత్ కార్యక్రమాలను అడ్డుకొనే అధికారం తనకు లేదని చెప్పారు. జోహ్రాన్ తండ్రి గుజరాతీ మూలాలున్న అమెరికా పౌరుడు మహమ్మద్ మందానీ, తల్లి ప్రముఖ భారతీయ సినిమా దర్శకురాలు మీరా నాయర్. మూడు పదులు దాటిన జోహ్రాన్ న్యూయార్క్ నగరానికి తొలి ఇండియన్-అమెరికన్ మేయర్‌గా చరిత్రకెక్కారు.

అమెరికా పార్లమెంట్‌కు సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మతస్వేచ్ఛ అమెరికా కమిషన్ (యుఎస్‌సిఐ ఆర్ఎఫ్) అమెరికా ప్రభుత్వ అధికారులు భగవత్‌ను కలవరాదని కోరింది. ఆరెస్సెస్ ఉపసంఘాలు మతపరమైన మైనారిటీల మీద హింసాత్మక చర్యలకు పాల్పడినట్లు ఆ సంస్థ నివేదికలో పేర్కొన్నది. ఈ సంస్థ పక్షపాతంతో కూడినదని, దానికి విశ్వసనీ యత లేదని మన విదేశాంగ శాఖ ఆరెస్సెస్‌ను వెనుకేసుకు వచ్చింది. తీవ్ర వ్యతిరేకత తలెత్తిన నేపథ్యంలో సభా నిర్వాహకుల ఎక్స్ ఖాతాను ఆ సంస్థ యాజమాన్యం నిలిపివేసి వత్తిడి తరు వాత పునరుద్ధరించింది. హిందూ అమెరికన్ ఫౌండేషన్ తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సభకు హాజరయ్యేవారికి సూచిం చింది. ఇలాంటి సంస్థలు ఎంతగా రెచ్చగొట్టినా ఎలాంటి అవాంఛనీయ ఉదంతాలు లేకుండా కార్యక్రమం ముగిసింది. ఆరెస్సెస్ వ్యాపింపచేస్తున్న పచ్చి అవాస్తవాలు ఎన్నో. జాతిపిత మహాత్మా గాంధీని హత్యచేసిన గాడ్సే అంతకు ముందే తమ సంస్థనుంచి వెళ్లిపోయి హిందూమహాసభలో చేరాడన్నది వాటిలో ఒకటి. అయితే గాడ్సే ఎప్పుడు ఆరెస్సెస్‌లో చేరిందీ, ఎప్పుడు వెళ్లిపోయిందీ ఎలాంటి ఆధారాలు లేవు. అసలు ఆ సంస్థ సభ్యత్వం రహస్యం. నాథూరామ్ గాడ్సే, అతని సోదరుడు గోపా ల్ గాడ్సే ఆరెస్సెస్‌లో చురుకైన కార్యకర్తలని, వారెప్పుడూ సంస్థ నుంచి బయటకు పోలేదని కుటుంబ సభ్యులు పదే పదే స్పష్టం చేశారు. గోపాల్ గాడ్సే మనుమడు సాత్యకీ సావర్కర్ ఒక పరువు నష్టం కేసులో 2026 ఆగస్టులో పూనా కోర్టులో సాక్ష్యమిస్తూ అదే చెప్పాడు. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక సావర్కర్, గాడ్సే కుటుంబాలకు ఆరెస్సెస్‌తో ఉన్న సంబంధాల గురించి సాత్యకి చెప్పిన అంశాలను ప్రచురించింది. గాడ్సే కోర్టులో చేసిన వాదనలను పుస్తకరూపంలో అచ్చువేసి ప్రచారంలో పెడుతున్నది కాషాయ దళం తప్ప మరొక "దేశభక్తుడు" ఎవరూ కాదు. అయినా సరే గాడ్సేతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆరెస్సెస్ పదే పదే గోబెల్స్ ప్రచారం చేస్తున్నది. మోహన్ భగవత్ మూడు దేశాల పర్యటన సందర్భంగా ఆర్గనైజర్ పత్రికలో దాన్నే పునరుద్ఘాటించారు. ❑

# మనువాదులు, చరిత్రలో అశోకుడి కూడా చోటివ్వలేదు!

- ప్రొ. దేవరాజు మహారాజు



బ్రాహ్మణవాదానికీ-బౌద్ధానికీ జరిగిన సంఘర్షణే మన భారతదేశ చరిత్ర - డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ వైదిక మత భావ జాలం ఉన్న రచయితల కుత్సిత బుద్ధి ఎలా ఉంటుందో మనం ప్రస్ఫుటంగా చూడొచ్చు. వారు నిజాల్ని దాచేస్తారు. లేదా వక్రీకరిస్తారు తప్ప, ఉన్నది ఉన్నట్లుగా నమోదు చేయరు. ఉదాహరణకు సర్ ఎడ్వర్డ్ ఆర్నాల్డ్ 'ద లైట్ ఆఫ్ ఏసియా' శీర్షికతో ఒక ఇంగ్లీషు పద్యకావ్యం 1879లో లండన్‌లో ప్రచురించాడు. బుద్ధుణ్ణి ఆయన అలా సంభోదించాడు. అనువాదకులు ఏం చేయాలి? 'ఆసియా ఖండపు వెలుగు' అని రాయాలి కదా? అలా రాయకుండా 'బుద్ధ చరిత్రము' అని ప్రకటించారు. అంటే, బుద్ధుడికి అంతటి గౌరవం, విలువ ఇవ్వడానికి మనువాదులకు మనస్కరించలేదు. అలాగే అశోకుడి గూర్చి, ఆయన ప్రజారంజకమైన పాలన గూర్చి వైదిక రచయితలు సరిగా రాయలేదు. రాసినా, తగ్గించి అందరి రాజుల్లో ఆయనా ఓ రాజు అన్నట్లు తేల్చేశారు. రోడ్లు వేయించెను, చెట్లు నాటించెను, బాటసారులకు విశ్రాంతి గృహాలు నిర్మించెను వంటివి మాత్రమే రాశారు. కానీ, ఆయన ఎందుకు మహోన్నతుడయ్యాడూ? అంతటి చక్రవర్తి ప్రపంచంలో మరొకరు ఎందుకు లేరూ? వంటి విషయాలు రాయలేక పోయారు. కారణం అశోకుడు ఈ దేశ మూలవాసి కాబట్టి! బయటి నుంచి వలసవచ్చిన ఆర్య సంతతివాడు కాదు కాబట్టి! పైగా, బౌద్ధాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు.



బౌద్ధాన్ని జన జీవనంలో ఒక భాగంగా చేసిన అశోకుడిని వారెందుకు కీర్తిస్తారూ? తప్పనిసరిగా చెప్పాల్సి వచ్చినపుడు మోరియ జాతి శూద్రజాతి-అనీ, వారు దురాచారులనీ చెప్పారు. ఇక్కడి భూమి పుత్రులు స్వంతంగా, స్వతంత్రంగా ఎదిగి, మహా చక్రవర్తులయ్యారని మనువాద రచయితలు ఒప్పుకోలేక పోయారు. అందుకే వారు, మౌర్యుల చరిత్రను కావాలని వదిలేశారు. అయితే, ఆ విషయం బయటపడి చివరకు వారే చులకన అయిపోయారు. అశోకుడి ప్రభను ఎవరూ తగ్గించలేక పోయారు. కారణం-పాత గ్రంథాలు అయిన ఉజ్వల చరిత్రను నమోదు చేసి ఉంచాయి. రాహుల్ సాంకృత్యాయన్ కృషి వల్ల వేల గ్రంథాలు మళ్లీ భారతదేశానికి చేరాయి. ముఖ్యంగా చెప్పుకోవలసి వస్తే, అశోకావదానం, విశుద్ధమగ్గ, దీపవంశ, మహావంశ, సమంత వినీదికా, కుణాళావధానం, అశోక రాజసూత్రం, అశోక వినీతావధానం, అశోక రాజావధానం వంటి ఎన్నో గ్రంథాలు అశోకుని చరిత్రనంతా నమోదు చేశాయి. అశోకుడి వ్యక్తిత్వం, అయనలో వచ్చిన మార్పు, బౌద్ధ సేవ, ఔదార్యం, పాలనా సామర్థ్యం, ఇంకా మౌర్యవంశం ఉచ్ఛస్థితి, పతనం వంటివన్నీ ఆ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అవి ప్రపంచ భాషల్లోకి, భారతీయ భాషల్లోకి అనువాద మయ్యాయి. అరచేతిని అడ్డుపెట్టి సూర్యరశ్మిని ఆపలేరన్నట్టు అశోకుణ్ణి మనువాదులు మరుగు పరచలేకపోయారు.

బౌద్ధం మీద వారు ఎంతటి క్రూరమైన దాడులు జరిపినా, బౌద్ధాన్ని నాశనం చేయలేకపోయారు కదా? ఛండాశోకుడిగా ఉన్న అశోకుడు కళింగ యుద్ధం తర్వాత ధర్మాశోకుడిగా మారాడు అనేది అందరికీ తెలిసిందే! అయితే, అంతటి విధ్వంసంలో కూడా కళింగ ప్రాంతపు బౌద్ధులు శత్రుసేనల పట్ల అంటే - అశోకుడి సేనలపట్ల చూపిన ఔదార్యానికి అశోకుడి మనసు కరిగిపోయింది. ఆయనలో మార్పునకు ఇది కూడా ఒక కారణం - ఈ కళింగ బౌద్ధులలో అధికశాతం తెలుగు వారు కూడా ఉన్నారు. కాబట్టి, అశోకుడి పరివర్తనకు తెలుగు బౌద్ధులు కూడా కారణమయినట్టే- సాధారణ శకానికి ముందు 260 బిసిఇలో యశస్సుడు, పిండోల భరద్వాజుడు, సముద్రుడు వంటి భిక్షువుల సమక్షంలో ఉపగుప్తుని ద్వారా అశోక చక్రవర్తి విజయదశమి రోజున బౌద్ధం స్వీకరించాడు. అప్పటినుంచి ఈ దేశ ప్రజలు ఆ రోజును 'అశోక విజయ దశమి'గా పరిగణిస్తున్నారు, అయితే, బౌద్ధం స్వీకరించకముందే- పరిపాలనలో తనకు ఏదైనా సమస్య ఎదురైతే, అశోకుడు యశస్సుడనే భిక్షువు సలహాలు తీసుకునేవాడు. బౌద్ధం ఏ విధంగా జనహితమో అన్నది కూడా అప్పుడప్పుడు ఆయనతో చర్చిస్తూ ఉండేవాడు. ఒకసారి ఉపగుప్తుని వెంటతీసుకుని తన సామ్రాజ్యంలోని బౌద్ధస్థలాలు పర్యటించి విషయాలు ఆకళింపు చేసుకున్నాడు కూడా! ఇలాంటి విషయాలు మహావంశంలో నమోదై ఉన్నాయి.

బౌద్ధధమ్మంలో 84 వేల సుత్తాలున్నాయని మొగలిపుత్త తిస్స

ద్వారా తెలుసుకున్న అశోకుడు, బుద్ధుని ధాతువుల్ని సేకరించి, వాటిని భాగాలుగా విడగొట్టి, వాటిపై 84 వేల స్థూపాల్ని తన సామ్రాజ్యమంతటా నిర్మించాడు. అందువల్ల, అశోకుడు నిర్మించిన ఏ స్థూపమైనా అది బుద్ధుడి ధాతువులపై నిర్మించిందేనని పరిశోధకులు ధృవీకరించారు. ఇవి మాత్రమే కాకుండా చైత్యాలు, రాతి స్తంభాలు, గుహారామాలు, కూడా వేల సంఖ్యలో నిర్మించాడు. భిక్షువుల్ని విదేశాలకు పంపి, అక్కడ బౌద్ధాన్ని ప్రచారం చేయించాడు. నిజానికి బుద్ధుడి కాలం నాటి కంటే కూడా బౌద్ధం అశోకుడి కాలంలోనే విస్తృతంగా ప్రచారమైంది. ప్రపంచ వ్యాప్తమైంది. బౌద్ధ ప్రచారంలో ఆయనది అవిశ్రాంత కృషి! జంబూద్వీపమంతటిని పాలించిన అశోకుణ్ణి మించిన చక్రవర్తి ప్రపంచంలోనే మరొకరు లేరు – అని అంటే అది అతిశయోక్తి కాదు. సుమారు 50 లక్షల కి.మీ.లకు మించిన సువిశాలమైన ప్రాంతం– అంటే, ఇప్పటి మన భారతదేశంతో పాటు, ఇరాన్ సరిహద్దు, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, కశ్మీర్, నేపాల్, బర్మా. శ్రీలంకలో కొంత భాగాన్ని కలిపి మొత్తాన్ని 42 ఏండ్ల పాటు ఏక ఛత్రాధిపత్యంగా పరిపాలించినవాడు అశోక చక్రవర్తి. ఈ దేశ మూలాలున్న సిసలైన భారతీయుడు. అభివృద్ధిని పరుగులు పెట్టించినవాడు. అశోకుని తాత చంద్రగుప్త మౌర్యుడు 322 బిసిఇలో భారత దేశానికి చక్రవర్తి అయిన నాటి నుంచి చివరిరాజు బృహద్రత మౌర్యుని వరకు అంటే– 185 బిసిఇ వరకు సుమారు 42 ఏండ్లు సుదీర్ఘ కాలం పాటు ప్రజాపాలన అందించాడు. అతి విశాలమైన పెద్ద రాజ్యాన్ని ఏలడమే కాదు, ఎక్కువ కాలం పాలించిన ఏకైక చక్రవర్తి. ప్రజలందరూ తన బిడ్డలేనని భావించాడు. ప్రజా సంక్షేమ పాలనకు రూపకల్పన చేసినవాడు. మిగులు ధనాన్ని నేరుగా ప్రజలకు అందించిన వాడు. కోశాగారాన్ని ప్రజలకు పంచి ధర్మనిరతిగల చక్రవర్తిగా పేరుగాంచాడు. ధ్దమ్మమే సమస్త జీవకోటిని రక్షిస్తుందన్న బుద్ధుడి సందేశాన్ని తను పాటిస్తూ, ఆ సందేశాన్ని విశ్వవ్యాప్తం చేయడమేకాదు, అందుకు తన కుటుంబాన్ని కూడా వినియోగించాడు. ప్రజలందరూ మానవీయ విలువలు పాటించాలన్న నియమాన్ని చట్టబద్ధం చేశాడు గనక, సమాజం నైతికంగా ఎదగగలిగింది. దీనిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది జంతు బలుల నిషేధ చట్టం. మనుషులతోపాటు, పశువులకు కూడా చికిత్సాలయాలు ఏర్పరచడం, గంగానదితోపాటు అనేక నదుల శుభ్రతకు చర్యలు చేపట్టడం వంటివి అంతకుముందు ఏ రాజూ చేయని తొలి ప్రయత్నాలు. ఆ విధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చిన చక్రవర్తిగా చరిత్రలో నిలిచిపోయాడు. వీటన్నిటి వెనక బౌద్ధధమ్మ ప్రభావం బలంగా ఉంది. బౌద్ధధమ్మ సూత్రాలను, తన పరిపాలనా విధానాలను ప్రజల భాషలో శిలలపై చెక్కించి– శాసనాలు ప్రజలకు అందు బాటులో ఉంచాడు. ఒక రకంగా అది అనాటి రాజ్యాంగాన్ని ప్రజలకు చేరువ చేయడం! తను రాజుగా ఉన్న 42 ఏండ్లలో సుమారు 25సార్లు ఖైదీలను క్షమించి విడుదల చేశాడు. నేరగాళ్లలో గణనీయమైన పరివర్తన రావడం వల్ల, కారాగారాల అవసరం లేదని.. వాటిని కూలగొట్టించాడు. ఈ విషయం ఆయన వేయించిన ఐదవ శిలా శాసనం చెప్తుంది. నేరాలు లేని రాజ్యంగా తీర్చిదిద్దడ మంటే మాటలు కాదుగదా? ప్రపంచంలో మరే ఇతర చక్రవర్తీ ఇంత జనరంజకంగా పరిపాలించినట్టు ఆధారాలు లేవు. అంతేకాదు, తన సామ్రాజ్య సంపదను శరవేగంగా పరుగులు తీయించి, ఆయన పాలించిన కాలాన్ని స్వర్ణయుగంగా మార్చాడు. ఈ విషయాన్ని వక్రీకరించి, వైదిక రచయితలు గుప్త రాజుల కాలాన్ని స్వర్ణయుగమని ప్రచారం చేశారు. చివరి మౌర్య చక్రవర్తి బృహద్రతుని తర్వాత. అతని సేనాని పుష్యమిత్ర శృంగుడు – శృంగ వంశస్థాపన చేశాడు. బౌద్ధాన్ని దెబ్బతీయాలన్న కుట్రతోనే అదే కాలంలో రామాయణ, మహాభారతాలు – మనుస్మృతీ రాయబడ్డాయని నిరూపించబడింది. 'పుషమిత్ర శృంగుడే– రామాయణంలోని రాముడని' రాహుల్ సాంకృత్యాయన్ వంటి మహా పండితుడే స్పష్టం చేశాడు. ఆయన రచన 'ఓల్గాసే గంగా' చదివిన వారికి ఈ విషయం తప్పకుండా తెలుస్తుంది. ఇక ఈ వైదిక పండితులు చేసిన నిర్వాకం మరొకటి కూడా ఉంది. అశోకుడి జన్మదినాన్ని శ్రీరామ నవమిగా మార్చి జనం మీద రుద్దారు. వారు సృష్టించిన ఎన్నో అబద్ధపు పండగలలో దీన్ని కూడా చేర్చారు. వాస్తవమేమంటే చైత్ర శుక్ల అష్టమి రోజున అంటే– రామ నవమికంటే ఒకరోజు ముందు అశోక చక్రవర్తి పుట్టిన రోజు వస్తుంది. దాన్ని మరుగుపరచడానికి, శ్రీరాముడి పుట్టిన రోజు రామ నవమిని మనముందు పెట్టారు. రాముడు చారిత్రక పురుషుడు కాదు. కాల్పనిక రచనలో ఒక పాత్ర–అంతే! బుద్ధుడైనా, అశోకుడైనా కల్పించిన పాత్రలు కారు. వాస్తవంగా ఈ దేశంలో పుట్టి పెరిగిన చారిత్రక పురుషులు. ఆ తేడాను గమనించుకోవాలి! దార్శనికుడైన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ఏర్పడ్డ మన భారత తొలి స్వతంత్ర, ప్రజాస్వామ్య ప్రభుత్వం బౌద్ధ చిహ్నాల్ని, అశోకుడి చిహ్నాల్ని అధికారికంగా స్వీకరించింది. బుద్ధుడి ధమ్మచక్రం మన జాతీయ పతాకంలో చేరింది. సారనాథ్‌లో అశోకుడు స్థాపించిన ఏకశిలా స్తంభం మీద గల నాలుగు సింహాలు మన దేశ అధికార ముద్రగా మారింది. రాష్ట్రపతి భవన్ దర్బార్‌హాల్‌లో నిలువెత్తు బుద్ధ విగ్రహం ప్రతిష్టించుకున్నాం. ఇవన్నీ ఏం తెలియజేస్తున్నాయి? ఇది కాల్పనిక పాత్రలయిన రాముడి దేశమో, కృష్ణుడి దేశమో కాదు మన చారిత్రక పురుషులైన బుద్ధుడి దేశము, అశోకుడి దేశమూ.. అని చెప్పకనే చెపుతున్నాయి. ఆ వారసత్వాన్ని నిలుపుకుంటూ, స్వేచ్ఛా సమానత్వాలతో ఒకప్పుడు శీల ప్రధానమైన దేశంగా వెలసిల్లిన ఈ దేశాన్ని, మళ్లీ ఆ దశకు, ఆస్థాయికి తీసుకుపోవాల్సిన బాధ్యత రాబోయే తరాలదే! ఇక ఇప్పుడు కావల్సింది రామరాజ్యం కాదు, అశోకుడి రాజ్యం!!? ❑

# చివరి శ్వాస వరకు ప్రజల కోసమే...



- జి. రాములు

కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఇక మన మధ్య లేరు. ఒక గొప్ప సహచరుడిని, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును, రైతు ఉద్యమానికి అంకితమైన నాయకుడిని కోల్పోయిన బాధ మనందరిలో ఉంది. ఏడు దశాబ్దాలపాటు కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై, తన జీవితంలోని ప్రతి దశను ప్రజల కోసం, ముఖ్యంగా రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యల కోసం అంకితం చేసిన మల్లారెడ్డి 88 ఏళ్ల వయసులో 2026 ఆగస్టు 23న అమరుడయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని వర్గాల ప్రజల గౌరవాన్ని పొందిన నాయకుడు ఆయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యునిగా, జాతీయ కిసాన్ సభ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. పదవుల కోసం కాకుండా, బాధ్యత కోసం పనిచేసిన నాయకత్వం ఆయనది. ఉద్యమం ఎక్కడ బలహీనపడినా అక్కడ నిలబడటం, ప్రజల సమస్య ఎక్కడ కనిపించినా దానిపై పోరాడటం ఆయన సహజ స్వభావంగా మారిపోయింది.

## నిర్బంధాల మధ్య నిలిచిన ధైర్యం

మల్లారెడ్డి రాజకీయ జీవితం వరంగల్ జిల్లాలోని తన స్వగ్రామం తిమ్మంపేట నుంచి ప్రారంభమైంది. అప్పట్లో ఆయన గ్రామ పోలీస్ పటేల్‌గా పనిచేసేవారు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు మద్దికాయల ఓంకార్‌తో పరిచయం ఏర్పడటం ఆయన జీవిత గమనాన్నే మార్చింది. 1980వ దశకంలో వరంగల్ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంది. నర్సంపేట తాలూకాలో కాంగ్రెస్ గుండాల దాడులు, హత్యలు, అక్రమ కేసులు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఆ సమయంలో మల్లారెడ్డి ఓంకార్‌కు సన్నిహిత సహచరుడిగా పనిచేస్తూ అవసరమైన సమాచారాన్ని అందించడం, నోట్స్ తయారు చేయడం, ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయడం వంటి అనేక బాధ్యతలు నిర్వహించారు. ఆయనపై కూడా అనేక అక్రమ కేసులు నమోదయ్యాయి. అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చింది. జైలు జీవితం అనుభవించాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. వ్యక్తిగత భద్రత కంటే ఉద్యమ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. 1984లో ఓంకార్ పార్టీ నుంచి బయటికి వెళ్లిన తర్వాత వరంగల్ జిల్లా ఉద్యమాన్ని కాపాడటంలో మల్లారెడ్డి పాత్ర మరింత కీలకమైంది. తిమ్మంపేటను పార్టీకి బలమైన కేంద్రంగా నిలిపారు. నర్సంపేట అడవి ప్రాంతాల్లో గిరిజనుల భూముల కోసం, ఆసరవెల్లి రైతుల



సారంపల్లి మల్లారెడ్డి

భూముల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించారు. ఆ క్లిష్ట కాలంలో జిల్లా నాయకత్వం దాదాపు పూర్తిగా విచ్ఛిన్నమైనా కొద్దిమంది నాయకులు ఉద్యమాన్ని నిలబెట్టారు. వారిలో మల్లారెడ్డి ఒకరు. పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహా నేతలు జిల్లా ఉద్యమ పరిస్థితులపై నాయకత్వంతో చర్చించిన సందర్భాల్లో మల్లారెడ్డి ఇచ్చిన సూచనలు పార్టీకి ఎంతో ఉపయోగపడ్డాయి.

## మళ్లీ ఉద్యమాన్ని నిర్మించిన నాయకుడు

ఓంకార్ పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత వరంగల్ జిల్లా ఉద్యమాన్ని తిరిగి నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పగూడెంలో జరిగిన జిల్లా మహాసభలో ఈ అంశంపై తీవ్రమైన చర్చ జరిగింది. కొరటాల సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శిగా హాజరైన ఆ మహాసభలో కొత్త జిల్లా సెక్రటేరియట్, జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకున్నాం. అందులో మల్లారెడ్డి కూడా ఉన్నారు. జిల్లా ఉద్యమ అవసరాల కోసం తిమ్మంపేటను వదిలి వరంగల్ జిల్లా కేంద్రానికి రావాలని నిర్ణయించినప్పుడు ఆయన ఒక్క క్షణం కూడా వెనుకాడలేదు. ఆయన రాకతో జిల్లా కేంద్రంలోని పార్టీ బలపడింది. వరంగల్ నగర ఉద్యమం కూడా అభివృద్ధి చెందింది. కొద్ది సంవత్సరాల్లోనే మార్క్సిస్టు పార్టీ తిరిగి జిల్లాలో ఒక ప్రధాన వామపక్ష శక్తిగా ఎదిగింది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు గెలవడం, అనేక గ్రామాల్లో పార్టీ బలపడటం వెనుక ఆ కాలంలో జరిగిన నిరంతర నిర్మాణ కృషి ఉంది. ఆ పునర్నిర్మాణంలో మల్లారెడ్డి పాత్రను ప్రత్యేకంగా గుర్తించాలి.

**రైతు సమస్యలపై నిరంతర అధ్యయనం**

1996 తర్వాత హైదరాబాద్ రాష్ట్ర కేంద్రానికి వచ్చిన మల్లారెడ్డి రైతు సంఘం బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, జాతీయ కిసాన్ సభ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. అప్పటి నుంచి ఆయన జీవితం రైతాంగ సమస్యల అధ్యయనం, ఉద్యమం, రచనలతో మరింతగా ముడిపడింది. భూమి సమస్యలు, రైతుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, నీటి వనరులు వంటి అంశాలపై ఆయన లోతైన అధ్యయనం చేశారు. అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు. ఈ రంగాల్లో తెలుగు రాష్ట్రాల్లోనే ఒక ప్రముఖ మేధావిగా గుర్తింపు పొందారు. దేశంలోని జాతీయ మీడియా ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు, రైతు ఉద్యమ నాయకులు సమాచారం కోసం ఆయనను సంప్రదించేవారు. ఏ అంశంపై సమాచారం కావాలన్నా మల్లారెడ్డి వద్ద దొరుకుతుందనే విశ్వాసం ఉండేది. ఆయన గది ఎప్పుడూ సందర్శకులతో, చర్చలతో, ఉద్యమ సమస్యలతో కళకళలాడుతుండేది.

**అందరివాడైన కమ్యూనిస్టు**

మల్లారెడ్డి గొప్పతనం ఆయన రాజకీయ పరిజ్ఞానంలో మాత్రమే లేదు. ఆయన వ్యక్తిత్వంలో ఉంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఆయనను అభిమానించేవారు. సాధారణ కార్యకర్తను సైతం ఎంతో గౌరవంగా పలకరించే వారు. వారి సమస్యలను ఓపికగా విని, తనకు చేతనైన సలహా ఇచ్చేవారు.ఎవరితో మాట్లాడినా ఆప్యాయత కనిపించేది. ఎన్ని బాధ్యతలు ఉన్నా తన దగ్గరకు వచ్చినవారిని నిర్లక్ష్యం చేయడం ఆయనకు తెలియదు. అందుకే మల్లారెడ్డి ఒక పార్టీ నాయకుడి గా మాత్రమే కాకుండా, ఎంతోమందికి ఆత్మీయుడిగా మారారు. చివరివరకు ప్రజల కోసమే తపించాడు. జీవిత చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఆయనలోని ప్రజా సేవా తపన ఏమాత్రం తగ్గలేదు. కుటుంబంలో వరుస విషాదాలు ఎదురైనా ఆ బాధను తనలోనే దాచుకున్నారు. తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగారు. తాను బతికినంతకాలం ప్రజలకు సేవ చేయాలనే పట్టుదలను చివరి వరకు వదల్లేదు. మరణించిన తర్వాత తన శరీరాన్ని భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం ఆస్పత్రికి దానం చేయడం ఆయన జీవిత తత్వానికి ప్రతీక. మల్లారెడ్డి అంతిమ యాత్రకు వచ్చిన స్పందన ఆయన జీవితానికి ప్రజలు ఇచ్చిన తీర్పు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, ఎంఎల్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించారు.విభిన్న రాజకీయ భావజాలాలకు చెందినవారు ఒకే వ్యక్తికి నివాళులర్పించడం సాధారణ విషయం కాదు. అది మల్లారెడ్డి సంపాదించుకున్న విశ్వసనీయతకు, ఆయన వ్యక్తిత్వానికి, ప్రజలతో ఏర్పరచుకున్న ఆత్మీయ సంబంధానికి నిదర్శనం.

ఒక గొప్ప సహచరుడిని కోల్పోయిన బాధను మాటల్లో చెప్ప డం కష్టం. ఐదు దశాబ్దాలుగా నేను మల్లారెడ్డితో కలిసి ఉద్యమం లో పనిచేశాను. మొదటి పాతికేళ్లు వరంగల్ జిల్లా ఉద్యమంలో, ఆ తర్వాత రాష్ట్ర కేంద్రంలో కలిసి పనిచేశాం. ఇన్ని దశాబ్దాల ప్రయాణంలో ఎన్నో పోరాటాలు చూశాం, ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. ఆ ప్రయాణంలో మల్లారెడ్డి ఒక సహచరుడిగా మాత్రమే కాదు, నమ్మకమైన మిత్రుడిగా, ఉద్యమ స్ఫూర్తిగా నిలిచారు. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఆయన నడిచిన దారులు ఉన్నాయి. ఆయన చేసిన పోరాటాలు ఉన్నా యి. ఆయన రాసిన పుస్తకాలు, వ్యాసాలు ఉన్నాయి. ఆయన నిర్మించిన పార్టీ, ఆయనతో కలిసి పనిచేసిన కార్యకర్తలు ఉన్నారు. ముఖ్యంగా ప్రజల హృదయాల్లో ఆయనపై ఉన్న అభి మానం ఉంది. మల్లారెడ్డి జీవితం మనందరికి స్ఫూర్తి దాయకం. రైతుల కోసం, పేదల కోసం, ప్రజల కోసం, వామపక్ష ఉద్యమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. ఆయన స్మృతికి కన్నీ టి నివాళి కాదు-ఆయన చూపిన బాటలో ముందుకు సాగడమే నిజమైన నివాళి. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి జోహార్! కామ్రేడ్ మల్లారెడ్డి అమర్ హై!!

**(సెప్టెంబర్ 07, రవీంద్రభారతిలో కామ్రేడ్ సారంపల్లి సంస్మరణ సభ)**

---

# మృత్యుముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

**(11వ పేజీ తరువాయి)**

"పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం మారిపోయింది" అని, "మానవీయ పెట్టుబడిదారీ వ్యవస్థ" అని ఇంతకాలమూ కొనసాగిన ప్రచారపు బూటకం వెల్లడౌతోంది. దాని బరితెగిం చిన స్వభావం, అడ్డగోలు ప్రవర్తన – వాటితోబాటు దాని క్షీణత అన్నీ బైటపడుతున్నాయి. దాని ముందుదారి మూసుకు పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మృత్యుముఖంలో ఉంది.ఎంత దూకుడుగా వ్యవహరించినా, ఎంతగా అణచివేతలకు పూనుకున్నా అవేవీ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడలేవు. ప్రజా స్వామ్యాన్ని అణగదొక్కినా, మళ్లీ వలసాధిపత్యానికి ప్రయత్నించినా చావుకు దగ్గర్లో ఉన్న పెట్టుబడిదారీ విధానాన్ని నయా ఫాసిజం కాపాడజాలదు. అమెరికా-ఇజ్రాయిల్ ఇరాన్ మీద సాగిస్తున్న దాడుల పర్యవసానం ఈ వాస్తవాన్నే స్పష్టం చేస్తోంది. ❑

**(నవతెలంగాణ సౌజన్యంతో)**

# దోపిడీ పై పోరాడ్డానికి గొప్ప ఆయుధం 'విలువ - అదనపు విలువ' పుస్తకం

'విలువ - అదనపు విలువ' పుస్తకం ప్రముఖ మార్క్సిస్టు భావజాల పరిశోధకులు రావు కృష్ణారావు రాశారు. డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ జూన్ 2026లో ప్రచురించిన ఈ 'పుస్తక పరిచయం - చర్చ' కార్యక్రమం నిన్న (సెప్టెంబరు 13 ఆదివారం) సాయంత్రం తణుకులో ఉన్న, అమర్ భవనం కార్యాలయంలో జరిగింది. పట్టణ సీపీఎం కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి, సీపీఐ ప.గో.జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ప్రతాప్, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్, జాతీయ వేదిక అధ్యక్షులు డా.రమేష్ చంద్ర బాబులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ పుస్తకం లోని 'శ్రమ - శ్రమ శక్తి - విలువ - అదనపు విలువ' అంశాలను కార్యక్రమ సమన్వయకర్త, దారి దీపం సంపాదకులు డి.వి.వి.యస్ వర్మ సంక్షిప్తంగా వివరించారు. మార్క్స్ ఆవిష్కర ణలలో కీలకమైన ఈ 'విలువ- అదనపు విలువ' అంశాన్ని రావు కృష్ణారావు 65 పేజీల చిన్న పుస్తకంలో నిత్య జీవిత ఉదాహర ణలతో సరళభాషలో చెప్పారని అన్నారు. రెండు గంటలపాటు ఆసక్తికరంగా సాగిన చర్చలో నిర్వాహక సభ్యులతో పాటు ఇతర ప్రగతిశీలురు పాల్గొని, శ్రమ దోపిడీపై జరుగుతున్న ఉద్యమ కారులకు ఈ పుస్తకం కరదీపికగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ సాహిత్య ప్రచార ట్రస్ట్ వ్యవస్థాపకులు పి.దక్షిణామూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, అంబటి రామకృష్ణ, న్యాయవాది పొట్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిర్శిపో రామకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఐద్వా నాగరత్నం సీనియర్ సిటిజన్ నాయకులు కే.వి.ఆంజనేయులు, ఏ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ❑









**2026 సెప్టెంబర్ 23 - విజయవాడలో ఈ పుస్తకం ఆవిష్కరణ సభ సందర్భంగా కొన్ని ప్రత్యేక వ్యాసాలు**

# ఆహ్వానం

## పుస్తక ఆవిష్కరణ సభ




# Political Philosophy of the Mahabharata

**Prof. K Venkateswarlu**

**2026 సెప్టెంబర్ 23 - బుధవారం ఉ॥ గం 10-30 ని॥**

**హోటల్ మినర్వా గ్రాండ్, opp PVP Mall, మొగల్రాజపురం - MG రోడ్ - విజయవాడ**

స్వాగతం : **శ్రీ కాట్రగడ్డ రజనీకాంత్**

అధ్యక్షులు : **శ్రీ డి వి వి యస్ వర్మ** సంపాదకులు, దారి దీపం

విశిష్ట అతిథి, పుస్తకం ఆవిష్కర్త : **ప్రొ॥ సి.వి. రాఘవులు**
విశ్రాంత వైస్ చాన్స్‌లర్ - నాగార్జున యూనివర్శిటీ

**అతిథులు :**

**శ్రీ టి రవిచంద్,** చరిత్ర, తత్వశాస్త్ర విశ్లేషకులు

**శ్రీమతి యస్ మనోరమ,** విశ్రాంత ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

**ప్రొ॥ టి ఎం కె గాంధీ**
రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ & డిప్యూటీ లైబ్రేరియన్, ఆంధ్ర యూనివర్శిటీ

**శ్రీ జి కోటేశ్వర రావు,** ఎడిటర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**సందేశాలు :**

**శ్రీ మానం ఆంజనేయులు,** సిపిఐ రాష్ట్ర నాయకులు

**శ్రీ వై వెంకటేశ్వర రావు,** సిపియం రాష్ట్ర నాయకులు

**శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు,** రాజ్యాంగ పరిరక్షణ వేదిక

వందన సమర్పణ : **నాదెండ్ల లక్ష్మి**

**Lunch follows...**

## అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం

ఇట్లు

**కాట్రగడ్డ రజనీకాంత్ - కాట్రగడ్డ శ్రీనివాస్ - నాదెండ్ల లక్ష్మి**

# మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి?

- ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు



**ఈ** ప్రసంగ వ్యాసంలో (సాహిత్య సురభి, విశాఖపట్నం, 21-4-2015) రెండు అంశాలున్నాయి. **మొదటిది రంగనాయకమ్మ గారి మహాభారత పరామర్శ.** రెండవది మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలనే అంశాన్ని గురించిన కొన్ని ప్రాథమిక అభిప్రాయాలు.

రంగనాయకమ్మ గారు 'ఇదండీ మహాభారతం!' అనే గ్రంథాన్ని రాసి, 2014 డిసెంబరులో ప్రచురించారు. ఆమె సుప్రసిద్ధ రచయిత్రి. తెలుగుజాతి గర్వించదగిన సాహితీవేత్త. తెలుగు సాహిత్య రంగంలో ఆమె కృషి, రచనలు అనితరసాధ్యం. తెలుగు వచన శైలిలో అగ్రగామి. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఆవిడ ముద్ర, ప్రభావం సుస్థిరం. గ్రంథ ప్రచురణ రంగంలో ఆమె మార్గదర్శి. చాలా మంచి పుస్తకాలను చక్కగా ముద్రించి పాఠకులకు అందిస్తున్నారు. ప్రముఖ మార్క్సిస్టు తత్వవాది. ఇదంతా గాక రంగనాయకమ్మ గారు తాను నమ్మిన ఆశయాలకు, సిద్ధాంతాలకు అంకితమై ఆదర్శ జీవనయాత్రను సాగిస్తున్న త్యాగమయి. అందుచేత ఆమె రాసిన మహాభారతాన్ని చదవాలన్న ఉత్సుకతతో కొనాలని ప్రయత్నించాను. ఒక పట్టాన దొరకలేదు. ఒక మిత్రుడిని ఆశ్రయించి గ్రంథాన్ని సంపాదించాను. అప్పటికే విస్తృత ఆదరణ పొందిన గ్రంథమిది. శ్రద్ధగా చదివాను. తీవ్రమైన మనోవేదన కలిగింది. మహాభారతంలో గల ప్రతి వృత్తాంతాన్ని గురించి వెటకారం, వెక్కిరింతలు, పేలవమైన వ్యాఖ్యానాలు ఆమె గ్రంథంలో ప్రతి పుటలోనూ ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. ఒక్కమాటలో 'అది వ్యర్థ మహాభారతం' అని ఖరాఖండీగా చెప్పి ముగించారు. ఆమెకున్న పేరు ప్రతిష్ఠల వలన మహాభారతాన్ని గురించి దురభిప్రాయాలు ప్రజానీకంలో నాటుకుపోతాయన్న శంక, భయంతో కొన్ని అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నాను.

మహాభారతం ప్రశస్తమైన ప్రాచీన గ్రంథం. భారతాన్ని పంచమ వేదమని, ఇతిహాసమని, నీతి శాస్త్రమని, అర్థ శాస్త్రమని, ధర్మ శాస్త్రమని, మోక్ష శాస్త్రమని పేర్కొనడం కద్దు. వ్యాసుని కథనం(మౌఖికం గానీ, లిఖితం గానీ) మహాభారతానికి మూల/బీజ రూపం. దాదాపుగా వెయ్యి సంవత్సరాల కాలంలో మహాభారతం బృహత్తర గ్రంథంగా కూర్పు చేయబడిందని పండితుల స్థూలాభిప్రాయం. క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 4వ శతాబ్దం వరకు - రచనా ప్రక్రియ కనుగుణంగా - వ్యాసకథా వృత్తాంతానికి విద్వాంసులు సవరణలూ,




వివరణలూ సమకూరుస్తూ వచ్చారు. భృగువంశ విద్వాంసులు ఈ ప్రక్రియలో కీలకపాత్ర నిర్వహించారు. రెండు వేల సంవత్సరాల ప్రాచీన భారతీయ సంస్కృతిని, సాంఘిక, మత, ఆర్థిక, రాజకీయ, తత్వ, వైజ్ఞానిక చరిత్ర పరిణామాన్ని నిక్షిప్తం చేసుకున్న గ్రంథమిది.

ఇంతటి విశాల దేశ కాల చారిత్రక పరిణామ నేపథ్యంలో విల సిల్లిన వివిధ ప్రాంతాల జాతుల జీవన సంస్కృతులను మేళవించిన మహోజ్జ్వల గ్రంథం మహాభారతం. ఏకైక భారతీయ/జాతీయ నాగరికత అనే ఐక్యతా భావనను సుస్థిరం, సుసంపన్నం, సంక్షిప్తం చేసిన గ్రంథరాజం మహాభారతం. ఇదొక క్లిష్టమైన అద్వితీయ రచన/కూర్పు ప్రక్రియ. అందుకనే యజ్ఞాలు, యాగాలు, మంత్రతంత్రాలు, తపశ్శక్తి మహిమలు, వరాలు - శాపాలు, దూర(దివ్య)దృష్టి, అశరీరవాణులు, వందల వేల సంవత్సరాల వంశచరిత్రలు, ప్రతిజ్ఞలు, ప్రకటనలు, పునశ్చరణలు, అసత్యాలు, అబద్ధాలు, వికృతమైన ఆచారాలు, చేష్టలు, వైరుధ్యభావాల సమాచారం మహాభారతంలో

కోకొల్లలుగా కనిపిస్తాయి. ఇవి కొన్ని సమాజ పరిణామ చరిత్రకు సాక్ష్యాధారాలు. మరికొన్ని భారతీ యతా భావసాధనకు సోపానాలు. ప్రాచీన మానవుని భయం, ఊహాశక్తి, అనుభవం, ఆలోచనా రీతులు, మానవ సంబంధాలకు ప్రకృతితో ఉన్న సంబంధానికి దృష్టాంతాలు వేరే కొన్ని. గ్రీస్, ఈజిప్టు, అస్సీరియా, పర్షియా, చైనా, జపాన్ తదితర ప్రాచీన సమాజాల సాహిత్యంలో ఇలాంటి భావజాలం కనిపిస్తుంది. అయితే మహాభారతంలో ఇలాంటి భావజాలం మోతాదు ఎక్కువ. మన విశాల దేశకాల నేపథ్యమే దీనికి భూమిక.

దిగ్గజాల్లాంటి దేశీయ, విదేశీయ పండితులు మహాభారత అధ్యయనాన్ని జీవితకాలపు వ్యాసంగంగా నెత్తికెత్తుకొని మౌలిక పరిశోధనలు చేశారు. అలాంటి వారిలో ముఖ్యుల గురించి ప్రస్తావించుకుందాం. పదకొండవ శతాబ్దంలో కశ్మీరంలో జన్మించి, "జ్ఞానదీపిక" అనే వ్యాఖ్యాన గ్రంథం రాసిన దేవబోధ. 15వ శతాబ్దంలో వంగదేశంలో జన్మించిన విద్యాసాగర 17వ శతాబ్దంలో వారణాసిలో జన్మించిన నీలకంఠ చతుర్ధర పండితుడు, ఇరవయ్యో శతాబ్దంలో పూణెలో జన్మించి ఎన్నో గ్రంథాలను రచించిన విష్ణు సీతారాం సుక్తాంకర్ ఈ కోవకు చెందిన దిగ్గజాల్లో కొందరు మాత్రమే.

(అ). 1933లో భండార్కర్ ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురణగా వెలువడిన "మహాభారతం ఆదిపర్వం గురించిన ప్రాథమిక వ్యాఖ్యలు" (Prolegomena to the Critical Edition of the Adiparvan)

(ఆ)1957లో వెలువరించిన "మహాభారతం-అర్థం, భావం" (On the Meaning of the Mahabharata) సుక్తాంకర్ రచనల్లో ప్రసిద్ధమైనవి.)

మరెందరో విదేశీ దిగ్గజాలు కూడా మహాభారత అధ్యయనాన్ని జీవితకాలపు వ్యాసంగంగా ఎంచుకొని, మౌలిక పరిశోధనలు చేసిన వారున్నారు. వారిలో ముఖ్యుల్లో 19, 20 శతాబ్దాల్లో జీవించి కృషి చేసిన అమెరికన్ పండితుడు ఇ.డబ్ల్యు. హాప్కిన్స్. ఆయన 1901లోనే రాసిన "భారతీయ మహేతిహాసం - దాని స్వభావం, మూలం" (The Great Epic of India: Its Character and Origin,

న్యూయార్క్, 1901) సుప్రసిద్ధం. మహాభారతంపై ఆయన రాసిన ప్రధాన రచనలు కూడా ప్రచురమైనవే. సొరెన్సెన్, ఫ్రాంక్లిన్ ఎడ్గర్టన్, జె.ఎ.బి. వాన్ బ్యూటెనెన్ తదితర జర్మన్, రష్యన్, అమెరికన్ పండితులు మహాభారతాధ్యయనాన్ని జీవితకాలపు వ్యాసంగంగా నెత్తికెత్తుకొని మౌలిక పరిశోధనలు చేశారు. రంగనాయకమ్మ మాత్రం వ్యాస మహా భారతానికి కె.ఎం. గంగూలీ చేసిన ఇంగ్లీషు వచనానువాదం The Mahabharata of Krishna-Dwaipayana Vyasa, కవిత్రయం రాసిన 'శ్రీమదాంధ్ర మహా భారతము', పురిపండా అప్పలస్వామి గారి 'వ్యవహారికాంధ్ర మహాభారతం' గ్రంథాలను మూడున్నర మాసాలలో చదివి తన 'ఇదండీ మహాభారతం!' అనే గ్రంథాన్ని రాశారు.

రంగనాయకమ్మ మహాభారతాన్ని తీవ్రంగా ద్వేషిస్తున్నట్లు కనబడుతుంది. ద్వేషభావం మనల్ని ఆవహించినప్పుడు యథార్థాన్ని చూడలేము, గ్రహించలేము. మహాభారతం విషయంలో ఆమె ఇలాంటి దురవస్థకు లోనయినట్లుగా తోస్తున్నది. ఆదిపర్వంలోని శకుంతల ఉదంతాన్ని (ఆఖ్యానం) పరిశీలిద్దాం. (గీతా ప్రెస్ ప్రతి: గోరఖ్‌పూర్; వ్యాస మహా భారతం - తెలుగు వచనం - 2010. డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, డాక్టర్ సూరం శ్రీనివాసులు, విజయవాడ: శ్రీలలితా త్రిపురసుందరీ ధార్మిక పరిషత్ ప్రచురణ).

శకుంతల విశ్వామిత్ర-మేనకల పుత్రిక. ఆమె కణ్వాశ్రమ నివాసి. యుక్తవయస్కురాలు. హస్తినాపుర రాజు దుష్యంతుడు వేటకు వెళ్ళి కణ్వాశ్రమంలో ప్రవేశించి శకుంతల ద్వారా ఆమె జన్మవృత్తాంతాన్ని తెలుసుకున్నాడు.

దుష్యంతుడు శకుంతలతో "నా మనస్సు నీపై లగ్నమయింది. నీవు క్షత్రియ కన్యవు. క్షత్రియులకు పరస్పరాంగీకారంతో జరిగే మంత్రరహితమైన గాంధర్వ వివాహం ధర్మబద్ధం. నిన్ను గాంధర్వ వివాహం చేసుకొని రాణిని చేస్తాను" అని చెప్పాడు.

శకుంతల "నా తండ్రి కణ్వమహర్షి పండ్ల కోసం అడవికి వెళ్ళాడు. ముహూర్తకాలం వేచి ఉండండి, తండ్రి అనుమతి కోరతాను" అని చెప్పింది.

దానికి జవాబుగా "నీవు నన్ను స్వేచ్ఛగా ప్రేమించాలని కోరుతున్నాను. ప్రతి వ్యక్తి తనకు తానే బంధువు, దిక్కు, మిత్రుడు, తండ్రి. ధర్మం ప్రకారం నిన్ను నీవే దానం చేసుకోవచ్చు" అని దుష్యంతుడు చెప్పాడు.

శకుంతల ఇలా పలికింది. "నన్ను నేను దానం చేసుకొనుట మన గాంధర్వ వివాహం ప్రకారం ధర్మమార్గమే అయితే నా మాట విను. నా పుత్రుడే నీ తదుపరి రాజు కావాలి. ఇది నీకు సమ్మతమైతే మన వివాహం జరుగుతుంది" అన్నది. (ఇక్కడ రంగనాయకమ్మ శకుంతలను 'గడుసుపిల్లే' అన్నది.) రాజు సమ్మతించాడు.

తత్ఫలితంగా శకుంతలా దుష్యంతుల వివాహం జరిగింది. "త్వరలో నిన్ను రాజధానికి తీసుకెళ్ళే ఏర్పాటు చేస్తాను" అని శకుంతలతో చెప్పి దుష్యంతుడు తన రాజ్యానికి వెళ్ళాడు. దుష్యంతుని పిలుపు రాలేదు. పిదప శకుంతల మగబిడ్డను కన్నది. బాలుడు ఆరు సంవత్సరాలు ఆశ్రమంలో పెరిగాడు. కణ్వమహర్షి సూచన మేరకు శకుంతలను, ఆమె కుమారుడినీ హస్తినాపురంలోని దుష్యంతుని సభలో ప్రవేశపెట్టి మునులు

ఆశ్రమానికి వెళ్ళారు.

రాజసభలో శకుంతల ఇలా చెప్పింది. "రాజా, నీ ద్వారా ఈ బాలుడు నాకు జన్మించాడు. నీ కుమారుడీ బాలుడు. కణ్వాశ్రమంలో మనం కలిసినప్పుడు నీవిచ్చిన మాట ప్రకారం ఈ బాలుడిని యువ రాజ్యాభిషిక్తుడిని చేయి."

"మహాపాపీ, నీవెవరో నాకు తెలియదు. నీవు వెళ్ళవచ్చు" అన్నాడు దుష్యంతుడు శకుంతలతో.

శకుంతల కోపంతో "దుష్యంతా! నీ అంతరాత్మే నీకు సాక్షి. తెలిసి కూడా ఇతరులకు తెలియదని చెప్పేవాడు, తనను తాను దొంగిలించుకొనేవాడు ఎట్టి పాపాన్నైనా చేస్తాడు. భార్య భర్తలో సగభాగం. ధర్మార్థకామ సాధనకూ, సంతాన ప్రాప్తికీ భార్య మూలం. నేను ప్రార్థిస్తున్నప్పటికీ నీవు నా మాటను లక్ష్య పెట్టకపోతే నీ శిరస్సు వంద ముక్కలుగా బద్దలవుతుంది."

ఆమె మాటలు విని "నీ తల్లి మేనక వేశ్య, కులట. నీ జన్మ నీచమైనది. నీవు కులట వలె అబద్ధాలు చెప్తున్నావు. నీకు జన్మించిన బాలుడు నా కుమారుడు కాడు" అని దుష్యంతుడు శకుంతలతో చెప్పాడు.

శకుంతల రోషంతో "రాజా! నీ జన్మకంటే నా జన్మే గొప్పది. నా తల్లి దేవ లోకంలో ఉంది. నీవు మానవ లోకంలో ఉన్నావు. నేను దేవలోకానికి వెళ్ళగలను. పుత్రుడిని ఆదరించని వాడిని దేవతలు నశింపజేస్తారు. సత్యం అన్నిటికంటే గొప్ప వ్రతం. నీవు సత్యాన్ని వీడవద్దు. అసత్యం మీదే నీకు ఆసక్తి ఉంటే, నా మాట పట్ల విశ్వాసం లేకపోతే నేనే స్వయంగా వెళ్ళిపోతాను. నీలాంటి వాడితో కలిసి ఉండడం నాకు యుక్తం కాదు. దుష్యంతా! నీవు లేకున్నా నా పుత్రుడు నాలుగు సముద్రాల వరకు వ్యాపించి హిమవత్పర్వతాన్ని మకుటంలా భాసించే భూమండలాన్ని పరిపాలిస్తాడు" అని పలికి, కుమారునితో కలిసి శకుంతల సభ నుంచి నిష్క్రమిస్తుంది.

(ఇక్కడ రంగనాయకమ్మ 'శకుంతల కళ్ళ నీళ్ళతో మళ్ళీ చెప్పుకుంది. పుట్టినప్పుడే నన్ను తల్లిదండ్రులు పారేసిపోయారు. వివాహమాడిన భర్త తిరస్కరించాడు అని కొడుకు చేతిని పట్టుకొని వెనక్కి తిరిగింది' అని రాశారు.)

శకుంతల మహాభారత కథలో మహిళా స్వావలంబనకు, సాధికారతకు, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి సాక్షాత్కారం. సందర్భం చూడండి. పుట్టుకతో తల్లిప్రేమకు నోచుకోలేదు, పుట్టింటి అండ లేదు, సభలో గానీ హస్తినాపురంలో గానీ తనను ఆదరించేవారు లేరు. తాను భర్తచేత తిరస్కరింపబడింది. తన ఆరేళ్ళ కుమారుడు తండ్రి చేత తిరస్కరింపబడ్డాడు. తానొక ఏకాకి. అన్యాయానికి గురైన శకుంతల, దుష్యంతుడి సభలో తన ధర్మాగ్రహాన్ని వెల్లడించిన తీరుతెన్నులనూ, మాటలనూ గమనించాం కదా! అంతటి ధీశాలి శకుంతల!! మన సాహిత్యంలో గానీ, విశ్వ సాహిత్యంలో గానీ శకుంతల వంటి ధీర వ్యక్తిత్వం, వజ్ర సంకల్పబలం గల స్త్రీ మూర్తిని నేను ఉదహరించలేను.

**స్త్రీవాద రచయిత్రి రంగనాయకమ్మ శకుంతల కథను ఎలా ముగించారో చూశాం కదా! ఆమె శకుంతల మహోన్నత వ్యక్తిత్వాన్ని గమనించలేదు, గ్రహించలేరు! ఆమె మన దేశ చరిత్ర, సంస్కృతిలో శకుంతల కథకు గల ప్రాముఖ్యాన్ని గ్రహించలేరు. ఎందుకని? ద్వేషభావ ప్రభావం! అప్రస్తుతమైనా ఒక్కమాట - మహాభారతంలోని శకుంతలను కాళిదాసు నాటకంలోని శకుంతలతో పోల్చి చదివితే, మన చరిత్ర సంస్కృతుల సిసలైన స్వరూప స్వభావాలను ప్రతిబింబించే అద్దం మహాభారతమని మనకు తెలుస్తుంది. ప్రాచీన భారతదేశ చరిత్ర అధ్యయనాన్ని కొత్తపుంతలు తొక్కించిన విశ్వ విఖ్యాత పరిశోధకురాలు రొమిలా థాపర్. ఆమె శకుంతల ఆఖ్యానాన్ని, రాజవంశాల చరిత్రను రాయడానికి, సమాజ పరిణామ గతిని, పితృస్వామ్య వ్యవస్థ మూలాలనూ వివరించడానికి ఉదహరించి వ్యాఖ్యానించారు**

(Sakuntala: Texts, Readings, Histories, 2000). శకుంతల వ్యక్తిత్వానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయానికి గల అవినాభావ సంబంధాన్ని ఆమె గ్రహించలేదనిపిస్తుంది.

రంగనాయకమ్మ మహాభారతంలోని ప్రతి అంశాన్ని గురించి తన వెటకార ధోరణినీ, నిరసననూ అడుగడుగునా వ్యక్తపరిచారు. కట్టుకథలకూ, శాపాలకూ, అతిశయోక్తులకూ ప్రాధాన్య తనిచ్చి, నిందాపూరితమైన వ్యాఖ్యలు చేయడమే గాక భారతీయ సంస్కృతికి మూలాలు, మౌలిక ఆశయాలు, లక్ష్యాల గురించి జరిగిన విస్తృతమైన, వివేకంతో కూడిన వాదోపవాదాల, చర్చల వివరణలను ఆమె విస్మరించారు.

ఒక్క ఉదాహరణ. వనపర్వంలోని నహుష, ధర్మరాజుల ప్రశ్నోత్తరాల గాథను చూడండి. నహుషుడు పురాతన కురువంశ చక్రవర్తి. తపస్సు, వేదాధ్యయనం, ధర్మనిష్ఠల వలన ఇంద్ర లోకాధిపతియై గర్వంచేత భ్రష్టుడై, శాపగ్రస్తుడై సర్పంగా మారి భూలోకంలో పడ్డాడు. భీముడు ఆ భయంకర సర్పము చేత బంధింపబడతాడు. ధర్మరాజు భీముడిని వదిలిపెట్టమని ఆ సర్పాన్ని కోరాడు. సర్పం తను అడిగిన ప్రశ్నలకు సమాధానం

చెప్తే భీముడిని విడిచిపెడతానన్నది. ధర్మరాజు చెప్పిన సమాధానాల సారాంశమిది. "సత్యం, క్షమ, దానం, అహింస అనే సద్గుణాలు కలిగినవాడే బ్రాహ్మణుడు. ఈ సద్గుణాలు గల శూద్రుడినైనా, మరెవరినైనా బ్రాహ్మణుడనే అనాలి. వర్ణసంకరం జరుగుతున్నది. మానవులలో వర్ణవిభజన నిర్ణయం క్లిష్టమైన ప్రక్రియ. శిష్టులు, విద్యావంతులు మనిషి గుణగణాలకే ప్రాధాన్యతనిస్తారు. వేదాధ్యయనం చేసినా, శీలం లేనివాడు బ్రాహ్మణుడు కాదు" అని ధర్మరాజు చెప్పిన సమాధానాలు సర్పానికి నచ్చి భీముడిని విడిచిపెట్టింది.

> **ధర్మరాజు సర్పాన్ని కొన్ని ప్రశ్నలడిగాడు. సర్పం చెప్పిన జవాబుల సారాంశమిది. "దానం, సత్యం, అహింస, ప్రియమైన వాక్కు మానవుని ఉత్తమ గతికి మార్గాలు. ఏది సత్యమో, ఏది దానమో, ఏది అహింసో అవి నిర్వహించే కార్యాన్ని అనుసరిం చి, వాటి ప్రాధాన్యత, గొప్పతనాల బట్టి నిర్ణయించబడుతుంది. ఒకప్పుడు సత్యం దాన, అహింసల కన్నా గొప్పదవుతుంది. ఇంకొకప్పుడు దానం సత్య, అహింసల కన్నా గొప్పదవుతుంది. మరొకప్పుడు అహింస దాన, సత్యాల కన్నా మిన్న అవుతుంది. ఇది కార్యకాలాల మహిమ. సత్కర్మల చేత మాన వుడు స్వర్గప్రాప్తి పొందుతాడు." సర్పం చెప్పిన సమాధానాలతో ధర్మరాజు విజ్ఞానవంతుడయ్యాడు. ఇంతటితో వారి సంభాషణ ముగిసింది. నహుషుడు శాపవిముక్తుడై స్వర్గానికి ఎగిరిపో యాడు. ధర్మరాజు భీమునితో ఆశ్రమానికి చేరుకున్నాడు.**

ఈ గాథకు రంగనాయకమ్మ ముగింపిది. 'ఎంత రోతకథలు వింటూ బతుకుతోంది మానవ సమాజం'. విజ్ఞత, వివేకపూరితమైన నహుష, ధర్మరాజుల సంభాషణ ప్రాధాన్యతను ఆమె పట్టించుకోలేదు, గ్రహించలేదు. సర్ప-మానవుల సంభాషణ 'రోతకథ'గా తోచిందామెకు. ఆ ఒక్క విషయానికే ప్రాధాన్యమిచ్చి 'రోతకథ' అన్నారామె. ఈ పద్ధతి ప్రకారమే ఆమె మహాభారతం అధ్య యనం చేసి 'ఇదండీ మహాభారతం' అనే గ్రంథాన్ని రాశారు. న్యాయనిర్ణయం పాఠకలోకానికి, ఆమె విజ్ఞతకే వదిలేద్దాం!

రంగనాయకమ్మ నిబద్ధత గల మార్క్సిస్టు తత్వవాది. సమాజ పరిణామక్రమ చరిత్రలో శైశవ దశలో గ్రీక్ పురాణ సాహిత్యం రాయబడిందని మార్క్స్ అభిప్రాయపడ్డాడు. ప్రాచీన మానవుని గ్రహణశక్తి, బుద్ధి, భయాందోళనలు, ఊహాశక్తి, ప్రకృతిశక్తులు, దేవతలు, మానవ సంబంధాలలో గల భావోద్వేగాలు పురాణ గాథలకూ, అభూతకల్పనలకూ ప్రాతిపదికలని మార్క్స్ భావించాడు. పురాణ సాహిత్యం (మైథాలజీ) శాశ్వత మనోహర మానసికానందానుభూతిని (Eternal Charm) మానవాళికం దించే వనరు అని మార్క్స్ పేర్కొన్నాడు. పురాణ సాహిత్యాధ్యయనానికి ఇదొక ప్రాతిపదిక. భారతదేశ చరిత్రను తిరగరాసిన ప్రముఖ మార్క్సిస్టు మేధావి డి.డి. కోశాంబి ప్రాచీన భారతీయ సంస్కృతినీ, సాహిత్యాన్నీ మార్క్సిస్టు దృక్పథంతో చదివి అర్థం చేసుకొని అన్వయించడానికి ఒక ప్రామాణికమైన పద్ధతిని (Methodology) రూపొందించాడు (The Subhasitaratna kosa, Harvard Oriental Series, Vol. 42, 1957).

ప్రముఖ మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు కె.వి. రమణారెడ్డి గారు మార్క్సిస్టు దృక్పథంతో ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రను రాశారు. (చలసాని ప్రసాద్ గారి 'ముందుమాట', కావలి, విరసం-1992). రంగనాయకమ్మ ప్రాచీన గ్రంథమైన మహాభారతాన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శనా దృష్టితో అధ్యయనం చేయలేదు. చివరి మాట 'ఇదండీ మహాభారతం!' రంగనాయకమ్మ స్థాయికి తగిన రచన కాదు.

నా వ్యాసంలో రెండవ అంశం : **మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి?** యథార్థంగా ఇదే ప్రధాన అంశం. అది అంతం లేని అంశం. నాకు తలకుమించిన పని. నా ప్రయత్నం దుస్సాహసమని నాకు తెలుసు. చిరు ప్రయత్నం నాది. మహాభారతాధ్యయనంలో రెండు సూత్రాలను అనుసరించాలి.

**మొదటిది:** భారతీయత - భారతదేశ నాగరికత, దేశచరిత్ర, సంస్కృతి - వీటి రూపురేఖలను, లక్షణాలను, ఆశయాలను ఆవిష్కరించడమే గ్రంథ (మహాభారతం) లక్ష్యం. మన అధ్యయనానికి ఇదే పరమార్థం.

**రెండవది:** మహాభారతంలోని కథలు, గాథలు, పురాతన వృత్తాంతాలు, ఆఖ్యానాలు, దివ్యాస్త్రాలు మొదలగు అభూతకల్పనలు గ్రంథ లక్ష్యాలకు పరిపోషకాలు. వాటి పరిధి, ముఖ్యోద్దేశం, ప్రయోజనమిదే. పూర్వ శాస్త్రకారులు వీటికి ఆపాదించిన పవిత్రతను, సత్యార్థాలను ఆధునిక కాలంలో ఆమోదించనవసరం లేదు. కాకపోతే మార్క్స్ చెప్పినట్లుగా వీటిని మనోహరమైన మానసికానుభూతిని ఇచ్చే సాహిత్యంగా చదివి ఆనందించవచ్చును.

ఉదాహరణకు జలప్రళయ వృత్తాంతం తీసుకోండి. జల ప్రళయ వర్ణన మనం జలప్రళయాన్ని స్వయంగా చూసినంత, దానిలో చిక్కుకున్నంత భయాందోళనానుభూతికి లోనయ్యేంత చిక్కటి చక్కని రచన. అలాంటి సాహిత్య సంపదకు మహాభార

తం పుట్టిల్లు. సంస్కృత, దేశ భాషలలో గల కావ్యసాహిత్యానికి మహాభారతం మాతృక.

వేద విజ్ఞానం మహాభారతానికి మూలమని నీలకంఠ పండి తుని అభిప్రాయం. వేద విజ్ఞానాన్ని ఉపాసించిన పండితులు, ఋషులు మహాభారత రచన/కూర్పు చేశారు. వేదమంత్రాలు, వేదాధ్యయనం సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. మహర్షులు మహాభారతంలోని కథలను, గాథలను, ఆఖ్యానాలను, ప్రాచీన వృత్తాంతాలను ప్రజానీకానికి స్థూలంగా వేద విజ్ఞానాన్ని సులువుగా బోధించడానికి రాశారు/కూర్పు చేశారు. మహాభారతాన్ని పంచమ వేదమనడానికి ఇదే నేపథ్యం. మహాభారతం వేల సంవత్సరాల నుంచి భారతదేశంలోని బహుళ భాషా సంస్కృతులకు నెలవులైన వివిధ ప్రాంతాలలో అనేక కళారూపాలలో (కథాగానం, పురాణ పఠనం, నాటకం) వేద విజ్ఞానాన్ని ప్రజలకు అందిస్తున్నది. ఏ గ్రంథమూ ఇంతటి విస్తృత ప్రజాదరణకు నోచుకోలేదు. మహాభారత ప్రశస్తత ఇది.

**వేద పరిభాషలో సనాతన ధర్మమే మహాభారతం ప్రజలకు అందిస్తున్న వేద విజ్ఞానం. అయితే శాశ్వత ధర్మం, సనాతన ధర్మం కాలాతీత ధర్మం కాదు. ధర్మం/ధర్మాలు దేశకాల ప్రభావా నికి లోబడి మార్పు చెందుతుంటాయి. సనాతన/శాశ్వత ధర్మ మంటే సకల జనులూ పాటించవలసిన ధర్మనియమాలు. అవి: అహింస, సత్యం, అస్తేయం, శౌచం, దానం, దమం, దయ, ఓర్పు, ఇంద్రియ నిగ్రహం, ఆత్మనిగ్రహం. వీటన్నిటి లక్ష్యం సర్వభూతహితం. సకల జీవుల క్షేమాన్ని ప్రోదిచేసేది. అందరినీ ఆదరించేదే సనాతన ధర్మమని తులాధారుడనే వైశ్యుడు జాజలి అనే బ్రాహ్మణునకు కాశీలో బోధించాడు (శాంతిపర్వం).**

మిథిలలో ధర్మవ్యాధుడు (మాంసము అమ్మి జీవనం సాగించిన వ్యక్తి) కౌశికుడనే బ్రాహ్మణునకు ఏ జీవి పట్లా ద్రోహభావం లేకుండుట, త్రికరణశుద్ధిగా సకల జీవుల శుభాన్ని కోరుట, దానం చేయటమే సనాతన ధర్మమని చెప్పాడు (వనపర్వం).

సనాతన ధర్మాన్ని భారతదేశంలో గల వివిధ ప్రాంతాల స్థానిక ఆచార వ్యవహారాలు, నియమాలతోనూ, బహుళ జాతుల సాంప్రదాయక జీవిత శైలి, రీతి, వృత్తి నిబంధనలతోనూ అనుసంధానం చేసి 'భారతీయత' అనే మహత్తర ఐక్యతా భావనను దేశ ప్రజల ఆలోచనా స్మృతిపథంలో మహాభారతం సుస్థిరం చేసింది.

కవులు, గాయకులు, కళాకారులు దేశంలోని మారుమూల ప్రాంతాలలో కూడా మహాభారత ధర్మ, నీతి కథలను, ఉపదేశాలను ప్రజలకందించారు. తత్ఫలితంగా మనం భారతీయులం, విశిష్టమైన సంస్కృతికి వారసులమన్న భావం ప్రజల అంతరంగంలో వ్యక్తావ్యక్తంగా రూపొందింది.

ఇదొక బృహత్తర దీర్ఘకాలిక రచనా ప్రక్రియ. అందుకనే కనీవినీ ఎరుగని వైరుధ్యాలు, వికృతాలు, అసందర్భమైన ఘటనలు, భావాలు మహాభారతంలో పుష్కలంగా కలవు. మానవుని అంతరంగ అగాధం అనంతమైన వైరుధ్య భావాలకు నిలయం. దీనికి తోడు మానవుని చిత్తప్రవృత్తి, నడత దేశకాల ప్రభావానికి వశం. సనాతన ధర్మం నిర్దేశించిన నియమాల సిద్ధాంత ప్రాతిపదికలో గల లోపాలు, ఆచరణలో తటస్థించే చిక్కులు దుస్సాధ్యమైనవి. ఇందుచేత ధర్మం, నీతి, న్యాయం, సత్యం, విధి–మానవయత్నం, హింస–అహింస, ధర్మం–అర్థం, గృహస్థాశ్రమం–సన్యాసాశ్రమం, రాజధర్మం–క్షాత్రధర్మం తదితర మౌలిక భావాలను, ఆదర్శాలను గురించి మహాభారతం విపులమైన, వివేకవంతమైన చర్చలకు, వాదోపవాదాలకు వేదిక. మానవ జీవితపు ఇహపర లక్ష్యాలు, వాటి సాధనలో గల జటిల మైన సందర్భోచిత సమస్యల గురించి మహాభారతంలో గల మౌలిక పరిశీలన, అవగాహన మరెక్కడా దొరకదు. మానవులు వాస్తవ దృష్టితో ఔచిత్యమైన ధర్మార్థకామ సాధనతో జీవితాన్ని పరిపుష్టం చేసుకోవాలి. సనాతన ధర్మం, ధర్మార్థకామ సాధన మానవ జీవిత వైవిధ్యానికి, వైదగ్ధ్యానికి, ప్రేమానురాగాలకు, ఆనందానుభూతికి, ప్రకృతి పరిరక్షణకు మార్గములు. మహాభార త కథ ప్రజలకందించే సందేశమిది. భారతీయ సంస్కృతికిది మూలకందం. నేడు మానవాళికి ఇది ఎంతో ఉపయుక్తమైన సందేశం.

భారతవర్ష సమగ్ర ఐక్యతా రూపాన్ని మహాభారతం మనకందించింది. భారతీయతా భావనకిదొక దృష్టాంతం. రాజ సూయ యాగానికి పూర్వరంగంగా భరతఖండపు నాలుగు దిక్కు లను జయించమని ధర్మరాజు తన తమ్ములను ఆదేశించాడు. భీముడు తూర్పు దిక్కున గల విదేహ, మగధ, అంగ, వంగ, తామ్రలిప్తి రాజ్యాలను; అర్జునుడు ఉత్తర దిక్కున గల అనర్త, కశ్మీరం, బాహ్లిక తదితర రాజ్యాలను; నకులుడు పశ్చిమ దిక్కున గల మరుభూమి, మాళ్వ, పంచనద, పహలవుల వరకున్న రాజ్యాలను; సహదేవుడు దక్షిణ దిక్కున గల త్రిపుర, పాటన, పాండ్య, ద్రవిడ, చోళ, కేరళ, ఆంధ్ర రాజులను/ రాజ్యాలను జయించారు. భరతఖండపు నాలుగు దిక్కులలో గల రాజ్యాధిప తులైన రాజుల సమక్షంలో వారి సమ్మతితో ధర్మరాజు భరతవర్ష చక్రవర్తిగా ప్రతిష్ఠింపబడ్డాడు.

కర్ణుడు దిగ్విజయ యాత్రను చేపట్టి భరతఖండంలో గల రాజులనందరినీ జయించి కురు సామ్రాజ్యాన్ని పదిలం చేశాడు.

రాజుల భూదాహానికి, రాజ్యాధికార తపనకు కారణమైన భారత భూమండల స్వరూపాన్ని (పర్వతాలు, నదులు, రాజ్యాలు) కురుక్షేత్ర యుద్ధ ప్రారంభానికి ముందుగా సంజయుడు ధృతరాష్ట్ర మహారాజుకు వర్ణించి చెప్పాడు. కురుక్షేత్ర యుద్ధంలో భారత వర్షంలో గల రాజులందరూ పాల్గొన్నారు. కురుక్షేత్ర యుద్ధం తదుపరి రాజ్యాధికారం చేపట్టిన ధర్మరాజు అశ్వమేధయాగం చేశాడు. తత్కారణంగా పాండవులు భారతవర్షంలో గల రాజులనందరినీ జయించారు. క్లుప్తంగా మహాభారతం మనకందిస్తున్న సమగ్ర ఐక్య భారతవర్ష రూపమిది.

మహాభారతం వేల సంవత్సరాల ప్రాచీన భారతవర్ష చరిత్రను, నాగరికతను పదిలపరిచిన ప్రాచీన గ్రంథం. చరిత్రగతిని పురాణ సాహిత్య రూపంలో కథలుగా, గాథలుగా, ఆఖ్యానాలుగా, ప్రాచీన వృత్తాంతాలుగా మహాభారతం నిక్షిప్తం చేసింది. అందుకే మహాభారతాన్ని ఇతిహాసం ("ఇతి-హ-ఆస" = ఇలా జరిగింది) అని పేర్కొన్నారు. ప్రాథమిక ప్రాధాన్యత గల చారిత్రక సమాచారం మహాభారతంలో పుష్కలంగా ఉన్నది. విశిష్టమైన చారిత్రక స్పృహ/అవగాహన మహాభారత కథాగమనం, రచనలో మనకు గోచరిస్తుంది. సృష్టి ప్రారంభం నుంచి మన సమాజ పరిణామక్రమం, పురోగతి, మార్పు, వ్యాప్తి మహాభారతంలో కనిపిస్తుంది. మహాభారత పురాణ కథలలో నిబిడీకృతమైన చరిత్ర ఇది. విశ్వవిఖ్యాతి గల చరిత్ర పరిశోధకురాలు రొమిలా థాపర్ ఇట్టి చారిత్రక జ్ఞానాన్ని, సమాచారాన్ని ఇతిహాస-పురాణ చరిత్ర సంప్రదాయమన్నారు. తన పరిశోధనలు, రచనల ద్వారా ప్రాచీన భారతదేశ చరిత్ర రచనను కొత్త మలుపు తిప్పారు

(The Historian and the Epic, Annals of the Bhandarkar Oriental Research Institute, 1979).

పురాణ కథలను శ్రద్ధగా విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేస్తే మన ప్రాచీన చరిత్రను హేతుబద్ధంగా రాయడానికి అత్యంత విలువైన సమాచారం లభ్యమవుతుంది. సప్తసింధు ప్రాంతం నుంచి మన నాగరికత భరతఖండంలోని అన్ని దిక్కులకూ వ్యాప్తి చెందిన ప్రక్రియను, క్రమాన్ని మహాభారతం మనకు అందిస్తుంది. ప్రాచీన భారతవర్షంలో విలసిల్లిన వివిధ తెగలు, ప్రాంతాలు, గణసంఘాలు, రాజ్యాలు, పట్టణాలు, జనపదాలు, క్షత్రియుల వంశ చరిత్రలు (చంద్రవంశ, సూర్యవంశ రాజుల చరిత్రలు), విశిష్ట బ్రాహ్మణ కుదుళ్ళ గోత్ర సంచయాలు, వైవిధ్యమైన ప్రజల జీవిత సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, మతవిశ్వాసాలు, ఆచరణ మొదలగు అంశాలను గురించి మహాభారతం విలువైన సమాచారాన్ని పదిలపరిచింది. పురాణ సాహిత్య రూపంలో మిళితమై ఉన్న ఇట్టి అమూల్యమైన చారిత్రక సమాచారాన్ని మనం సేకరించి విశ్లేషణ చేయాలి.

శాస్త్ర వాఙ్మయం సంస్కృత సాహిత్యంలో ఒక విభాగం. మహాభారతాన్ని నీతిశాస్త్రమని, అర్థశాస్త్రమని పేర్కొన్నారు. ఈ రెండు శాస్త్రాలు మహాభారతంలో రాజనీతిశాస్త్రానికి సమాంతర, పర్యాయ జ్ఞాన సంచయాలుగా పరిగణింపబడినవి. రాజ్యతంత్ర వ్యూహాలు, ప్రక్రియలు మహాభారత కథకు మూలాధారం. అందుచేత మహాభారతంలో లభించే రాజనీతిశాస్త్ర విజ్ఞానం, తత్సంబంధమైన ఆచరణాత్మక ప్రక్రియలు ప్రశంసనీయం.

కొందరు ఋషులు (బృహస్పతి, శుక్రాచార్యుడు, భరద్వాజుడు) రాజనీతి శాస్త్రాధ్యయనాన్ని చేపట్టి శాస్త్ర గ్రంథాలను రచించారు. మహాభారతం రాజనీతి ప్రక్రియలను గురించి వారి సూత్రాలను/సూక్తులను ఉపయుక్తంగా కథాగమనంలో పలు సందర్భాలలో పేర్కొన్నది. పరిపూర్ణమైన రాజనీతిశాస్త్ర విజ్ఞానం మహాభారతంలో లభిస్తుంది. రాజ్యాధికార స్వభావాన్ని (మానవుడు రాజ్యాధికారానికి దాసుడు, రాజ్యాధికారం ఎవరికీ దాసోహం కాదు), రాజ్యాధికార సాధన మార్గాలను (హింస, యుద్ధం, కుట్రలు, కుతంత్రాలు, శత్రు నాశనం), రాజ్యాధికార లక్ష్యాలను (ప్రజల రక్షణ, సమాజ శ్రేయస్సు, శాంతి) మహాభారతం సిద్ధాంతపర చర్చలను, ఆచర ణాత్మక అనుభవసారాన్ని సమన్వయం చేసి సమ్యక్ దృష్టితో పరిశీలించింది. ధర్మార్థాలకు గల వైరుధ్యం, మానవుని అహం కారం, అసూయా గుణం రాజనీతికి ప్రధాన సమస్యలు. రాజ్యాధికార నిర్వాహకులు నియమబద్ధులై ప్రజలు సన్మార్గవర్తనులుగా జీవించడానికనువైన ఆర్థిక, సామాజిక వ్యవస్థను పరిరక్షించాలి. న్యాయబద్ధమైన రాజ్యాధికారం ప్రజలు, పాలకులు ధర్మార్థకా మాల సాధనతో జీవితాన్ని పరిపుష్టం చేసుకోవడానికి తోడ్పడాలి. ఇంతటి నిండైన రాజనీతిశాస్త్ర జ్ఞానాన్ని మహాభారతం మనకందించింది.

**మహాభారతం మన ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి మూల గ్రంథం. మన చరిత్ర సంప్రదాయాల నిజస్వరూప లక్షణ లక్ష్యాలను తెలుసుకొనుటకుగాను మహా భారతాన్ని చదవాలి. మన సంప్రదాయ నాగరికతలో ఎన్నో దోషాలున్నాయి. దుష్ట సంప్రదాయాలను, ఆచారాలను, మూఢవిశ్వాసాలను తిరస్కరించడానికి, సంస్కరించడానికి ఆదాన ప్రదానాలు మహాభారతంలో ఉన్నవి. అందుకని మనం మహాభారతంలో గల కట్టుకథలను విస్మరించి శ్రద్ధగా, విమర్శనాత్మక దృష్టితో మన సంప్రదాయాన్ని తెలుసుకొనుటకు, సంప్రదాయ సంస్కృతిని సంస్కరించుటకు మహాభారతాన్ని చదవాలి.** ❑

– విశాలాంధ్ర దీపావళి ప్రత్యేక సంచిక, 2018

# భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడు ఆచార్య కె.వి.



- టి.రవిచంద్

మహాభారతంలో రాజనీతి తత్వశాస్త్రం (Poltical Philosophy of the Mahabharata) పరిశోధనా గ్రంథం రచయిత ఆచార్య కె.వి.గా ప్రసిద్ధుడైన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు విశ్వ విద్యాలయంలో పరిశోధన చేసి ప్రొఫెసర్ పదవి పొందిన కేవలం విద్యారంగంలోని ఆచార్యుడు మాత్రమే కాదు. ఆయన పరిశోధనా రంగంలో అధ్యయనవేత్త, విశిష్ట పరిశోధకుడు కూడా. భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడు. ఆచార్య కె.వి. సంకుచితభావాలతో పాక్షిక పరిశోధనలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో నిష్పాక్షిక పరిశోధనకు అంకితమైన పరిశోధకుడు ఆచార్య కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (కె.వి). ఆరు దశాబ్దాల క్రితం ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఉపన్యాసకుడి (లెక్చరర్)గా అడుగుపెట్టిన తొలిదశలో వామపక్ష భావప్రేరితుడైన కె.వి. 'మహాభారతంలో రాజనీతి దర్శనం'పై పరిశోధన చేయడం ఆసక్తి కర విషయం. అదే సమయంలో అంటే 1963 ప్రాంతాల్లో సమ కాలిక భారతీయ తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి సంపాదక సారథ్యంలో తెలుగు విజ్ఞాన సర్వస్వం (మతములు, దర్శనాలు) సంకలనం చేయబడింది. ఇందులో ఆచార్య కె.వి. మార్క్స్, మార్క్సిజాలపై ఒక వ్యాసం రాశారు. విశ్వ విద్యాల యంలో ప్రవేశించిన నాటి నుంచి అటు పాశ్చాత్య చింతనలో ప్రభావశీల ప్రముఖ తత్వశాస్త్రమైన మార్క్సిజం; ఇటు భారతీయ సామాజిక, తాత్విక చింతనలో విడదీయడానికి వీలులేని మహాభారతాధ్యయనంపై ప్రత్యేకమైన ఆసక్తి, అభిరుచి ఏర్పడ్డాయి. ఈ రెండు విషయాలపై ఆసక్తి, అభిమానం ఆయన జీవితాంతం వరకు కొనసాగడమే కాకుండా ఆయన అధ్యయనం, పరిశోధనా పరిధి విస్తృతమయి చివరి దశలో భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషణకు దారితీసి, ఆయన పి.హెచ్.డి. పరిశోధనా పత్రాన్ని(Thesis) సంస్కరించి పరిష్కృత పాఠాన్ని ప్రచురించాలని ప్రయత్నం చేస్తున్న తరుణంలో భౌతికంగా ఆయన మనల్ని వదిలి వెళ్ళిపోవడం విషాదకరం. ఆయన నిర్యాణం భారతీయ సంస్కృతీ ప్రేమికులను తీరని వేదనకు గురిచేసింది. ముఖ్యంగా ఈ వ్యాస రచయితను మానసికంగా ఎంతో వేదనకు గురిచేసింది. ఎందుకంటే ఆచార్య కె.వి. చివరి దశలో భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడిగా, పరిశోధకుడిగా నాకత్యంత సన్నిహిత మేధోమిత్రుడిగా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఆయన 2019-2021 మధ్య కాలాలలో రాసిన కొన్ని లేఖలు భారతీయ సంస్కృతికి ప్రధాన ప్రాతినిధ్యం వహించే మహా భారతం,బౌద్ధదర్శనాలపై ఆయన పరిశోధనాసక్తిని నిరూపిస్తాయి. 2-12-2020 తేదీన రాసిన లేఖలో 'నా Thesis(Mss) revision ఈ సంవత్సరంలో పూర్తి చేసి 2021/2022లో ముద్రించగలనని నమ్మకం కుదిరింది. భారతీయ సంస్కృతిని, మహాభారతాన్ని, బౌద్ధాన్ని నూతన కోణంలో ఆవిష్కరించటానికి ప్రయత్నం చేస్తాను" అన్నారు. ఈ మాటలు రాయడానికి ముందు ఆయన తమ పరిశోధన విషయంలో ఎంతో సంఘర్షణకు గురయినట్లు మరొక లేఖ ద్వారా అర్థమవుతుంది. ఈ లేఖ 18-11-2020న రాశారు. వృద్ధాప్యంలో ఉన్న నిబద్ధత గల పరిశోధకుడు ఒంటరితనం వల్ల వ్యక్తిగత జీవితంలో, మేధో జీవితంలో ఎదుర్కొనే తీవ్ర సమస్యల రూపం ఎలా ఉంటుందో ఈ లేఖ ప్రతిబింబిస్తుంది. ఈ సమయంలో ఆయనకు నేను రాసిన లేఖ ఆయనకు బలాన్ని, ప్రేరణను కలిగించిందని, అందుకని మామూలు అర్థంలో లాంఛనప్రాయమైన కృతజ్ఞతలు కాకుండా యథార్థంగా మనఃపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నన్నారు ఆచార్య కె.వి. ఈ మాటలు నాకెంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి.

ఆయన ఎంచుకున్న పరిశోధనా విషయం కూడా చాలా సంక్లిష్టమైనది. పరిశోధనకు ఆయన స్వీకరించిన విషయాలు - వైదిక సంప్రదాయ మహాభారతం, బౌద్ధంలపై మానవ నాగరికతలోని మేధావంతులు ఎంతో కృషి చేశారు. అటువంటి రంగంలోకి అడుగిడి పరిశోధన చేయడం సామాన్యమైన విషయం కాదు. ఆచార్య కె.వి. ఇటువంటి విలువైన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేయగలరని తన తొలి పరిశోధనా గ్రంథం 'మహాభారతంలోని రాజకీయ తత్వశాస్త్రం' విషయంలోనే నిరూపించుకున్నారు. ఈ పరిశోధనను పూర్తి చేయడానికి ఆయన పూనాలోని భండార్కర్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్‌లో నెల రోజులుండి మహాభారత దర్శనంపై మహాపండితులైన పి.వి. కాణే, డి.డి. కోశాంబి, ఆర్.ఎన్. దండేకర్, ఎం.డి. పుసాల్కర్ ప్రభృతులతో చర్చలు చేశారు. ఆనాటికది మహాభారతంలోని రాజకీయ చింతనకే పరిమితమైన పరిశోధన. కానీ నేటి మహాభారత పరిశోధన నాటి మహాభారత పరిశోధనకు సంశోధిత పరిశోధన. ఇది ఎంతో క్లిష్టమైన, ప్రయోజనకరమైన పరిశోధనా విషయం.

ఆచార్య కె.వి. 2019 సంవత్సరంలోని లేఖలో ప్రచురణార్థం సిద్ధం చేస్తున్నానని చెప్పిన ఆయన పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసం పేరే పూర్తిగా మారిపోయింది. అది Political Culture in the Mahabharata - A Dialogic Product of Vaidika Tradition and Buddhism (మహాభారతంలోని రాజకీయ సంస్కృతి – వైదిక సంప్రదాయం, బౌద్ధ సంవాదాల ఫలితం). దాదాపు ఆరు దశాబ్దాల అనంతరం ప్రచురించబోతున్న తన పి.హెచ్.డి. సిద్ధాంతాన్ని (Thesis) తదనంతర కాలంలో జరిగిన అధ్యయనాలు, పరిశోధనల ఆధారంగా భారతీయ సంస్కృతి మూలాల్ని నూతన కోణంలో పరిచయం చేయాలన్న ఉద్దేశంతో సంశోధిత ప్రతి తయారుచేయడానికి సిద్ధపడ్డారు. కానీ 'నా కలవిగాని పనిని తలకెత్తుకున్నానని అప్పుడప్పుడు నిస్పృహకు లోనవుతున్నాను. ప్రయత్నం మానను. రెండు మహాసముద్రాల సారాన్ని ఒడిసిపట్టి అన్వయించాలి. ఒడ్డెక్కుతాను. 2020వ సంవత్సరాంతానికి గ్రంథం వెలుగులోకి వస్తుందని ఆశిస్తున్నాను' అని 2019 నాటి లేఖలో రాశారు.

ఆచార్య కె.వి. తమ చివరి దశలో నాకు రాసిన ఆరు లేఖల్ని బట్టి అంచనాకు వస్తే ఆయన పి.హెచ్.డి. సిద్ధాంతం (Thesis) పరిష్కరణ పూర్తయింది. మహాభారతంలోని రాజకీయ సంస్కృతి – వైదిక సంప్రదాయం, బౌద్ధాల సంవాద ఫలితం పేరుతో రాతప్రతి రూపంలో ఉంది. అయితే అనుకోకుండా ఆయన ఆరోగ్యం పాడవడం, విశాఖపట్నం నుంచి రాజమండ్రిలో ఉన్న చిన్న కుమారుడి దగ్గరకు చేరడంతో ఆ రాతప్రతి (Manuscript)ని ఎక్కడో కోల్పోవడం జరిగింది. కొంత కాలానికి ఆయన మరణించడంతో సంస్కరించి పరిష్కరించిన ఆచార్య కె.వి. పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం గురించి ఎవరికీ ఏమీ తెలియకుండాపోయింది. ఇది విచారకర మైన విషయం. చివరి దశలో ఆచార్య కె.వి. రాసిన అమూల్య మైన ఈ లేఖలే లేకపోతే ప్రస్తుతం ముద్రణలో ఉన్న పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథంలోని మహాభారతంలో రాజకీయ తత్వశాస్త్రం గురించి 1963 సంవత్సరంలో ఆయన ప్రకటించిన భావాలే ఆయన చివరి అభిప్రాయాలుగా భావించడం జరిగేది. ఆనాటికి ఆయన పరిశోధనాంశం మహాభారతంలోని రాజకీయ దర్శనమే!

కానీ ఆయన జీవిత చివరి దశలో 'మహాభారతంలోని రాజకీయ సంస్కృతి వైదిక సంప్రదాయం, బౌద్ధ ధర్మాల సంభాషణ, సంవాదాల ఫలితం'గా భావించి దానిపై గాఢమైన అధ్యయనం చేశారు. దీనిని బట్టి ఆయన తమ జీవిత చరమదశలో భారతీయ సంస్కృతీ మూలాల గురించి ప్రధాన స్రవంతి ఆలోచనా ధోరణికి భిన్నంగా ఆలోచించేవారని భావించవచ్చు. దానికి ప్రబల తార్కాణం మిళింద ప్రచురణల తరఫున ప్రచురించిన ఇండాలజీ(భారతతత్వం)పై మా ఆంగ్ల కరపత్రం Joint Communiq (సంయుక్త ప్రకటన). ఈ ప్రకటనను వైదిక ధర్మ ప్రతినిధిగా జయేంద్ర సరస్వతి, బౌద్ధ ధర్మ ప్రతినిధిగా సత్యనారాయణ గోయంకాలు చేశారు. ఈ ప్రకటనను 'ఏది భారతీయ సంస్కృతి' అనే ప్రశ్నకు సరైన చారిత్రక సమాధానంగా భావించవచ్చు. ఈ ప్రకటనలో ఈ ఇద్దరు మత ప్రతినిధులు (వైదిక, శ్రమణ సంప్రదాయం) 'ప్రాచీన భారతదేశంలో రెండు సంప్రదాయాలున్నాయని, అవి: 1. వైదిక సంప్రదాయం 2. శ్రమణ సంప్రదాయం. ఈ రెండు సంప్రదాయాల మధ్య స్నేహపూరిత, సమన్వయ పూరితమైన సంబంధాలుండాలని, ఇరు సంప్రదాయాల వాళ్ళు పరస్పరం తమ ప్రత్యేకతను చాటుకొంటూ, గతంలో జరిగిన తప్పిదాల్ని పునరావృతం కాకుండా చూడాలని' భావించారు. 2015 సంవత్సరంలో మేము ప్రచురించిన 'ఈ సంయుక్త ప్రకటన' Joint Communiq గురించి ఆచార్య కె.వి. తమ లేఖలో a valuable Pamphlet on Indology (భారతతత్వంపై విలువైన కరపత్రం) అని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

కొంతమంది రాజకీయ ప్రతినిధులు భారతీయ సంస్కృతిని మతవాద దృష్టితో వ్యాఖ్యానిస్తూ, దీనిలోని రెండు ప్రధానమైన ఉపసంస్కృతులను విస్మరించి, వైదిక సంస్కృతి (హిందూ సంస్కృతి) మాత్రమే భారతీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే ఏకైక సంస్కృతిగా భావిస్తున్న తరుణంలో, ఆచార్య కె.వి. మహా భారతంలోని సంస్కృతి – వైదిక, బౌద్ధ సంభాషణల ఫలితంగా భావించడం ప్రత్యేకంగా పేర్కొనాల్సిన విషయం. అంతేకాదు, తమ పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసానికి రాసిన పీఠికలోనే మహాభారతాన్ని గురించి ఆయన ఇలా అభివర్ణించారు. **'ఇది భారతజాతి మనసుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది బహుళ సంప్రదాయాల్ని విలీనం చేసుకున్నది. అదే సమయంలో హిందూ రాజకీయ సంప్రదాయంలోని సంపన్నత** (richness)**ను, యోగ్యంకాని విషయాల్ని** (inadequacy) **బయటపెడుతుంది.'** ఇటువంటి విమర్శనాత్మక ధోరణితోనే ఆయన మహాభారత పరిశోధన కొనసాగింది. వామపక్ష భావప్రేరితుడైన ఈ ఆచార్యుడు మహాభారతంలోని రాజకీయ తత్వాన్ని వస్తుగత దృక్పథంతోనే అధ్యయనం చేశారు.

ఆచార్య కె.వి. 2015 సంవత్సరంలో సాహిత్య సురభి, విశాఖపట్నం వేదికపై నుంచి చేసిన ప్రసంగ వ్యాసం 'మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి?' పరిశీలిస్తే మహాభారత అధ్యయనం పట్ల ఆయన స్పష్టమైన అభిప్రాయాలు మనకర్థమవుతాయి. **'మహాభారతం మన ప్రాచీన చరిత్రకు,**

**సంస్కృతికి మూలగ్రంథం. మన చరిత్ర సంప్రదాయాల నిజస్వరూప లక్షణ లక్ష్యాలను తెలుసుకొనుట కుగాను మహాభారతాన్ని చదవాలి. మన సంప్రదాయ నాగరికతలో ఎన్నో దోషాలున్నాయి. దుష్ట సంప్రదాయాలను, ఆచారాలను, మూఢనమ్మకాలను తిరస్కరించటానికి, సంస్కరించటానికి ఆదాన ప్రదానాలు మహాభారతంలో ఉన్నవి. అందుకని మనం మహాభారతంలోని కట్టుకథలను విస్మరించి, శ్రద్ధగా విమర్శనాత్మక దృష్టితో మన సంప్రదాయాన్ని తెలుసుకొనుటకు, సంప్రదాయ సంస్కృతిని సంస్కరించుటకు మహాభారతాన్ని చదవాలి'** (విశాలాంధ్ర దీపావళి ప్రత్యేక సంచిక – 2018).

మన ప్రాచీన సంస్కృత సాహిత్యంలోని శకుంతల కథ భారతీయులందరికీ చిరపరిచితమే. ఈ కథ, ఈ కథలోని శకుంతల పాత్ర మహాకవి కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలము' నాటకం ద్వారా విశేషమైన ప్రాచుర్యాన్ని పొందింది. శకుంతల పాత్ర చిత్రణలో కాళిదాసు ఆమెను ఒక నిస్సహాయ స్త్రీ మూర్తిగానే చిత్రించాడు. కాకపోతే ఆమెను ఒక ముగ్ధ, లజ్జాశీలిగా చిత్రించాడు. శకుంతల కథ మహాభారతం (ఆది పర్వం)లో కూడా వస్తుంది. కాళిదాసు మహాభారత కథనే నాటకంగా రూపొందించాడని విమర్శకుల అభిప్రాయం. మహాభారత శకుంతలకు, కాళిదాసు శకుంతల పాత్ర చిత్రణకు చాలా వ్యత్యాసముంది. మహాభారత శకుంతల ప్రౌఢ, నిర్భీక. కొన్ని వందల సంవత్సరాల క్రితం భార్యాభర్తల సంబంధాన్ని, బంధాన్ని గురించి శకుంతల దుష్యంతుడితో మహాభారతంలో అన్న మాటలు: **'అర్థం భార్యా మనుష్యస్య, భార్యా శ్రేష్ఠతమః సఖా, భార్యా మూలం త్రివర్గస్య, భార్యా మిత్రం మరిష్యతః' (మనిషిలో భార్య సగభాగం, స్నేహితుల్లో భార్య ఉత్తమ స్నేహితురాలు; ధర్మ, అర్థ, కామ అనే త్రివర్గాలకు మూలం భార్య, మరణించే వరకూ భార్యే నిజమైన మిత్రుడు)** నేటికీ ఆదర్శనీయం, అనుసరణీయాలు! స్వాభిమానయుతంగా జీవించడం, స్వాభిమానయుతంగా మరణించడం – ఇవే మహాభారతంలోని విషయాలన్నారు ఇరావతి కర్వే అనే మహాభారత విమర్శకురాలు. అందువల్లే ఆచార్య కె.వి. కూడా 'శకుంతల మహాభారత కథలో మహిళా స్వావలంబనకు, సాధికారతకు, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి సాక్షాత్కార దర్శనం' అన్నారు. అంతేకాదు 'మహాభారతంలోని శకుంతలను, కాళిదాసు నాటకంలోని శకుంతలతో పోల్చి చదివితే మన చరిత్ర, సంస్కృతి నిజ స్వరూప స్వభావాన్ని ప్రతిబింబించే అద్దం మహాభారతమని మనకు తెలుస్తుంది' అని కూడా అన్నారు.

ఆచార్య కె.వి. 1963 సంవత్సరంలో తన పి.హెచ్.డి. పరిశోధనకు మహాభారతంలోని రాజనీతి తత్వశాస్త్రానికే పరిమితమయి పరిశోధన చేసినా, ఆ తర్వాత కాలంలో మహాభారతాన్ని సమగ్ర పరిశోధన చేయాలని సంకల్పించుకున్నారు. ఆనాడు తమ పరిశోధనకు పర్యవేక్షకుడిగా వ్యవహరించిన ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి అభిప్రాయపడినట్లు 'భారతీయ మనస్సును అర్థం చేసుకోవడంలో మహాభారత అధ్యయనంతో ప్రభావితుణ్ణయ్యాను' అని కూడా ఆచార్య కె.వి. భావించారు. అందువల్లే ఆయన పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని ముద్రించాలనుకున్నప్పుడు పాత శీర్షికను మార్చి కొత్త శీర్షికగా 'మహాభారతంలోని రాజకీయ సంస్కృతి – వైదిక సంప్రదాయ, బౌద్ధాల సంభాషణల ఫలితం'గా సంస్కరించారు. ఈ పరిష్కరణ ప్రతి కోసం మహాభారతం, వైదిక సంప్రదాయం, బౌద్ధాలపై వచ్చిన, వస్తున్న సాహిత్యాన్ని గాఢంగా అధ్యయనం చేశారు. ఆ అధ్యయన పరిశోధనా ఫలితాలు మనకందబోతున్న తరుణంలో ఆయన మనల్ని వదిలి వెళ్ళిపోయారు. మన ప్రాచీన భారతీయ సంస్కృతి మూలాలు, పరిణామంపై వినూత్న కోణంలో చూపాలనుకున్న ఆయన 'కల' కలగానే మిగిలిపోయింది. చివరి దశలో ఆయన రాసిన కొన్ని లేఖలు తన పరిశోధన కోసం ఆయన అహోరాత్రం (day and night) ఎంత బృహత్తర ప్రయత్నం చేశారో అవగతం చేస్తాయి.

ప్రస్తుతం ముద్రణ పొందుతున్న ఆచార్య కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (కె.వి.) 1963 సంవత్సరం నాటి 'Poltical Philosophy of the Mahabharata' యథాతథ ప్రతి సాధికారికమైనది. దీనిలో ఆయన చేయతలపెట్టిన మార్పులు, చేర్పులు ఏవీ చోటు చేసుకోలేదు. 2-12-2020 లేఖలో ఆశించినట్టుగా 'భారతీయ సంస్కృతిని, మహాభారతాన్ని, బౌద్ధాన్ని నూతన కోణంలో ఆవిష్కరించటానికి ప్రయత్నం చేస్తాను' అన్న లక్ష్యం నెరవేరకుండానే ఆయన వెళ్ళిపోయారు. ఆ వెలితిని ఆయన మాత్రమే పూడ్చగలరు. ఈ మాటలు కీర్తిశేషులైన పెద్దల్ని శ్లాఘించినట్లుగా శ్లాఘించటం లేదు; ఆయన పరిశోధనా పద్ధతి విశిష్టతను గ్రహించినవాడిగా చెబుతున్నాను. ఈ దేశంలో పదవీ విరమణ చేసిన ఏ ప్రొఫెసర్ తనకు ఏమాత్రం సంబంధం లేని కొత్త రంగం (విషయం) లోకి ప్రవేశించి ఆ రంగంలోని ప్రముఖులందరూ 'విస్మరించిన, ఉపేక్షించిన సత్యాలను తవ్వి తలకెత్తుకొని కొత్త ప్రతిపాదనలు' చేసి అందరి ఆమోదం పొందలేరు. అటువంటి అపురూపమైన పరిశోధన ఆచార్య కె.వి. పదమూడు సంవత్సరాల క్రితం Colonialism, Orientalism and the Dravidian Languages (వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు) గ్రంథం ద్వారా ప్రపంచంలోని తెలుగు భాషా ప్రేమికుల్ని

ఆశ్చర్యచకితుల్ని చేశారు.

విశ్వ విద్యాలయాల్లో ఉండే ప్రొఫెసర్లు ఏమి చేస్తారులే, పదవీ విరమణ పొందే వరకు ఉద్యోగాలు చేసి జీతాలు సంపాదించుకుంటారనే అపప్రథ సర్వత్రా వ్యాపిస్తున్న దశలో, పదవీ విరమణానంతరం నిష్ఠగా, నిబద్ధతతో 'తెలుగుభాష – ఆధునిక కాలంలో ద్రావిడ భాషా కుటుంబ సిద్ధాంతానికి వేదిక' అని ఆచార్య వెంకటేశ్వర్లు అసాధారణమైన పరిశ్రమతో సాహిత్యాధారాలతో నిరూపించి ఔరా అనిపించుకున్నారు. ద్రావిడ భాషలు సంస్కృతజన్యం కాదని, అవి స్వతంత్ర ప్రతిపత్తి గల భాషా కుటుంబానికి చెందినవని తొలిసారి నిరూపించినవాడు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (1777–1819). ఈయన ప్రతిపాదించిన ద్రావిడ భాషా కుటుంబ భావనకు స్వదేశీ సంస్కృతాంధ్ర పండితులు వేదం పట్టాభిరామశాస్త్రి రాసిన 'ఆంధ్రధాతుమాల' (1814–15), మామిడి వెంకయ్య 'ఆంధ్రదీపిక' (1806) మూలాధారాలు. ఆధునిక భారతదేశంలో తెలుగువారికి గల స్థానాన్ని, వారి ఆరంభదశను తెలుసుకోవాలనుకొనేవాళ్ళకు ఆచార్య కె.వి. 'ద్రావిడ భాషలు' ప్రామాణిక భాషా చరిత్ర గ్రంథంగా ఉపయోగపడుతుంది.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ద్రావిడ భాషా కుటుంబావతరణకు మూలాధార గ్రంథాలలో ఒకటి మామిడి వెంకయ్య 'ఆంధ్రదీపిక' (1806). దీనిని 1965లో వాసవీ ప్రచురణ సమితి, మచిలీపట్నం ప్రచురించింది. ఈ గ్రంథానికి రచయిత మామిడి వెంకయ్య రచించిన పీఠిక చాలా ముఖ్యమైనది. ఒక విధంగా ఆచార్య కె.వి. అభివర్ణించినట్లు ఆ పీఠిక ఆంధ్రదీపికకు 'గుండెకాయ' వంటిది. దాన్ని ముద్రిత ప్రచురణలో ప్రచురణకర్తలు వదిలేశారు! తమకు తోచిన విధంగా నిఘంటువును మార్చి ముద్రించి మామిడి వెంకయ్యను వెలుగులోకి తెస్తున్నామనుకొని ఆయన అపారమైన పాండిత్యాన్ని అంధకారంలోకి తోసేశారు! 'కాళిదాసు కవిత్వం కొంత, నా పైత్యం కొంత' అన్న విధంగా ప్రచురించబడిన వాసవీ ప్రచురణ సమితి ఆంధ్రదీపిక ప్రతినే బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు 2012లో మరలా ప్రచురించింది. 1965లో, 2012లో ప్రచురించిన రెండు ముద్రిత ప్రతుల్లో వెంకయ్య పీఠికను వదిలేశారు! ఆచార్య కె.వి. పరిశోధనల ప్రకారం 'ఆంధ్రదీపిక'కు మామిడి వెంకయ్య రాసిన పీఠిక తెలుగు సాహిత్య చరిత్రలో 'కొత్తదారులు వేసే అధ్యయనం'. ఇటువంటి అరుదైన సత్యాల్ని 'కలోనియలిజం, ఓరియంటలిజం అండ్ ద్రవిడియన్ ల్యాంగ్వేజెస్' (2012) గ్రంథం ద్వారా ఆచార్య కె.వి. వెలుగులోకి తెచ్చారు.

అందువల్ల ఆచార్య కె.వి. చేయతలపెట్టిన పరిశోధనాయజ్ఞం Political Culture in the Mahabharata - A Dialogic Product of Vaidika Tradition and Buddhism (మహాభారతంలోని రాజకీయ సంస్కృతి – వైదిక సంప్రదాయ, బౌద్ధాల సంవాద ఫలితం) ఆయన మాత్రమే పూర్తి చేయగలిగింది. పరిశోధకుడిగా మూలాధారాలపై ఆధారపడి ఆయన ఎంచుకున్న పరిశోధనాంశాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి చారిత్రక సత్యాల్ని ఆలోచనాపరులైన అందరిచేత ఆమోదింపజేయగలిగిన సామర్థ్యం ఆయనకు మాత్రమే ఉందని 'వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు' గ్రంథ రచన ద్వారా ఆయన మరోసారి నిరూపించుకున్నారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే 1960 ప్రాంతాల్లో విద్యా రంగంలోకి అధ్యాపకుడిగా అడుగుపెట్టిన ఆచార్య కె.వి. విద్యావిషయకంగానే అటు మార్క్సిస్టు తత్వశాస్త్రం పట్ల, ఇటు మహాభారత దర్శనం పట్ల సమానమైన ఆసక్తిని, అభిమానాన్ని ప్రదర్శించడం. మహాభారతంలోని రాజకీయ తత్వశాస్త్రంపై పరిశోధన చేస్తున్న సమయంలోనే పూనాలో పి.వి. కాణేలాంటి సంస్కృత పండితులతోపాటు మార్క్సిస్టు చరిత్రకారుడు డి.డి. కోశాంబితో చర్చలు, సంభాషణలు జరపడం ద్వారా ఆయన రెండు భిన్న దృక్పథాల పట్ల సమాన గౌరవం ప్రదర్శించేవారని అర్థం చేసుకోవచ్చు. ఇదే ధోరణిని ఆయన జీవితాంతం వరకు కొనసాగించారు. వామపక్షవాదుల్లోని 'అతిని' నిరసిస్తూ ఆయన జీవిత చివరిదశలో రాసిన ప్రసంగ వ్యాసం 'మహాభారతాన్ని ఎలా, ఎందుకు చదవాలి?' భారతీయ సంస్కృతి, మహాభారతం లాంటి ప్రాచీన సాహిత్యం పట్ల వామపక్ష వాదులనుకొనే వారికి ఎటువంటి వైఖరి ఉండాలో తెలియజేస్తుంది.

ఆచార్య కె.వి. రాసిన మరొక లేఖలో ఆయన స్వీకరించిన కొత్త పరిశోధనాంశాలయిన వైదిక సంప్రదాయ, బౌద్ధ దర్శనాల గురించి రాస్తూ 'రెండు మహాసముద్రాల సారాన్ని ఒడిసిపట్టి అన్వయించాలి' అంటారు. నిజానికి ఆధునిక యుగంలో మార్క్సిస్టు తత్వశాస్త్రం కూడా ఒక మహాసాగరమే! ఆ మహాసాగరాన్ని 'ఈదాము', ఒడ్డుకు చేరుకున్నామనుకున్న వాళ్ళంతా మధ్యలోనే ఎటు చేరుకోవాలో తెలియక 'మునిగి' పోయారు. అటువంటి మహోన్నతమైన మహాసాగరాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ యూనియన్‌లోని ప్రయోగాల జయాపజయాలను మార్క్సిజం వైఫల్యంగా పరిగణించలేమంటాడు! విజ్ఞత గల చరిత్రకారుడు కాబట్టి ఆయనా అలా భావించాడు. తాత్విక విజ్ఞానాన్ని, శాస్త్ర (సైన్స్) విజ్ఞానం వలె ప్రయోగశాలలో ప్రయోగాలు చేసి చూపించి నిరూపించలేం. తాత్విక విజ్ఞానం మానవుడి విజ్ఞత, వివేకాలపై ఆధారపడి అది

**(మిగతా 41వ పేజీలో)**

# మానవీయ మూర్తి కె.వి.



**- ఆర్వీ రామారావు**

కొత్తగడ్డ వెంకటేశ్వర్లు అంటే గుర్తుపట్టేవారు చాలా తక్కువ మంది ఉండొచ్చు. కానీ కె.వి. అంటే చాలా మంది గుర్తుపడతారు. ఆంధ్రా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్ర విభాగానికి మూలవిరాట్టుగా ఉన్నారు. ఆచార్య కె.వి. 2023 జనవరి 10వ తేదీ మంగళవారం రాజమండ్రిలో 88వ ఏట అస్తమించారు. ఆయనకు ఇద్దరు అబ్బాయిలు రజనీకాంత్, శ్రీనివాస్, ఒక అమ్మాయి లక్ష్మి. రాజమండ్రిలో శ్రీనివాస్ ఇంట్లో ఉండగానే కె.వి. తుదిశ్వాస విడిచారు. కాలికి గ్యాంగ్రీన్ వచ్చినందువల్ల ఒక పాదం తీసేయవలసి వచ్చింది. అప్పటి నుంచి చిన్నబ్బాయి దగ్గరే ఉండేవారు. ఆయన స్వస్థలం తెనాలి అయినా వృత్తి రీత్యా విశాఖపట్నంలోనే దశాబ్దాలపాటు గడిపినందువల్ల ఆ నగరంతో ఆయన జీవితం పెనవేసుకు పోయింది. రాజమండ్రిలో కొడుకు దగ్గర ఉన్నప్పుడు, చివరి రోజుల్లోనూ విశాఖపట్నం వెళ్ళాలని తపనపడ్డారు. రెండేళ్ళ కిందట ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా విశాఖపట్నం వెళ్ళినప్పుడు డి.వి.వి.ఎస్. వర్మ, నేను ప్రత్యేకంగా వెళ్ళి ఆయనను కలుసుకున్నాం. అప్పటికే ఆయన ఒంటరి. ఆయన భార్య శారద అంతకుముందే మరణించారు. ఆమె ఆంధ్రా విశ్వ విద్యాలయంలో లైబ్రేరియన్‌గా పీహెచ్‌డీ చేశారు. మేము వెళ్ళినప్పుడు ఆయన స్వయంగా టీ తయారు చేసి ఇచ్చారు. దీన్నిబట్టి మనుషులంటే ఆయనకు ఎంత అభిమానమో తెలుసుకోవచ్చు. కొత్త సచ్చిదానందమూర్తి పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ చేశారు. తెలుగు ద్రావిడ మూలాలున్న భాష అని కె.వి. సాధికారికంగా నిరూపించారు. ఆ సిద్ధాంత గ్రంథాన్ని తర్వాత తెలుగులోకి అనువదించారు. ఆ గ్రంథాన్ని ఎమెస్కో ప్రచురించింది.

ఆచార్య కె.వి. ఏం రాసినా లోతైన పరిశోధన చేసేవారు. అందుకే ఆయన బహుగ్రంథకర్త కాలేదు. ఆయనను 'రాయని భాస్కరుడు' అన్నవారూ ఉన్నారు. ఆర్.వి.ఆర్. చంద్రశేఖర రావు, ఆచార్య ప్రసన్నకుమార్, ఆచార్య ప్రసాదరావు కె.వి. గారి సమకాలికులు. మూడేళ్ళపాటు ఆయన ఆంధ్రా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. కొంత కాలం విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత హాస్టల్ వార్డెన్‌గా ఉన్నారు. ఆయనకున్న అర్హతకు ఒక దశలో ఆయన వైస్ ఛాన్సలర్ కావాల్సింది. కానీ ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్న రాజకీయాల కారణంగా ఆ అవకాశం కోల్పోయారు. ఆయన ఎప్పుడూ విద్యార్థి పక్షపాతి. కాస్త తెలివి తేటలు ప్రదర్శించే విద్యార్థులు తారసపడితే వారిని అమితంగా ప్రోత్సహించే వారు. ఎప్పుడూ విద్యార్థులకు దగ్గరగా ఉండే వారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి అవసరమైనప్పుడు వీధి పోరాటాలు చేయడానికి ఆయన వెనుకాడలేదు. అనేకమంది విద్యార్థులు చదువుకోవడానికి ఆర్థికంగా గుప్తదానాలు చేసేవారు. ముఖ్యంగా అవకాశాలు తక్కువగా ఉండే దళిత విద్యార్థులకు బాసటగా నిలిచేవారు. భార్య శారద అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవ నిరుపమానమైనది. అన్నీ తానై సపర్యలు చేశారు. విశాలాంధ్ర ప్రచురణాలయం 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' ప్రచురించింది. ఎప్పటికప్పుడు దీనిలో కొత్త సమాచారం చేర్చి అనేకసార్లు పునర్ముద్రించారు. ఇందులో ఆయన అనేక విలువైన వ్యాసాలు రాశారు.

ఆయన రాసిన గ్రంథాలు సంఖ్యలో తక్కువైనా దేశమంతా ఆయనకు మంచి గుర్తింపు ఉండేది. విశ్వ విద్యాలయాల్లో అధ్యాపకులుగా పనిచేసి వెళ్ళేవారు చాలామంది ఉంటారు. కానీ అందరి అభిమానాన్ని చూరగొని, విద్యార్థులకు అండగా నిలిచి, వారి అభ్యున్నతి కోసం తపించిన కె.వి.లాంటివారు గుప్పెడు మందే ఉంటారు. ఆయనకున్న పరిశోధనా దృష్టి చాలా విస్తృతమైనది. ఆయనకు నిజాయితీతోపాటు నిబద్ధత, విద్యావేత్తకుండే లక్షణాలు అపారంగా ఉండేవి. భారత సమాజంలో ఉన్న దోపిడీ విధానాన్ని, రాజకీయాలను ఆయన విడమరిచిన తీరు ఆశ్చర్యం కలిగించేది. రెండేళ్ళ కిందట ఆయనను కలుసుకున్నప్పుడు 86 ఏళ్ళ ఆ మనిషిలో సమాజం కోసం ఎంత తపన ఉందో చూసి ఆలోచనాపరులకు వయసుతో నిమిత్తం లేదనిపించింది. "మనం ఏదైనా చేయాలి" అని ఆ వయసులో కూడా అన్నారు. ఆయన రాసిన "డెమోక్రసీ ఎట్ వర్క్", వలసవాదం మీద రాసిన గ్రంథం నిరుపమానమైనవి. పరిచయం ఉన్నవారు ఆయనను మరిచిపోవడం కష్టం. చుట్టూ కుళ్ళు రాజకీయాల కంపు కొడుతున్నా ఆయన జీవితాంతం మానవీయ విలువలకే ప్రాధాన్యం ఇచ్చారు. ❑

**(జనవరి 13, 2023 విశాలాంధ్ర నుంచి)**

# ఎందరికో స్ఫూర్తిప్రదాత కె.వి. మాస్టారు



- ఎస్.మనోరమ

కె.వి. మాస్టారు ఆంధ్రా యూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర అధ్యాపకులుగా పనిచేసిన విశ్రాంత ఆచార్యులు. పూర్తి పేరు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు. అందరికీ కె.వి.గానే సుపరిచితులు. జనవరి 10న రాజమండ్రిలో తన కుమారుని ఇంట తుదిశ్వాస విడిచారు. ఆయన సంస్మరణ సమావేశాలు జనవరి 22న రాజమండ్రిలో, జనవరి 23న విశాఖపట్నంలో జరుగుతున్నాయి. కె.వి. గారు కేవలం పాఠాలను బోధించిన అధ్యాపకుడు మాత్రమే కాదు. ఆనాడు ఆర్ట్స్ కాలేజీలో కొత్త సచ్చిదానందమూర్తి, ఆర్.వి.ఆర్. చంద్రశేఖర రావు, జి. పార్థసారథి వంటివారు కేవలం పాఠాలు చెప్పే అధ్యాపకులు మాత్రమే కాదు, విద్యార్థులను ప్రభావితం చేసిన ఉద్దండులు. అందులో కె.వి. గారిది మాత్రం ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. ఆయన ప్లేటో, అరిస్టాటిల్, మార్క్స్... ఎవరి గురించి పాఠం చెప్పినా స్వయంగా వారే వచ్చి పాఠం చెబుతున్నట్లు ఉండేది. అలా పరకాయ ప్రవేశం చేసి చెప్పగల ప్రజ్ఞాశాలి. ఆయన చెప్పే దానిలో ఉండే తర్కం, చారిత్రక నేపథ్యం, విశ్లేషణలో కొత్తచూపు అందరినీ కట్టిపడేసేవి. అందువల్లనే విద్యార్థులను ఆయన సూదంటు రాయిలా ఆకర్షించేవారు. తరగతి బయట ఆయన చేసే ప్రసంగాలకు అన్ని ఫ్యాకల్టీల విద్యార్థులు వచ్చేవారు.



యూనివర్సిటీలో ఆయనిది స్పష్టమైన వామపక్షం. పాఠాలకు వెలుపల బోధించే వామపక్షం కాదు. పాఠంలో అంతర్లీనంగా సాగే వామపక్షం. వాస్తవికత కోసం చేసే అన్వేషణ నుంచి పుట్టుకొచ్చే వామపక్షం. అదే ఆయన బోధనా పద్ధతి ప్రత్యేకత. "మహాభారతంలో రాజనీతి" అన్న అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ పరిశోధనా సమయంలో ఆయన ప్రఖ్యాత చరిత్రకారుడు, మార్క్సిస్టు విశ్లేషకుడు డి.డి. కోశాంబిని సంప్రదించడమే కాకుండా ఆయన సాన్నిహిత్యాన్ని పొందారు. కోశాంబి ప్రభావం ఆయన మీద గాఢంగా పడింది. లోతైన పరిశోధనకు పురికొల్పింది ఈ ప్రభావమే కావచ్చు.

ఆయన రాసిన "డెమోక్రసీ ఎట్ వర్క్" అన్న పుస్తకం అందరి మన్ననలు పొందింది. తెలుగు భాషకు మూలాలు ద్రావిడ భాషకు చెందినవేనని సాధికారికంగా నిరూపిస్తూ రాసిన పుస్తకం లోతైన పరిశోధనకు నిదర్శనంగా నిలుస్తుంది. మార్క్స్ ఆసియా తరహా ఉత్పత్తి విధానంపై సహేతుకమైన విమర్శతో మన గ్రామీణ వ్యవస్థను విశ్లేషిస్తూ ఆయన రామచంద్రపురంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు చెలికాని రామారావు స్మారకోపన్యాసం చేయడం ఈ కోవకే చెందుతుంది. మార్క్స్ మెగా-2 మార్క్స్ రాతప్రతులు, చివరి దశ రచనల ప్రత్యేక సంచికను ప్రస్తావిస్తూ ఈ రచనలు ముందే వెలువడి ఉంటే ఎంతో మేలు జరిగి ఉండేదని చేసిన వ్యాఖ్య ఆయన నిశిత పరిశీలనకు నిదర్శనం. అలాగే విశాలాంధ్ర ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ దర్శినిలో ఆయన వ్యాసాలు మనల్ని ఆకట్టుకుంటాయి.

కె.వి. మాస్టారిది గుంటూరు జిల్లా పాములపాడు. సహచరి శారద లైబ్రరీ సైన్స్‌లో డాక్టరేట్ చేసి యూనివర్సిటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన కొంత కాలం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. నిజాయితీకి, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా జీవించారు. నిజానికి యూనివర్సిటీకి ఆయనే వైస్ ఛాన్సలర్ కావాలి. అక్కడి సంకుచిత రాజకీయాలకు ఆయన సరిపడలేదు. సర్దుకుపోయే మనిషి కాకపోవడంతో ఆయనకు దక్కలేదు. అమ్మాయి లక్ష్మి ఎంబీఏ చేసింది. కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యింది. ఉద్యోగంలో చేరింది. వీసీని ప్రభావితం చేసి కూతురిని సెలెక్ట్ చేయించుకున్నాడన్న వార్త ఆయన చెవిన పడింది. వెంటనే అమ్మాయి చేత రాజీనామా చేయించి నిందలు వేసినవాళ్ళు సిగ్గుపడేలా చేసిన నైతికత ఆయనిది.

సహచరి శారద ముందే మరణించారు. ఇద్దరు కొడుకులు రజని, శ్రీనివాస్; ఒక అమ్మాయి లక్ష్మి. ఆయన విశాఖలో ఒంటరిగానే ఉండేవారు. విశాఖను అంతగా సొంతం చేసుకున్నారు. ఇటీవల మధుమేహం వల్ల ఒక పాదం తొలగించారు. అప్పటి నుండీ మరణించే వరకు రాజమండ్రిలో కొడుకు శ్రీనివాస్ దగ్గర ఉన్నారు. దళిత విద్యార్థుల పట్ల ఆయనకు ప్రత్యేక

మైన అభిమానం ఉండేది. ఆయన ఇంటికి నిరాఘాటంగా వెళ్ళేవారు. ఆయనతో కష్టసుఖాలు చెప్పుకునేవారు. వారి చదువుకు ఆటంకం లేకుండా అవసరమైన వారికి ఆర్థిక సాయం చేసేవారు. వందలాది విద్యార్థుల మీద చెరగని ముద్ర వేశారు. నా సన్నిహిత మిత్రుడు ఐ.వి. సాంబశివ రావు చదువు తర్వాత విజయవాడలో లెక్చరర్ అయ్యారు. శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాటానికి ఆకర్షితులై ఉద్యోగాన్ని, కుటుంబాన్ని వదులుకుని అజ్ఞాతవాసానికి వెళ్ళి, 24 సంవత్సరాలు గడిచిన తర్వాత క్యాన్సర్‌తో అజ్ఞాత వాసంలోనే మరణించారు. యూనివర్సిటీలో జరిగిన సంస్మరణ సభలో వరవరరావుతోపాటు కె.వి. కూడా పాల్గొన్నారు. సాంబశివరావు బయటే ఉండి ఉంటే సమాజానికి మరింత మేలు జరిగి ఉండేదని కె.వి. అంటే, వరవరరావు కాదన్నారట. తన అభిప్రాయమే సరైనదని కె.వి. చెప్పేవారు. ఒక బ్యాచ్ తర్వాత మరో బ్యాచ్... అలా వందలాది మంది విద్యార్థులకు ఆయన స్ఫూర్తిదాతగా ఉన్నారు. కొందరు అన్ని వామపక్ష స్రవంతులలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్నారు. కొందరు పరోక్షంగా ఆ భావజాల అభిమానులుగా కొనసాగుతున్నారు. కె.వి. మాస్టారు రాసింది తక్కువే. రచనలు మాత్రమే ఆయన భావజాల వారసత్వానికి కొలబద్దలు కావు. వందలాది మంది మెదళ్ళలో సామాజిక చైతన్య బీజాలను నాటారు. అదొక స్వీయ చలనం గల సజీవ శక్తి. అదే మన సమాజానికి తన వారసత్వంగా ఇచ్చిన సంపద. ❑

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ (ఒకనాటి కె.వి. గారి విద్యార్థిని) (జనవరి 21,2023 ఆంధ్రజ్యోతి నుంచి)**

---

# భారతీయ సంస్కృతీ మూలాల అన్వేషకుడు ఆచార్య కె.వి.

**(37వ పేజీ తరువాయి)**

ఆమోదయోగ్యమా కాదా అనేది నిర్ణయమవుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే మార్క్సిజం కూడా అటువంటి మానవతావాద తాత్విక విజ్ఞానం.

'దారిదీపం' సంపాదకులు డి.వి.వి.ఎస్. వర్మ 2022లో తమ మిత్రబృందం ప్రచురించిన కార్ల్‌మార్క్స్-మెగా2 ప్రత్యేక సంచికను ఆచార్య కె.వి.కి పంపించి, తర్వాత కొంతకాలానికి ఆయన్ని కలిశారు. సంపాదకవర్గ బృందం వెళ్ళేసరికి మనకు తెలియని మార్క్స్ రాతప్రతులు, రచనల ప్రత్యేక సంచిక ఆయన పక్కనే ఉంది. కార్ల్‌మార్క్స్‌పై ఇటువంటి ప్రత్యేక సంచిక ప్రచురించినందుకు ఆచార్య కె.వి. సంపాదకవర్గాన్ని అభినందిస్తూ, ఆయన భావాల పరిణామం ఇంతకుముందే వెలుగులోకి వచ్చి ఉంటే దేశంలో వామపక్ష ఉద్యమానికి ఎంతో మేలు జరిగి ఉండేదన్నారు. అదీ ఆచార్య కె.వి. విశిష్టత. ఎప్పుడో దశాబ్దాల క్రితం మార్క్సిజం గురించి, మహాభారతం గురించి తెలుసుకున్నదే అంతిమ సత్యంగా ఆయన ఏనాడూ భావించలేదు. దారిదీపం సంపాదకులు, ఆయన మిత్రబృందం భావించినట్టు ఆచార్య కె.వి. 'నిరంతర అధ్యయనశీలి, సత్యాన్వేషణా పరిశోధకుడు'. అటువంటి సత్యాన్వేషణా దృక్పథం మూర్తీభవించిన అన్వేషకుడు కాబట్టి దాదాపు ఆరు దశాబ్దాల క్రితం రచించిన సిద్ధాంత వ్యాసం (Ph.D. Thesis) మహాభారతంలోని రాజకీయ తత్వశాస్త్రాన్ని సంస్కరించి 'మహాభారతాన్ని, భారతీయ సంస్కృతిని, బౌద్ధధర్మాన్ని నూతన కోణంలో ఆవిష్కరించబోతున్నట్టు' తమ చివరి లేఖల్లో రాశారు. నేటి మన విద్యారంగంలో అరుదైన సత్యాన్వేషణా పరిశోధకుడు, ప్రగతిశీల విద్యావేత్త ఆచార్య కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (ఆచార్య కె.వి). ఆయన రాసిన అంతిమ లేఖలు అక్షర సాక్ష్యాలుగా మనకు మిగిలాయి.

ఆరు దశాబ్దాల తర్వాత ఆచార్య కె.వి. తొలి పరిశోధనా గ్రంథం (Ph.D. Thesis) పుస్తకరూపం ధరించడానికి ప్రధాన కారకురాలు ఆయన పూర్వ విద్యార్థిని, ఆయన తాత్విక భావజాల వారసురాలు శ్రీమతి ఎస్.మనోరమను మనమంతా హృదయపూర్వకంగా అభినందించాలి. కేవలం ఆచార్య కె.వి. పూర్వ విద్యార్థినిగానే కాకుండా మహోన్నతమైన మానవీయ విలువల కోసం జీవితాంతం నిలబడ్డ ఆదర్శ ఉపాధ్యాయుడు, అరుదైన పరిశోధకుడి భావజాల వారసురాలిగా ఆచార్య కె.వి. మరణానంతరం 'స్ఫూర్తి ప్రదాత కె.వి. మాస్టారు' పేరుతో ఆవిడ రాసిన చిరువ్యాసం ఆయన మేధోవ్యక్తిత్వాన్ని అక్షరరూ పంలో అందంగా ఆవిష్కరించి ఆయన్ని చిరస్మరణీయం చేసిం ది! ఆచార్య కె.వి. కుటుంబ సభ్యులు ఇద్దరు కుమారులు (రజనీకాంత్, శ్రీనివాస్), కుమార్తె (లక్ష్మి) కేవలం జైవిక వారసులుగా కాకుండా మానవత్వపు విలువలకు వారసులుగా పరిశోధనా పత్రం ప్రచురణకు తమవంతు సహకారం అందించినందుకు ఆచార్య కె.వి. అశేష పూర్వ విద్యార్థుల అభిమానానికి పాత్రులయ్యారు. ❑

**(Political Philosophy of the Mahabharata పుస్తకానికి శ్రీ టి. రవిచంద్ గారు తెలుగులో రాసిన ముందు మాట (5-11-2025)**




రొట్టె కొద్దీ న్యాయం

కలానికి సమాధి







పేదరికం వర్ధిల్లాలి

**కార్టూన్స్ : సతీష్ ఆచార్య**

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 4 - Issue No : 12 Online Edition September 2026

# కొత్త పుస్తకాల స్వీకారం




విశాలాంధ్ర బుక్ హౌస్ - విజయవాడ




ఎమెస్కో పబ్లికేషన్స్ - విజయవాడ




చెలికాని రామారావు ట్రస్ట్ - రామచంద్రపురం




సంప్రదించవలసిన ఫోన్ : 9490099437